TIGHT BINDING BOOK

UNIVERSAL
LIBRARY
OU_204195
UNIVERSAL
LIBRARY

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T83.1 | D78 B Accession No. GT 295

Author ద్రోణంరాజు సీతా రామా రావు.

Title భాగవత కథలహరి

1930

This book should be returned on or before the date last marked below.

శ్రీ

# భాగవతకథాలహరి.

పండిత ద్రోణంరాజు సీతారామారాయ
ప్రణీతము.

ప్రకాశకులు

ఆర్యపుస్తకాలయము,

రాజమహేంద్రవరము.

1930.

[సర్వస్వామ్యసంకలితము]

# పీఠిక.

బమ్మెర పోతన—ఆంధ్ర భాగవతము—అను నీ రెండు పేరులును వినని యాంధ్రు లుండరు. భాగవత మంతయు భక్తిజ్ఞాన వైరాగ్యబోధకు నిలయము. నిశ్చయముగా భాగవతముఁ జదివితి మని యానందింతురు గాని, సామాన్యుల కంతలి యర్థము సుభావము గాదు. అట్టిచో విద్యార్థులకుఁ గేవల మర్థము గాదని చెప్పనేల? సుసీతులకుఁ బట్టుఁగొమ్మ యగు నామహాపురాణరత్నమందలి ప్రతికథయు నెన్నిమాఱులు చదివినను మరలఁ జదువవలయు ననియే కోరిక పుట్టుచుండును. భాగవతము ననుసరించి యందులో నున్న ముఖ్యకథలను విద్యార్థులకు సుబోధకమగునట్లు ఈభాగవతకథాలహరి రచింపఁబడినది. ఇందుదాహరింపఁబడిన మహాత్ము లెల్లరు మన కాదర్శప్రాయులు. ఉపాధ్యాయు లీ గ్రంథమును విద్యార్థులచేఁ బఠింపఁజేసి వారిహృదయక్షేత్రములందు భక్తిజ్ఞాన వైరాగ్యబీజములను నాటుదురు గాక యని ప్రార్థించుచున్నాను.

ద్రో. . సీ తా రా మా రా వు.

# విషయసూచిక.

—:o:—


1. శ్రీమన్మహాభాగవతరచనాకారణము.
2. నారదునిపూర్వజన్మవృత్తాంతము.
3. పరీక్షిత్తునిచరిత్రము
4. వరాహావతారము.
5. కపిలమహాముని.
6. దక్షాధ్వరభంగము.
7. ధ్రువోపాఖ్యానము.
8. పృథుచక్రవర్తి.
9. భరతోపాఖ్యానము.
10. అజామిళోపాఖ్యానము.
11. చిత్రకేతూపాఖ్యానము.
12. ప్రహ్లాదచరిత్రము.
13. గజేంద్రమోక్షము.
14. కూర్మావతారము.
15. వామనచరిత్రము.
16. మత్స్యావతారము.
17. అంబరీషోపాఖ్యానము.
18. శ్రీరామచరిత్రము.
19. పరశురామునిచరిత్రము.
20. యయాతిచరిత్రము.
21. భరతుఁడు.

22. రంతిదేవుఁడు.
23. శ్రీకృష్ణజననము.
24. కంసవధ.
25. కృష్ణజరాసంధులయుద్ధము.
26. ముచికుందుఁడు.
27. రుక్మిణీకళ్యాణము.
28. శమంతకమణి.
29. శిశుపాలవధ.

# భాగవతకథాలహరి.

## 1. [శ్రీమన్మహాభాగవత రచనాకారణము]

—:o:—

ఉపరిచరమహారాజుపుత్రిక యైనసత్యవతియందు జనించిన వ్యాసమహర్షి సర్వవర్ణాశ్రమంబులకును హితంబు సేయనెంచి, ఋగ్యజుస్సామాథర్వణంబు లనునాలుగువేదంబులను విభాగించి యావేదంబులు విన నర్హులుగానివారికి మేలుసేయుటకు భారతాఖ్యానంబు రచించెను. ఇట్లు రచించినను నమ్మునీంద్రునకు సంతసం బొదవలేదు. సమస్తయోగివరులకు నభిలషితం బైనభాగవతముం బలుకనైతి నని యాతఁడు చింతింపఁదొడఁగెను. అట్టిసమయమున మునిసత్తముఁడును, నయవిశారదుండును నగునారదుం డరుదెంచి, యాతనిచేఁ బూజితుండై, యాతఁడు చింతాక్రాంతుఁడైయున్నవిధం బెఱింగి "మునీంద్రా! నీవు వేదంబుల విభాగించినమహానీయుఁడవు. సమస్తజనంబులకు మేలుఁ గూర్ప భారతాఖ్యానంబు రచించిన విజ్ఞానమూర్తివి. అట్టినీకు విచారకారణం బేల" యని ప్రశ్నించెను. అందులకు వ్యాసుఁడు "నారదా! నావిచారమునకుఁ గారణమిట్టి దని వచింపఁ జాలకయున్నాను. ఇన్నిగ్రంథములు రచించి

నను నాడెంద మానందము నందకయున్నది. నీవు బ్రహ్మమా నసపుత్త్రుఁడవు. సూర్యునివిధమున సకలలోకములఁ జరింతువు. సర్వజ్ఞుఁడ వగునీకుఁ దెలియనిధర్మము లేదు. నావిచారము పోవుమార్గముఁ దెలుపు" మని పలికెను. అందులకు నారదుఁ డిట్లు వచించెను. "పారాశర్యా! నీవు సమస్తధర్మశాస్త్రములఁ బలికితివి. కాని, యెందును విష్ణుకథల వక్కాణింపలేదు. హరినామస్తుతి లేనికావ్యము ప్రపంచముచే శ్లాఘింపఁబడదు.

"మ॥ అపశబ్దంబులఁ గూడియున్ హరిచరి ♦ త్రాలాపముల్ [సర్వపా
పపరిత్యాగము సేయుఁ గావున హరిన్ ♦ భావించుచుం బా [డుచున్
జపముల్ సేయుచు వీనులన్ వినుచు న ♦ శ్రాంతంబుఁ [గీర్తించుచుం
దపసుల్ సాధులు ధన్యులౌదురు గదా ♦ తత్త్వజ్ఞచింతింపుమా."

జ్ఞానం బెంతయున్నను హరిభక్తి లేకున్న నది శోభింపదు. భక్తిహీనము లయినపలుకులు నిరర్థకములు. కావున మహానుభావుండ వగునీవు శ్రీహరిలీలావిశేషంబులు భక్తితోడ వర్ణింపుము. భవవృద్ధిలయములకుఁ గారణుఁ డైనవిష్ణుకథల వక్కాణించువానికంటె ధన్యుఁ డెవ్వఁడును లేఁడు."

ఇట్లు వచించి నారదుం డరిగెను. అనంతరము బాదరాయణుఁడు, భువనక్షేమంకరం బైన భాగవతంబు రచించి తన పుత్త్రుం డగుశుకమహర్షిచేఁ జదివించెను. శుకమునీంద్రుఁడు పరీక్షిత్తునకు వినిపించెను.

"క॥ నిగమములు వేయుఁ జదివిన
సుగమంబులు గావు ముక్తి ♦ సుభగత్వంబుల్
సుగమంబు భాగవత మను
నిగమంబుఁ బఠింప ముక్తి ♦ నివసనము బుధా."

---

2. [నారదునిపూర్వజన్మవృత్తాంతము.]

——: o :——

పూర్వ మొకగ్రామమున వేదవాదు లను బ్రాహ్మణుల యింట నొకదాసి కలదు. ఆదాసికిఁ బుత్త్రుఁడే నారదుఁడు. ఈతఁడు శూద్రుఁ డైనను, జిన్నతనమునుండియు సద్గుణములు కలిగి విరాజిల్లుచుండెను. పెద్దలయందు వినయమును, హరికథాశ్రవణమును నీతనికి భూషణములై యొప్పుచుండెను. ఈతఁడు తనతల్లితో వేదవాదులగృహంబునకు ననుదినంబును బోవుచుండును. వీనిసుగుణంబులకు మెచ్చి వేదవాదు లీతనిని మిగులఁ బ్రేమతోఁ జూచుచుండిరి.

ఇట్లుండ, వేదవాదులయింటికిఁ జాతుర్మాస్యదీక్ష సలుపుటకుఁ గొందఱు యోగులు వచ్చిరి. వేదవాదులు వారినిఁ బూజించుచుఁ దమగృహంబున నం దుంచుకొని, వారికిఁ బరిచర్య సేయుటకు నారదుని నియోగించిరి. పెద్దలకుఁ బరిచర్య సేయుటకుఁ దగినభక్తి, వినయము, శాంతము మొదలగుసద్గుణము లుండుటచేతనే వారు నారదుని యోగులకుఁ బరిచర్య సేయుట యం దుంచిరి. నారదుఁడు వేదవాదులయాజ్ఞ ననుసరించి, యోగీశ్వరులను నతిభక్తితో సేవించుచుండెను. వారియుచ్ఛిష్టమును మహాప్రసాదముగ భావించి భుజించుచుండును. యోగుల మూలమున నారదునిచిత్తమున నిట్టి దని వర్ణింపరాని భగవద్భక్తి యుదయించెను. యోగు లాతనిగుణములకు సంతోషించుచుండిరి. అంతఁ జాతుర్మాస్యదీక్ష పూర్తియగుటచే వారాగ్రామమును విడిచి మఱి యొకప్రదేశమునకుఁ బోవఁ బ్రయాణసంసిద్ధులైరి. అప్పుడు నారదుఁడు వారిం గాంచి "యోగీంద్రులారా! మీరు పరమాత్మునకుఁ డగుశ్రీహరిని జిత్తంబుల యందు నిలిపి మహామహిమతో భాసిల్లుమహానుభావులరు. దివ్యజ్ఞానులరు. ఇన్నిదినములనుండియు మిమ్ము సేవించుచు సంతోషముతో నుంటిని. ఇఁక మీ రీప్రదేశమును విడుచుచున్నారు. నేను మిమ్ము విడనాడి యుండఁజాల. నా కీసంసారబంధముతోఁ బనిలేదు. నన్నుఁ గూడ మీవెంటఁ దోడ్కొనిపొండు. మీపాదసేవఁ జేయుచుఁ గృతార్థుఁడ నయ్యెదను," అని పలికెను. యోగులు వానివాక్యములకు మిగుల సంతో

షించి "నారదా! నీచిత్తనిర్మలత్వమునకు మేము మెచ్చితిమి. నిన్ను మావెంటఁ దోడ్కొనిపోవుటకుఁ గొంచెమైనను సంశయము లేదు. కాని, సజీవ యైయున్న నీతల్లిని విడిచి వచ్చితివేని, యామె దిక్కులేని దగును. ఎంతవఱకు నీతల్లి జీవించి యుండునో, యంతవఱకు నీ వామెను సేవించుచుండవలయు" నని పలికి, యాతనికి, హరిభక్తి నుపదేశించి చనిరి.

యోగీంద్రులయుపదేశము ననుచరించి నారదుఁడు శ్రీహరిని మనంబున నిలిపి, వేదవాదులగృహకృత్యంబుల సమధిక శ్రద్ధతోఁ దీర్చుచుండెను. ఆతనిచిత్తమున హరిభక్తి నానాఁటికి వృద్ధి యగుచుండెను. ఇట్లుండ నొకనాఁడు, వానితల్లి సర్పదష్టయై ప్రాణములు విడిచెను. నారదుఁ డామెకుఁ జేయవలసిన ప్రేతకృత్యములు నిర్వర్తించి, యరణ్యంబును బ్రవేశించి, హరింగూర్చి తపము సేయుచుండెను. ఇట్లనేక వత్సరములు జరిగినపిదప నొకనాఁ డాతని కొకదివ్యస్వరూపము కనఁబడెను. కాని, నారదుఁడు కన్నులు తెఱచి చూచునప్పటి కామూర్తి మాయ మయ్యెను. ఆదివ్యమంగళవిగ్రహ మాతనికి మరలఁ గనఁబడలే దని విచారించుచుండఁ "కుమారా! నీవు విచారింపవలదు. నీయభీష్టము దీరు నని తెలుపుటకు నామూర్తిఁ జూపితిని. ఈజన్మమున నీవు న్ను వీక్షింపఁజాలవు. నీ వీ శరీరము విడిచి నన్నుఁ జేరుదువు" అను వాక్యము లాతనికి వినవచ్చెను. ఈవాక్యముల కాతఁడు సంతసించి, హరిని భజించుచు, గాలమునకై వేచియుండెను. కొంతకాలమున కాతఁడు మృతినంది, మరల బ్రహ్మమానసపుత్రుఁ

డై శ్రీహరికరుణకుఁ బాత్రుఁడై వీణె చేఁబూని నిరంతరము హరినిఁ గీర్తించుచు మూఁడులోకములయందు యథేచ్ఛముగాఁ జరించుచుండెను.

"క॥ విను మీసంసారం బను
వననిధిలో మునిఁగి కర్మ • వాంఛలచే వే
దనఁ బొందెడువానికి వి
ష్ణునిగుణవర్ణనము దేప • సుమ్ము మునీంద్రా."

---

## 3. [పరీక్షితుని చరిత్రము.]

—:o:—

ఈపరీక్షితుఁడు పాండవమధ్యముఁడైనయర్జునునిపుత్రుఁడైనయభిమన్యునకు నుత్తరయందు జనించెను. ఈతనితల్లి గర్భవతి యై యున్నప్పుడే తండ్రి భారతయుద్ధమున మరణించెను కౌరవాగ్రజుఁ డగుదుర్యోధనునకుఁ బ్రీతిసేయ నశ్వత్థామ "జగ మపాండవ మగుఁగాక" యని బ్రహ్మశిరోనామకాస్త్రంబును బ్రయోగించెను. ఆ యమోఘశరం బుత్తరగర్భంబును బ్రవేశింపఁగాఁ బాండవపక్షపాతి యగుకృష్ణుం డామెను రక్షించెను. కాని, బాణముయొక్క వేఁడిమికి గర్భమునం దున్నయర్భకుఁడు తహతహనంది భగవంతుని నుద్దేశించి,

"ఉ॥ కు య్యిడశ క్తిలేదు దర • గోళములోపల నున్నవాఁడ, ది
క్కెయ్యది దా ననాథ సని• యెప్పుడుఁ దల్లి గణింప వింద నేఁ
డియ్యఘువహ్ని వాయుటకు • నెయ్యది మార్గము నన్నుఁ [గావ నే
యయ్య గలండు; గర్భజని • యాపద నెవ్వఁ డెఱుంగు [దైవమా.

నేను బయలుపడకి యున్నచో దుర్భరం బగుగర్భవేదనచేత నా తల్లి మరణించును," అని చింతించుచుండెను. శ్రీహరి యా శిశువున కెట్టియాపదయుఁ గలుగకుండ రక్షించెను. తరువాత నొకశుభదినంబున నుత్తరకుఁ గుమారుఁడు జనించెను. ఈతఁడే పరిక్షితుఁడు.

ఇట్లు జనించిన పరీక్షితుఁడు దినదినప్రవర్ధమానుఁడై, యుక్తవయస్కుఁడై నయంతనే, పాండవు లాతనిని రాజుగా నొనర్చి, మహాప్రస్థానమున కేగిరి. పరీక్షితుఁడు భూమండలం బెల్ల ధర్మపద్ధతిని బరిపాలించుచు, దిగ్విజయార్థమై బయలుదేఱి సరస్వతీనదీతీరమున విడిసి యుండెను. అప్పు డచ్చటకు వృషభ రూపమున నేకపాదంబునఁ జరించు ధర్మదేవతయు, గోరూప మైయున్న భూదేవియు వచ్చి కృష్ణుఁడు లేకపోవుట చే జగంబున నధర్మములు హెచ్చుచున్న వని మాటలాడుకొనుచు విచారించుచుండిరి. వా రిరువురు నట్లు సంభాషించుకొను నవసరమున భయంకరస్వరూపుం డగుశూద్రుఁ డొకఁడు వచ్చి, యాగోవృషభంబులను దన్ని యీడ్వసాగెను. పరీక్షితుఁడు

వానిం జూచి యాగ్రహోయత్తచిత్తుం డై, మేఘసదృశము లగు గంభీరవాక్యములతో "సాధువు లగునీజంతువులు నీ కేమియప కార మొనర్చెను ? వీనిం దన్నుటకుం గారణ మేమి? మదీయ భుజబలపరిరక్షితం బగునీక్షోణీతలంబున నిట్టి యన్యాయము జరుగరా దనుసంగతి నీ వెఱుంగవా? కృష్ణార్జునులు భూతలం బున లేరుకదా యని దుష్కార్యాభిరతుండ వై చరించుచు శిక్షింపం దగనివారిని శిక్షించు నిన్ను నేను శిక్షించెద" నని పలికి, గోవృషభంబులం జూచి "మీరు జాలి నందవలదు. ఈపాపాత్ముని దండించి, మీకు ముదముం గూర్చెద," నని వచించి, తనయొఱనుండి ఖడ్గముం దీసి, యెదుట నున్న వృష లునిం జంపం దలంచెను. రాజరూపమున నున్నవృషలుండు, భయకంపితశరీరుం డై పరీక్షిత్తునకు నమస్కరించి "నృపాలా! నీకృపాణముం జూడ నా శరీరము కంప మెత్తుచున్నది. నన్ను వధింపవలదు," అని వేడికొనియెను. శరణాగతరక్షకుం డగునా యాభిమన్యసూతి తనఖడ్గమును వెనుకకుం దీసి రాజరూపమున నున్నయాకలిపురుషుం గాంచి "నీవు పాపబంధుండవు. మదీ యరాష్ట్రంబున నీ వుండవలదు," అని భీకరంబుగా నుడివెను. తనకు నివసించుటకు స్థల మెక్కడ నని కలిపురుషుండు పరీక్షి త్తు నడిగెను. ప్రాణివధస్త్రీద్యూతపానంబు లనెడుస్థలంబులం దును, ధనమూల మగుసత్యమదకామహింసావైరంబు లను ప్రదేశంబులందును, నుండు మని యాజ్ఞాపించి, రాజేంద్రుండు

వానిని విడిచిపెట్టెను. ధర్మదేవతయు, భూదేవియుఁ బరీక్షితుని ధర్మసంధతకు సంతసించి నిజేచ్ఛం జనిరి.

కలినిగ్రహం బొనర్చి పరీక్షితుఁడు నిజనగరంబును జేరెను. పెక్కు సంవత్సరములు గడచినపిదప నొకనాఁ డతఁడు వేఁటవేడుక నరణ్యమున కేగి, దాహపీడితుఁ డై, సలిలార్థ మం దందుఁ గ్రుమ్మరుచు నొక్కచోట గాఢసమాధియం దున్న శమీకుం డనుఋషిపుంగవుని గాంచెను. రాజేంద్రుఁ డాతని యొద్దకుఁ బోయెను గాని నాతఁడు తపస్సునం దుండుటచే, మాటలాడలేదు. అందుచే నతఁడు చిత్తమునఁ గొంచెము రోషించి, యొకసర్పశవమును గొనివచ్చి మునీంద్రునిమెడ యందు వైచి చనియెను. సమీపమున నుండి చూచుచున్న శమీకుని శిష్యులు కుమరయమున సరిగి ఈవృత్తాంతమును మునిపుత్రుం డగుశృంగితోఁ జెప్పిరి. శృంగి యరుదెంచి, తండ్రి మెడలో నున్నసర్పమును జూచి, కోపమంది, "అట్టియకార్య మాచరించినవాఁడు సర్పదష్టుఁ డై నేఁటి కేడవనాఁడు చచ్చుం గాక" యని శపించెను.

శమీకుఁడుతపముఁ జాలించి, తనమెడయందు వ్రేలుఁ చున్న సర్పశవమును దీసివేసి, జరిగినసంగతి శిష్యులవలన విని యెను. తనపుత్రుఁడు పరీక్షితునకు శాప మిచ్చినవిధం బెఱింగి, శమీకుఁడు మిగులఁ జింతించి, కుమారున కిట్లు పలికెను. "వత్సా! మహారాజున కిట్టిశాప మీయఁ జెల్లునే? ఆతఁడు తల్లిగర్భమునం దుండి, ద్రోణిబాణజ్వాలల దగ్ధుఁ డై, వాసు

దేవునికరుణచే జీవించినాఁడు నీశాపము మనకుఁ బాపముఁ గూర్చు
నది. నృపాలుఁడు లేకున్నచో రాజ్యమందుఁ జారచోరాదులు
హెచ్చుదురు. వర్ణాశ్రమధర్మము లడుగంటును. ప్రజలలోఁ
గలహములు సంభవించును. అక్కటా! పాండవవంశజుఁడును,
బరమభక్తుఁడును, ధర్మసంధుఁడును నగునాపరీక్షితుఁడు మన
కడకు వచ్చినప్పుడు పూజింపక, యిట్టిశాప మిచ్చితివా?" అని.

కుమారుఁడు నృపాలున కిచ్చినశాపమును దిప్పుటకు
శృంగి శక్తుఁడు గాకుండెను. అందుచే నతఁడాశాపమును
గూర్చి పరీక్షితునకుఁ జెప్పుటకుఁ దనశిష్యుని బంపెను. శమీ
కునిశిష్యునివలనఁ బరీక్షితుఁడు, శాపమును గూర్చి విని
"అక్కటా! మునీంద్రునిమెడయందు సర్పశవమును వైచిన
పాపము నన్ను విడచునా! గోభూసురదేవతాచయమున కెగ్గు
సలుపువారికిఁ బాపము సంభవింపక యుండునా" యని పలు
విధములఁ జింతించి, ధైర్యచిత్తుఁడై, కుమారుఁ డగుజనమే
జయునకు రాజ్యాభిషేకము గావించి, నిఖిలభోగంబుల వర్జించి,
గంగాతీరంబున కేగి ప్రాయోపవిష్టుఁడై యుండెను. పెక్కండ్రు
మునీంద్రులు పరీక్షితుని కడకు వచ్చిరి. అతఁడు వారిని బూ
జించి, తన కేడుదినములలో ముక్తి లభించుమార్గముఁ జెప్పుఁ
డని ప్రార్థించెను. మునీంద్రు లాతనిని విలోకించి,

[లోపలఁ

"ఉ॥ ఏను మృతుండ నౌదు నని ♦ యింతభయంబు మనంబు

[నిత్యమాఁ

మానుము సంభవంబు గల ♦ మానవకోట్లకుఁ జావు

గానహరిం దలంపు మిఁకఁ ♦ గల్గదు జన్మము నీకుధాత్రిపై
మానవనాథ పొందెదవు ♦ మాధవలోకనివాససౌఖ్యముల్.

అని వచించిరి. పరీక్షిత్తుఁడు తనచిత్తమును శ్రీహరిపదాయత్తము గావించెను. మునీంద్రు లాతనికి శ్రీహరికథలను వినిపించుచుండిరి.

అంత నేడవదినము వచ్చెను. శమీకమునిపుత్రునిశాపము ననుసరించి తక్షకుఁడు పరీక్షిత్తునిఁ జంప బ్రాహ్మణాకృతిని వచ్చుచుండెను. ఆసమయమందే సర్పవిషహరణసమర్థుం డైన కశ్యపుఁ డనునొక బ్రాహ్మణుఁడు గూడ; బరీక్షిత్తుఁడు సర్పదష్టుఁ డైనచో నాతని బ్రదికించి, విశేషధనము గొనవచ్చు నని వచ్చుచుండెను. వీరిరువురును మార్గమధ్యమందుఁ గలిసికొనిరి. తక్షకుఁడు కశ్యపునిప్రభావ మెఱింగి, ధనాశచేఁ బోవుచున్న యాతనికిఁ గొంతధన మిచ్చి వెనుకకుఁ బంపివేసెను.

గంగాతీరమునఁ బరీక్షిత్తుని ననేకమునీంద్రులు పరివేష్టించి యుండిరి. తక్షకుఁడు నిజరూపముతోఁ బోవఁజాలక బ్రాహ్మణవేషమునఁ బోయి, పరీక్షిత్తున కొకఫలము నిచ్చి చనియెను. ఆఫలమును రాజేంద్రుఁ డాస్వాదింప, నందుండి ముందు క్రిమిరూపమున వచ్చి, పిదప మహాభయంకర మైన సర్ప మై యాతనిం గఱచి యదృశ్య మయ్యెను. వెంటనే పరీక్షిత్తుఁడు విషాగ్నిచే దగ్ధుఁ డయ్యెను. ఆతనిమృతికిఁ దేవతలును, మునులును గూడ మిగులఁ జింతించిరి.

# 4. [వ రా హా వ తా ర ము.]

—:o:—

ఒకనాఁడు సనకసనందనాదిమునీంద్రులు శ్రీహరిని దర్శింపఁదలఁచి, సమస్తకళ్యాణభరితం బైనవైకుంఠమున కరిగి, విష్ణుమందిరద్వారంబును బ్రవేశించిరి. ద్వారపాలకు లైనజయ విజయు లామునీంద్రులను మందిరప్రవేశ మొనర్పకుండఁ జేసి, పెక్కుదుర్భాష లాడిరి. అందులకుఁ దపోధనులలిగి వారినివిలోకించి యి ట్లనిరి. "తాపసుల మైనమేము పదునాల్గులోకములయందును యథేచ్ఛముగాఁ జరింతుము. భక్తజనసంరక్షకుఁ డగు శ్రీహరిని దర్శింపవచ్చిన మమ్ము మీ రేల వారించితిరి? మా ప్రభావం బెఱుంగక మూఢు లై మమ్ము వారించినందులకు ఫలముగా భూతలంబున మీరు రాక్షసు లై జనింపుఁడు."

మునీంద్రు లిచ్చినశాపంబునకు భయమంది, జయవిజయులు వారిచరణములపైఁ బడి "మహాత్ములారా! మహాత్ము లగుమిమ్ముఁ బరాభవించినందుల కీశాపము నొసంగినారు. ఇందులకు మేము దుఃఖించినందువలనఁ బ్రయోజనము లేదు. కాని కామక్రోధలోభమోహమదమాత్సర్యములకు మూలమైనదనుజకులమునఁ బుట్టినను మేము శ్రీహరిని మఱవకుండున ట్లనుగ్రహింపుఁ"డని వేఁడికొనిరి. ఈకలకల మంతయు నాలించి, యాసమయమున మందిరమునుండి శ్రీమన్నారాయణుఁ డచ్చటికి వచ్చెను. మునీంద్రు లాతనికి భక్తిమీఱఁ బ్రణా

మంబు లర్పించి, పెక్కుభంగుల స్తుతించి నెమ్మదిగా నిట్లు
పలికిరి. "దేవా! గతపాపుల మైనమేము నేఁడు, భవత్పాదా
శ్రితు లైనయీజయవిజయులు మమ్ము మందిరప్రవేశ మొ
నర్పకుండ వారించినకారణమున శపించితిమి. దీనిచే ధర్మహాని
సంభవించినది కదా యని భయ మందుచుంటి" మని పలికిన
విని, శ్రీహరి వారికి వినయమున నిట్లనెను. "యోగీంద్రు
లారా! ఈద్వారపాలకులు మిమ్ముఁ బరాభవించినందులకుఁ
దగినశిక్ష గావించితిరి. ఇదియుంగాక సేవకులు సేయునపరాధ
ము స్వామియందుఁ గూడ నుండును గావున, నిందు నన్ను
క్షమింప మిమ్ము వేఁడుచున్నాఁడ. ఈసమస్తలోకరక్షణకార్య
ము, ఈకీర్తి నాకు మీవలనఁ గదా లభించినది. నేను నిరంతర
ము భూసురపాదరజంబును శిరంబునఁ దాల్చుచుందును. అట్టి
చో ధరామరులకుఁ బరాభవముఁ గూర్చినవాఁడు నాకుఁ బరా
భవముఁ గూర్చినవాఁడే యగును. కావున మీ కపరాధము
గావించిన యీజయవిజయులు దైత్యులై జన్మించి, నాయెడ
సంభావితవైరానుబంధభావు లై, సంగరంబున నాచేఁ గూలి,
మూఁడుజన్మములపిదప, మరల నాకడకు వచ్చెదరు. వీరిని మీ
రిట్లనుగ్రహింపుఁడు." శ్రీహరివాక్యములకు సంతసించి,
మునీంద్రు లమ్మహాత్మునియనుజ్ఞఁ బొంది, చనిరి. పిదప
శ్రీమన్నారాయణుఁడు తనయెదుట ముకుళితకరకమలు లై
నిలిచియున్న జయవిజయులం గాంచి "మునీంద్రుల శాపమున
మీరు దైత్యులై పుట్టవలయును. మహామహిమాస్పదుఁడ

నయ్యు, మునివాక్యముల వారింప నసమర్థుఁడను. కావున మీ రిట్లు దానవులై, నాకు విరోధులై నాచేఁ గూలి మరల నా సన్నిధికి వచ్చెదరు." అని పలికెను.

అజయవిజయులే భూమియందుఁ గశ్యపమునీంద్రునిభార్య యైనదితియందు హిరణ్యకశిపు హిరణ్యాక్షు లనుదైత్యులై జనించి లోకముల హింసించుచుండిరి. ఇందు హిరణ్యాక్షుఁడు భుజబలగర్వంబునఁ దన్నెదిర్చి పోరఁగలుగువాఁ డెవ్వఁ డుండె నా యని చరించుచు దేవలోకంబున నెవ్వరినిఁ గానక, జలధిఁ జొచ్చి, వరుణపాలిత యైనవిభావరీపురం బ్రవేశించి, వరుణునిఁ గాంచి "సకలలోకపాలురలో నీవు బలపరాక్రమములు గల వాఁడ వని యశముంది యున్నాఁడవు. నీతోఁ బోరాడి, నీబలమును జూడఁ దలఁచి యిటు వచ్చితిని.," అని పలికెను. అందులకు వరుణుఁడు "రాక్షసేంద్రా! ఇప్పుడు నేను మిగులశాంతము వహించి యున్నవాఁడ. నాతోఁ బోరినందువలన నీకుఁ బ్రయోజనము లేదు. నీతోఁ బోరుటకు శ్రీహరి దక్క నెవ్వరును శక్తులుగారు. ఆతఁ డిప్పుడు వైకుంఠమున నున్నవాఁడు. నీ వాతనితోఁ బోరుదువేని నీబలపరాక్రమములు లోకమునకు విదిత మగు" నని బదులు చెప్పెను. ఆపలుకులు విని హిరణ్యాక్షుఁడు హరితోఁ బోరఁదలంచి వైకుంఠపురాభిముఖుఁడై చనుచుండెను. అప్పుడు నారదుఁ డాతని కెదురై యాతని తలంపెఱింగి యిట్లు పలికెను.

"చ॥ గురుభుజుఁ డమ్మహాత్ముఁడు వి ♦ కుంఠ పురంబున నేఁడు లేఁడు భూ
భరము వహింప నాదికిటి ♦ భావముఁ దాల్చి రసాతలంబునం
దిరువుగ నున్నవాఁ డచటి ♦ కేఁగఁగ నోపుదువేని నేగు మం
దరయుఁగఁ గల్గు నీకు ఘను ♦ దాంతకుతోడ రణం బవశ్యమున్

అంతట హిరణ్యాక్షుఁడు రుద్రుని కైవడి మండిపడుచు రసాతలంబున కరిగెను. అచ్చట నంతకు ముందే జలమధ్యమున వరాహ రూపమున సునిశితదంష్ట్రాగ్ర వసుంధరాయత్తుఁడైన శ్రీహరి యుండెను. దానవుఁడు హరిం గాంచి కనుఁగవ నిప్పులు రాల్చుచు "ఓరీ! రసాతలగతమైన యీభూతలం బంతయు నాయధీనమున నున్నది. నీవు దీనిం గొనఁజూచుచుంటివి. అవినీతి యోగమాయాబలంబునఁ జరించు నిన్ను శిక్షించి, దైత్యకులమునకు సంతసము నించెదన" ని పలికెను. సౌకర్యవేషుఁ డైన సరోజాక్షుఁడును, హిరణ్యాక్షుఁడును గదారణంబునకు దిగిరి. ఇరువురకును నతిభయంకరమైన పోరాటము జరుగుచుండెను. అప్పుడు సంధ్యాసమయం బగుచుండుటఁ జూచి, మింట బృందారకులతో నిలిచియున్న చతుర్ముఖుఁడు హరిని విలోకించి "మహాత్మా! అంధకార మయ్యెనేని దనుజుని బలము హెచ్చును. కావున సత్వరముగ వానిం దునుము" మని నుడివెను. అంతట లక్ష్మీరమణుఁడు హిరణ్యాక్షువధార్థము మనంబునఁ జక్రమును స్మరించిన యంతనే యయ్యది వచ్చి దనుజాంతకుని హస్తంబు నలంకరించెను

అప్పుడు మధుసూదనుఁడు చక్రముచే దానవునిశిరము దునిమెను. అనంతరము శ్రీహరి వరాహరూపము విడిచి వైకుంఠమును బ్రవేశించెను.

---

## 5. కపిలమహాముని.

---

కృతయుగంబున మునినాథుం డయినకర్దముఁడు సరస్వతీతీరమున శ్రీహరింగూర్చి పెక్కువత్సరములు ఘోరమైనతపస్సుఁ జేసెను. శ్రీమన్నారాయణుఁ డాతనితపంబునకు మెచ్చి ప్రసన్నుఁడై యిట్లు పలికెను. "మునీంద్రా! బ్రహ్మావర్తదేశంబుఁ బరిపాలించుచున్న స్వాయంభువమనువు తనపుత్రిక యగుదేవహూతిని వెంటఁబెట్టుకొని, భార్య యగుశతరూపతో నీకడకుఁ గొన్నిదినములలో వచ్చును. దేవహూతిని నీకొసంగి వివాహము సేయును. నీవలన నామెయందుఁ దొమ్మండుగురు పుత్రికలుద యింతురు. నేను నీకుఁ దనయుఁడనై తత్త్వసంహిత నుపదేశింతు" నని పలికి యంతర్ధానుఁ డయ్యెను. కర్దముఁడు తనతపము ఫలించిన దని సంతసించి బిందుసరోవరంబున కేగెను.

కర్దముఁ డచ్చట నుండఁగా స్వాయంభువమనువు భార్యాసమేతుఁడై పుత్రిక యగుదేవహూతితో వచ్చెను. కర్దముఁ డాతనిని బూజించి, తదాగమనంబునకు నిమిత్తం

చెయ్యది యని ప్రశ్నించెను. అందులకు స్వాయంభువమనువు కర్దమున కిట్లుపలికెను.

“మ॥ వరయోగీశ్వర దేవహూతి యను నీ ♦ వామాక్షి మత్పుత్రి దా
నరలావణ్యగుణాఢ్యులన్ విని యు నె ♦ వ్వారిన్ మదిం గోర కా
తురయై నారదుపంపునన్ మిము వరిం ♦ తున్నంచు నే తెంచె నీ
తరుణీభిక్షఁ బరిగ్రహింపుము శుభో ♦ దాత్తక్రియాలోలతన్”.

గృహమేధికకర్మములకు ననురూపగుణవిరాజితశీల యగునీతరుణిని గ్రహింపుము.”

ఇట్లు చెప్పిన విని, విష్ణునివాక్యములఁ దలఁచి కర్దముఁడు దేవహూతిని గ్రహించుటకు సమ్మతించెను. అంతట స్వాయంభువమనువు, దేవహూతిని గర్దమునకిచ్చి విధ్యుక్తప్రకారంబుగఁ బరిణయం బొనర్చి భార్యతో నిజదేశంబున కేగెను.

దేవహూతి పతిని దైవంబుగా భావించి, యతిభక్తితో నిరంతరము సేవించుచుండెను. దేవహూతికిఁ దనయం దున్న భక్తికి సంతసించి కర్దముఁడు నిజయోగమాయాబలంబున దివ్యవిమానం బొండు గల్పించి, యామెతో నావిమానంబున విహరించుచు, నామెకుఁ మోదముం గూర్చుచుండెను. కాల

క్రమమున నామెకుఁ దొమ్మండుగురు పుత్రికలు జనించిరి. అనంతరము కపిలుఁడు పుట్టెను. కపిలునిజననంబున దేవహూతియుఁ గర్దముఁడును మిగుల సంతసించిరి. కపిలుఁడు శ్రీమన్నారాయణుని యంశంబున జనించినవాఁ డగుటచే మునీంద్రులెల్లరును నాదంపతులను పెక్కువిధంబులఁ గొనియాడిరి. కపిలుఁడు జనించినపిదపఁ గర్దముఁడు సంసారమును విడిచి వనంబునకుఁ బోయెను. కుమారుఁడైన కపిలునివలన దేవహూతి తత్త్వజ్ఞానము వడసెను.

---

## 6. [దక్షాధ్వరభంగము.]

—:0:—

పూర్వము బ్రహ్మలు సేయుసత్రయాగమును దిలకింప శ్రీహరిహరచతుర్ముఖులును, సమస్తమునీంద్రులును వచ్చియుండిరి. వీరందఱును వచ్చినపిదప దక్షుఁడు గూడ వచ్చెను. దక్షుఁడు వచ్చినప్పుడు హరిహరపితామహులు తప్పఁ దక్కిన సభ్యు లెల్లరును తమతమ యాసనములనుండి లేచి, యథావిధినిఁ బూజించిరి. తన్నుఁ గాంచి, శివుఁ డాసనము దిగలే దని కోపమువహించి యాదక్షుఁడు సభ్యులను విలోకించి "సభ్యులారా! సావిత్రిసమాన యగునాపుత్రికను నీశివున కొసంగితిని. ఈతఁడు నాకు నమస్కరింపకుండుఁగాక! పోనిండు. నోటి

మాటవలనఁ దన కేమినష్టము సంభవించును? మర్యాదాహీనుఁడును, మత్తప్రచారుఁడును, దిగంబరుఁడును, భూతప్రేతపరివృతుఁడును, అస్థిభూషణుఁడును, శ్మశానవిహారుఁడును, భూతిలిప్తుఁడును, నగునీతనికి వేదములను శూద్రున కిచ్చినవిధమున నస్మత్తనూజాత నిచ్చి పెండ్లిఁజేసితిని," అని పలువిధముల నాశివుని దూషించుచుఁ బలికెను.

శివునిదూషించినందులకు దక్షునిపై నందటికినిఁ గోపము గలిగెనుగాని, యాతనికి భయమంది మాటలాడక యుండిరి. నాఁటినుండియు శివునకును దక్షునకును నొకరిపై నొకరికి ద్వేష మేర్పడియుండెను.

కొన్నాళ్లు చనినపిదప దక్షుఁ డొకయాగము సేయఁ దలఁచి, దేవతలను సమస్తమునులను దత్క్రతుమహోత్సవసందర్శనార్థ మాహ్వానించెను. పుత్త్రిక యగుసతీదేవిని నల్లుఁ డగురుద్రుని మాత్రము పిలువలేదు. తనతండ్రి సేయుచున్నక్రతువును వీక్షించుటకుఁ బోవుచున్నవారిం జూచి దాక్షాయణి తాను గూడఁ బోవఁదలఁచి, నిజేశ్వరుం డగుపరమేశ్వరుని దిలకించి యిట్లు పలికెను. "ప్రాణేశ్వరా! నాతండ్రి యగుదక్షప్రజాపతి మహావైభవముతో నొకక్రతువును సేయుచున్నాఁడఁట! అయ్యజ్ఞమును జూడ ననేకు లేగుచున్నారు. నాకుఁగూడ దానిం దిలకించుటకుఁ గడువేడ్క యొదవుచున్నది. కామినీస్వభావంబున నిట్లు గోరినందులకు క్షమింపుము. జనకునిగేహంబునఁ గలుగుసకలసుభంబులును బుత్త్రికలు గనుంగొని సంతసింప

వలయును గదా! పిలువకుండఁ జనుట యనుచిత మని పలుకుదు వేని జనకగురుమిత్ర గేహంబులకుఁ బిలువకుండనే సజ్జనులు పోవు చుందురు. నాయెడఁ గృపాంతరంగితమతివై మదీయమనోరథముఁ దీర్పుము."

అందులకు శివుఁ డిట్లు బదులు చెప్పెను. "కల్యాణీ! నీవు పలికినపలుకులు సత్యములే, కాని, యచ్చటివారు కోప దృష్టులు కారేని బోదగును. కుటిలబుద్ధులైనవారియిండ్లకు సుజను లేగరాదు. దక్షునకు నీవు గారాపుఁబుత్రికవైనను నాకతంబున నీ వాతనిచేఁ బూజ వడయఁజాలక యున్నావు. ఆతఁడు నాయెడల మిగుల ద్వేషము వహించియున్నాఁడు. కావున నీవు నావచనంబు నతిక్రమించి యరిగితివేని యచ్చట నీకుఁ దప్పక పరాభవము కలుగును."

ఇట్లు పలికినను వినక దాక్షాయణి మఱింత బ్రతిమాలు టచే శివుఁ డామెను దక్షాధ్వరముం జూచుటకుఁ బోవ సమ్మ తించెను. అంత సంతోషముతో నామె జనకుని యాగముఁ జూడ నేగెను. ఆమెవెంట నందీశ్వరుఁడు మొదలగు రుద్రాను చరులు గూడ నేగిరి. అనేకమునులచేతను, దేవతలచేతను నిండి యుండి కనులపండువ సేయుచున్న యజ్ఞశాలను దాక్షాయణి ప్రవేశించెను. దక్షుఁ డామెను జూచియుఁ జూడనట్లుండెను. దక్షునివలన భయంబునం జేసి సభ్యు లెవ్వరును నామె నాదరింపరైరి. జనకునిచే నాదరింపఁబడనిదై, దాక్షాయణి తనకుఁ బతిచెప్పి నట్లయ్యె నని కొంతసేపు విచారించుచు నట్లె నిలిచి

యుండెను. కొంతసేపటి కావిచార మాగ్రహముగా మాఱి, నామె దక్షునిఁగాంచి యిట్లు పలికెను. "నీవు దక్షుఁ డెవ్వఁడును రుద్రునియందుఁ బ్రతికూలము గా వర్తింపఁడు. మహాత్ముం డగునాతనియందు నీవు పాపబుద్ధి వహించితివి. "శివ" యనునక్షరద్వయము స్మరించినంతనే సర్వజీవులపాపములును తొలఁగిపోవు. అట్టివాని నీ వాతనియందు ద్వేషము వహించితివి. వాక్పతిప్రముఖామరు లామహాత్మునిపాదసరోరుహంబులను నిరంతరము మస్తకంబులఁ దాల్చుచుందురు. రుద్రవిరోధి వగునీకు నేను తనూజ నని చెప్పకొనుటకు నాకుఁ గడు సిగ్గుగ నున్నది. ఈముఖము జూచుటకుఁ బోవల దని నానాథుఁడు చెప్పినను వినక వచ్చినందులకుఁ దగిన ఫలము గంటిని. నీకుఁ బుత్రిక నని చెప్పికొనుటకంటెఁ జచ్చుట మంచిది."

అని యిట్లు కోపవాక్యంబులఁ బలికి యాసతీదేవి మౌనముధరించి, భూమియం దాసీనయై ప్రాణేశ్వరుం డగుశివుని మనంబున నిలిపి, నిజయోగసమాధిజనితం బైనయాగ్నిచేఁ దత్క్షణంబ దగ్ధం బయ్యెను. దక్షునికతంబున నాసతీదేవి యట్లు దేహము విడిచె నని యందఱును విచారించిరి.

ఈవార్త నారదుని వలన రుద్రుఁడు విని తనజటనుండి వీరభద్రునిఁ బుట్టించి, దక్షాధ్వరధ్వంసమున కాతని నియోగించెను. వీరభద్రుఁడు ప్రళయకాలరుద్రునిలీల రుద్రానుచరులం గూడి దక్షాధ్వరశాలం జేరి యాగమునకు భంగ మొదవించి, దక్షుని బట్టుకొని శస్త్రాస్త్రంబులచే శరీరంబు

నొవ్వఁజేసి, పెక్కువిధంబులఁ బరాభవించి, కైలాసంబును జేరెను. తరువాత బ్రహ్మాదులచేఁ బ్రార్థితుఁడై శివుఁడు దక్షునను గ్రహించెను.

---

## 7. [ధ్రువోపాఖ్యానము.]

---:o:---

ఉత్తానపాదుఁ డనువిశ్వంభరాకళత్రునకు సునీతి సురుచి యను నిరువురు భార్య లుండిరి. ఆతఁడు సమస్తధర్మముల నెఱింగినవాఁ డయ్యును మోహమును మాత్రము జయింపలేక పోయెను. ఆతనికి రెండవభార్య యగుసురుచియం దధికానురాగ ముండెను. సునీతికి ధ్రువుండును, సురుచికి నుత్తముఁడు ననుకుమారు లుండిరి. ఉత్తానపాదుఁడు సురుచియందు మిగులఁ బ్రేమ యున్నవాఁ డగుటచే నెప్పుడును నామెమందిరమందే సుఖముగాఁ బ్రొద్దులుపుచ్చుచుండెను. సునీతిగృహము వంక నైనఁ జూచుటలేదు.

ఒకనాఁడు సురుచిగృహమున నుత్తానపాదుఁ డుత్తముని దనతొడపైఁ గూర్చుండఁబెట్టుకొని ముద్దాడుచు సురుచితో వినోదగోష్ఠిం దగిలియుండెను. అట్టిసమయమున నచ్చటకు ధ్రువుఁడు వచ్చి తానుఁగూడ నుత్తమునివలెఁ దండ్రి యంకము నెక్కుటకు ముదమంది యాతనిని సమీపించెను.

ఆసంభ్రమంబును సురుచి గ్రహించి ధ్రువుని వీక్షించి "ధ్రువుఁడా! నీసంతోషకారణము నేను గ్రహించితిని. అందు లకై నీవు తొందరపడినందువలనఁ బ్రయోజనము లేదు. నీవు జనకునియంకమెక్కు భాగ్యము నోఁచుకొనియుంటివేని నాగర్భమునందే పుట్టియుందువు. ఇప్పుడైనను నీ వట్టిభాగ్యము నందఁ దలఁచితివేని శ్రీమన్నారాయణుని గూర్చి తపము సేయుము," అని పలుకుటయే గాక తండ్రిని సమీపించిన యక్కుమారుని చేయిఁ బట్టుకొని యీవలకు లాగివేసెను.

సురుచి యాడినవాక్యములకు ధ్రువుని కన్నులనుండి జలములు ప్రవహింపఁదొడఁగెను. ఆమెపలుకులకన్న, నందులకుఁ దండ్రి సైఁచినందుల కాబాలునకు మఱింత దుఃఖము కలిగెను. అతఁడు దుఃఖించుచుఁ దల్లి యగుసునీతికడ కరిగెను. ఆమె, యాతనిని తనయంకతలమునఁ గూర్చుండఁ బెట్టుకొని విచారకారణ మడుగుచుండెను. ఇంతలోఁ బరిచారికలు వచ్చి కుమారునిదుఃఖకారణమును సురుచియాడినపలుకులను జెప్పిరి. సునీతి సవతియీర్ష్యకు విచారమంది కుమారు నూఱడించుచు నిట్లు పలికెను. "నాయనా నీవు దుఃఖించినందువలనఁ బ్రయోజనము లేదు. లోకమునఁ బ్రతిమానవుఁడును బూర్వజన్మమునఁ జేసికొన్న కర్మకు బద్ధుఁడై యుండును. కర్మఫలము నెవ్వఁడును దాఁటఁజాలఁడు. నీదుఃఖముఁ జూడ నాకుఁ గూడ దుఃఖము కలుగుచున్నది. నీసవతితల్లి యగు సురుచిచేత నేను దాసికంటెఁ గడు నీచముగఁ జూడఁబడుచున్నదానను. నిర్భా

గ్యురాల నగునాగర్భమునఁ బుట్టుటచేతనే నీ విట్టిపరాభవ మందినావు. సురుచివాక్యములలో నావంతయు నసత్యము లేదు. ఆమె వచించినట్లు నీవు శ్రీహరి నాశ్రయింపుము. ఆతనియనుగ్రహమున నీకు సమస్తశుభములుఁ గలుగును. బ్రహ్మగూడ నామహాత్మునికృపవలననే జగంబుల సృజించుచున్నాఁడు. నీచింతఁ బాపువాఁడు లక్ష్మీకళత్రుఁడు దప్ప మఱియెవ్వఁడును లేఁడు.”

అట్లు తల్లి వచించినవాక్యములు విని ధ్రువుఁడు హరిం గూర్చి తపముసేయఁ దలఁచి, నగరము విడిచి ఘోరారణ్యమార్గమును బట్టి పోవుచుండెను. మార్గమధ్యమున నాతనికి నారదుఁ డెదురై, యాతనివృత్తాంత మంతయుఁ దనదివ్యదృష్టి నెఱింగి, క్షత్రియబాలకునిరోషమున కాశ్చర్యమంది, యాతనిశిరమును దనహస్తముచే స్పృశించి “వత్సా! నీవు సవతితల్లిపలికిన వాక్యములకు రోషంబంది యిట్లు వచ్చినావు. నీసంగతి నంతయు నేను గనుఁగొంటిని. నీతండ్రి మహారాజు. *మీమందిరము లక్ష్మీనిలయము. నీకు దేనికిని గొఱంతలేదు. నీవు బాలుఁడవు. నీయట్టివానికి మానావమానములతోఁ బని లేదు. అట్టివి పురాకృతకర్మము ననుసరించి యుండును. కష్టసుఖములు తనకర్మము ననుసరించి, వచ్చుచుండు నని తలంచి, సుఖమునకు సంతోషింపక కష్టమునకు వగవక యుండువాఁడే జ్ఞాని యనంబడును. నీవు శ్రీహరినిగూర్చి తపము సేయుటకుఁ బోవుట మంచిదే. కాని, యెండ వానల

కోర్చి నిరాహారులై యనేకవేలవత్సరములు తపం బొనర్చిన మహాత్ము లయినయోగీశ్వరులకే యాతఁడు దుర్లభుం డగు చుండును. అట్టిదో బాలుండ వగునీ వాతనిం గూర్చి తపము సేయఁగలవా! నీయుద్యమమును మాని గృహంబునకు మరలి పొమ్ము," అనిపలికెను. నారదుని వాక్యములకు ధ్రువుఁడు సమ్మతింపలేదు. అతనిచిత్తము గృహాభిముఖము కాలేదు. ఆతఁడు మునీంద్రుని విలోకించి "మహానుభావా! నేను క్షత్రియ బాలుఁడను. సవతితల్లి వాక్యములచే రోషపూరితచిత్తుఁడ నైతిని. ఇఁక నీ వెంతచెప్పినను నామనస్సు తిరుగదు. కావున నితరుల కలవిగానిదియుఁ, జతుర్దశభువనంబుల నెందును బ్రతి లేనిదియు నగుదివ్యపదము వాంఛించి హరింగూర్చి తపము సేయుదును. ఇదియే నానిశ్చయాభిప్రాయము. నీవు బ్రహ్మ మానసపుత్రుఁడవు. నీకుఁ దెలియనివిషయములు లేవు. నేను శ్రీహరి నెట్లు ప్రసన్నునిఁ జేసికొనఁగలుగుదునో యామార్గముఁ దెలిపి నన్నుఁ గృతార్థునిఁ జేయుము. నీపాదకమలములకు నమస్కరించుచున్నాఁడ" నని పలికెను.

ధ్రువునివాక్యములకు నారదుఁ డానంద మందెను. ఆతఁడు ధ్రువునిఁజూచి "శ్రీహరికరుణవలననే నీ కీబుద్ధి జనించినది. ఆతఁడు సర్వవ్యాపకుఁడు. విజ్ఞాన మార్జించి, మోక్షసామ్రాజ్య మేలఁ దలఁచినవాఁ డమ్మహానుభావు నారాధింపవలయును. యమునాతీరంబున నున్నమధువనము తపంబునకు మిగుల యోగ్యమై యుండును. అందు భగవత్పూజకుఁ

గావలసిన పుష్పములు; నాఁకలిఁ దీర్చుకొనుటకు దివ్యఫలములు; మధుర మగుసలిలములు నుండును. కావున నీ వచ్చటకుఁ బొమ్ము. నీవు శ్రీహరిని దృఢభక్తితో సేవింపుము. బాలుఁడ వగుటచే నీకుఁ గఠిననియమము లవసరము లేదు," అని పలికి యిరువదియేడుదినములు జపించినచో ఖేచరుల నయినఁ జూడఁ శక్తి కలుగు వాసుదేవమంత్రము నుపదేశించెను. ధ్రువుఁడు నారదునకు నమస్కరించి చనియెను.

ధ్రువుఁడు నగరమును విడిచి యరిగిననాఁటినుండియు నుత్తానపాదుఁడు చింతయందు మునింగి యుండెను. ధ్రువుని పై నాతనికిఁ జింత లేకపోలేదు. కాని సురుచియం దున్న యనురాగముచే నామెవాక్యముల కెదురాడలేకపోయెను. ధ్రువునిపై నొదవిన బెంగచే నాతఁడు నానాఁటికి శుష్కించుచు రాజకార్యము లన్నియు మఱచి యనేకవిధములఁ బరితపించుచుండెను. ఇట్లుండ నారదుఁ డాతనికడకు వచ్చి, ధ్రువుని వృత్తాంతము, దెలిపి, ధైర్యమును గలుగఁజేసెను.

నారదుని ప్రబోధమునందిన ధ్రువుఁడు మధువనంబునకుఁ జనియెను. అయ్యది మిగుల రమ్యముగను, దపమునకు సౌభాగ్యముగ నుండెను. ఆకుమారుఁడు యమునానదియందుఁ గృతస్నానుండై చిత్తమును శ్రీహరియందు నిలిపి, యతినిష్ఠతోఁ దపముసేయఁ దొడంగెను. ఎన్నికష్టముల కైన నోర్చి భగవంతుని జూడవలయు నని పట్టుదలవహించిన యాధ్రువుఁడు మూఁడేసిదినముల కొకసారి ఫలముల భక్షించుచు మొదటి

మాసమును, నాల్గేసిదినముల కొకసారి ఫలములభక్షించుచు రెండవమాసమును, దొమ్మిదేసిదినముల కొకసారి యుదక పానము సేయుచు మూఁడవమాసమును, బండ్రెండేసిదినముల కొకసారి యుదకపానము సేయుచు నాల్గవమాసమును, శ్రీహరిని సేవించెను. ఆతనితపమునకు సర్వలోకములును భయమందెను. దేవత లందఱును శ్రీమన్నారాయణుని సన్నిధి కేగి "దేవా! ఉత్తానపాదపుత్రుం డగు ధ్రువుఁడు నీకొఱకు ఘోరమైనతపము సేయుచున్నాఁడు. ఆతనితపమువేఁడిమి సర్వలోకముల దహించివేయున ట్లున్నది" యని పలికిరి. అందులకు రమానాథుఁడు బృందారకులఁ జూచి "సురలారా! మీరావంతయు భయ మందవలదు. నే నిప్పుడే ఆ ధ్రువునకుఁ బ్రసన్నుఁడనై వలసినవరముల నొసఁగెద" నని చెప్పి వారలను బంపివేసెను.

అనంతరము శ్రీమన్నారాయణుఁడు గరుడవాహనారూఢుఁడై, ధ్రువుఁడు తపం బాచరించుచున్న మధువనంబునకు వచ్చెను. ఆసమయమున ధ్రువుఁ డేకాంగుష్ఠము నేల మోపి తపము సేయుచుండెను. శ్రీహరి యాతనియెదుట నిలిచినయంతనే, కన్నులు తెఱచి చూచి, భగవంతుఁడు తన్నుఁ గృతార్థునిఁ జేయ నరుదెంచినాఁ డని గ్రహించి యద్దేవుని చరణములపైఁ బడి నమస్కరించెను. బాలుఁ డగుటచే హరి నెట్లు స్తోత్రము సేయవలయునో యాతనికిఁ దెలియదయ్యెను. శ్రీహరి, యాకుమారునిచిత్త మెఱిఁగి, వేదవాక్యములచేఁ

పూరింపఁబడిన తనశంఖముచే నాతనిశిరము స్పృశించెను. వెంటనే ధ్రువుఁడు విజ్ఞానసంపన్నుఁడై యొప్పెను. సమస్త విద్యలు నాతనిఁ జేరెను. ఒకవిధ మైనయద్వితీయ తేజ మాతని నావహించెను. శరీరబలము హెచ్చెను. అపుడు ముకుళితకర కమలుఁడై శ్రీమన్నారాయణు నిట్లు స్తుతించెను. "దేవా! నీవు సర్వలోకాధారుఁడవు. నీకై తపము సేయుచున్న నన్ను రక్షింప వచ్చితివి. లోకపరిపాలనార్థ మాయారూపములఁ దాల్చుచుందువు. నేను నిన్నాశ్రయించి చింతాసముద్రము దరింపఁదలఁచితిని. నీవు తప్ప నితరం బెఱుంగ మని నిన్ను సేవించు యోగీశ్వరుల కెట్టిసుగతి నిత్తువో యదియే నా కొసంగుము. నిన్ను సేవించుటకు నిశ్చల మైనమనస్సు కావలయును గాని ప్రతాపబలపౌరుషము లక్కఱకురావు. నేనే ఘనుఁడ నని గర్వించుభూసురునికంటె నీయందుఁ జిత్తముఁజేర్చు విజ్ఞాని యగుచండాలుఁడు మంచివాఁ డగును. నారదునిదివ్యకృపవలన నాకు నిన్ను దర్శించుభాగ్యము కలిగినది. నేను బాలుఁడను. సవతితల్లి నన్నాడినపలుకుల కలుక దోడమి నీచరణముల నారాధించితిని. ఆరాధించినందులకు నన్నుఁ గృతార్థుని జేయఁదలఁచి దర్శన మిచ్చితివి."

అను ధ్రువునిపలుకులకు శ్రీహరి యానందమంది యిట్లు పలికెను. "బాలకా! నీభక్తికి నే నెంతయు సంతోషించితిని. నీవు బాలుఁడ వైనను, దపంబున నన్ను మునీంద్రులకన్న మెప్పించితివి. ఇరువదివేలవత్సరములు చనినపిమ్మట నీవు దివ్య

పదంబును బొందఁగలవు. ప్రళయకాలమునందుఁ గూడ నీపదం
బునకు నాశన ముండదు. నీతండ్రి కొన్నాళ్ళకుఁ దపంబున కై
వనంబున కేగును. నీవు పుడమి కేలిక వయ్యెదవు. నీసవతి
తమ్ముఁ డగు నుత్తముఁడు మరణించును. వానిపై బెంగచే
సురుచిగూడ వానిమార్గ మనుసరించును. నీవు రాజ్యపరిపాల
నము సేయునప్పుడు నన్నుఁగూర్చి యాగములు సేయుము.
కావలసిన భోగము లనుభవింపుము. ఎవ్వరును బొందనిదివ్య
పదంబు నందఁగలవు.” ఇట్లు వచించి శ్రీహరియంతర్ధాన
ముందెను.

శ్రీమన్నారాయణుని యనుగ్రహము వడసిన ధ్రువుఁడు
సంతోషించుచు నిజపురమునకు మరలి వచ్చుచుండెను. ఈతఁడు
వచ్చుచుండుట కొందఱు చారులు చూచి, యుత్తానపాదునకుఁ
దెలిపిరి. నారదునివాక్యములచేఁ గొంచెము ధైర్య మంది,
కుమారుఁ డెప్పుడు వచ్చునా యని యెదురుచూచుచున్న
యుత్తానపాదుఁడు చారులకు బహుమతుల నిచ్చి, మంత్రిపురో
హితాదులతోడను, భార్యలతోడను నరిగి పురమున కావల
నున్నవనంబున వచ్చుచున్న ధ్రువుని వీక్షించెను. ధ్రువునిఁ జూచిన
యంతనే యుత్తానపాదుఁడు వాహనము దిగి, యాతనిం గౌఁగ
లించుకొని యానందాశ్రువులు విడిచెను. ధ్రువుఁడు తండ్రికిని
నిరువురుతల్లులకు సాష్టాంగదండంబు లర్పించెను. సురుచి
ధ్రువుని పూర్వము తా నన్నమాట మఱచి “శ్రీహరికరుణ
గలిగినవారి కెట్టికొఱంతయు నుండ” దని పలికె చిరంజీవి వగు

మని దీవించెను. కుమారుని జూచినప్పుడు సునీతికిఁ గలిగిన సంతోషమునకు మేర లేదు. ఉత్తానపాదుఁడు కుమారుని గజారూఢునిజేసి పురంబులోనికిఁ దోడ్కొని వచ్చి మహోత్సవము గావించి తనయిరువురు కుమారులను జూచుకొనుచు సుఖముగాఁ గాలముగడుపుచుండెను. యుక్తవయస్సు వచ్చినయంతనే ధ్రువునకు రాజ్యాభిషేకము గావించి, యారాజేంద్రుఁడు తపోవనముం బ్రవేశించెను. ధ్రువుఁ డాధిపత్యము నంది, ధర్మసంధుఁడై పరిపాలించుచుండెను. ఈతఁడు భ్రమి, యిల, యను నిరువురుకాంతల వివాహమాడి వారియందు ముప్వురుకుమారులను నొక్కపుత్రికను గాంచెను. ఉత్తముఁడు వివాహము గాకపూర్వమే హిమవన్నగప్రాంతమునకు వేఁటాడనేగి, యచ్చట నొకయక్షునిచేఁ గూలెను. కుమారునిమృతికిఁ గను గుంది సురుచి గూడ మరణించెను. యక్షునివలనఁ దనతమ్మునకు మరణము సంభవించె నని యెఱింగి, యాపగఁ దీర్చుకొనఁ దలఁచి ధ్రువుఁడు బాణపాణియై రథం బెక్కి యక్షునివాసం బగునలకాపురిని సమీపించి, దిక్కులు పిక్కటిల్లునట్లు శంఖము పూరించెను. యక్షు లందఱును వచ్చి ధ్రువుని మార్కొనిరి. ధ్రువుఁడు కాలరుద్రునిలీలఁ జెలంగుచు యక్షులపై శరాగ్నిఁ గురిపించెను. యక్షులు ననేకమాయలఁ బన్నుచుండిరి. అప్పుడు ధ్రువుఁడు నారాయణాస్త్రమును బ్రయోగించెను. ఆసమయమున ధ్రువుని పితామహుఁడగుస్వాయంభువమనువు వచ్చి, యాతనిని శాంతునిగాఁజేసి, యక్షరాజయిన కుబేరునితో

మైత్రిఁ గలిపెను. అనంతరము ధ్రువుఁడు నిజనగరమునకు వచ్చెను.

ధ్రువుఁడు పెక్కేండ్లు రాజ్య మేలి, శ్రీహరిప్రీత్యర్థ మనేకయాగములు చేసి, కుమారునకుఁ బట్టము గట్టి తపము సేయుటకు బదరికావనమున కరిగెను. అతఁ డందు దపము సేయు చుండ నొకనాఁ డొకగొప్పధ్వని వినవచ్చెను. మరికొంతసేపటి కొకదివ్యవిమానము వచ్చి యాతనియెదుట నిలిచెను. ఆవిమానవాహకులు విష్ణుభక్తు లనిగ్రహించి ధ్రువుఁడు వారలకు నమస్కరించెను. వారు ధ్రువునిజూచి

"ఉ॥ఓనృప నీకు భద్ర మగు • నొప్పగుచున్న మదీయ (వాక్యముల్
వీనులయందుఁ జొన్పుము వి • వేకముతో నయిదేండ్ల (నాఁడు మే
ధానిధివై యొనర్చినయు • దాత్తతపోవ్రతనిష్ఠచేతఁ దే
జోనియశాలి యైనమధు • సూదనుఁ దృప్తి వహింపఁ (జేయవే."

ఠమానాథుఁడు నిన్నుఁ దోడ్కొని రమ్మని మమ్ము నియోగించినాఁడు. విమానం బెక్కుము."

అనిన శ్రీహరికరుణచే ధ్రువుఁడు దివ్యతేజమునంది విమాన మెక్కిపోవుచుఁ దనతల్లి యగు సునీతి నెట్లు భూతల

మున డించి పోవుదునా యని విచారించుచుండ, హరికింకరు లాతని విచార మెఱింగి "నీతల్లి మరియొకవిమానమునందు పై ముందుగఁ బోవుచున్న" దని చెప్పిరి. ధ్రువుఁడు విమానారూఢుఁడై గ్రహమండలమును, మూఁడులోకములును, సప్తముని మండలమును దాఁటి హరిచే నొసంగఁబడిన దివ్యపదమునుండెను. అదియే ధ్రువమండలము.

---

## 8 [పృ థు చ క్ర వ ర్తి]

—:o:—

రాజర్షి యైన యంగమేదినీశ్వరునకుఁ బుత్రకామేష్టిఁ గావించుటచే వేనుం డనునొకపుత్రుఁడు కలిగెను. కాని, యావేనుఁడు కడుఁ గ్రూరాత్ముఁడును, నధర్మపరుఁడు నై చరించుచుండెను. పాపప్రవర్తనుం డైనయాతనినిఁ దండ్రి పెక్కువిధముల దండించినను ప్రయోజనము లేకపోయెను. వేనుఁడు చేయుచుండు దుష్కృత్యములను జూడఁజాలక, తుద కంగరాజొకయర్ధరాత్రిసమయమున నెవ్వరికిఁ దెలుపకుండ సంసారము విడిచి తపోవృత్తి నుండుట కెక్కడికో యరిగెను. మంత్రిపురోహితాదు లాతనిం గూర్చి భూతలం బెల్ల నన్వేషించిరి కాని జాడ గానిపింపలేదు. అంతట రాజ్యం బరాజకంబుగా నుండుట గాంచి, మునిచంద్రు లందరు నాలోచించి వేనునకు రాజ్యాభిషేకము గావించిరి.

పట్టభద్రుఁడైనపిదప వేనుని దుర్గుణములు మరింత హెచ్చెను. అతఁడు ప్రజలపై ననేకకఠినశాసనములు విధించెను. సత్పురుషులను హింసింపఁ దొడఁగెను. వర్ణాశ్రమాచారధర్మము లడుగంటు చుండెను. ఇట్లుండుటఁ జూచి భృగ్వాదిమానులు, వేనునకు శాంతవాక్యములు చెప్పి, యాతనిచిత్తమును సత్పథంబునఁ బెట్టందలఁచి, చేరి చెప్పవలసిన బుద్ధులు చెప్పిరి. మునులు చెప్పినసదుపదేశములు వేనునిశ్రవణరంధ్రముల యందుఁ బ్రవేశింపలేదు. ఇంతియె గాక యాతఁడు హరిని నిందించుచు మునుల కిట్లు పలికెను.

"క॥ హరి హర హిరణ్యగర్భ,
స్వరధీశ్వర వహ్ని శమన ♦ జలదిపతి మరు
న్నరవాహన శశి భూ రవి,
సురముఖ్యులు నృపశరీర ♦ సూచకు లగుటన్."

"క॥ పరికించి నను భజింపుఁడు,
ధరణీశుఁడు సర్వదేవ ♦ తామయుఁ డగు, మ
త్పర ముడుగుఁడు నాకంటెను,
బురుషుఁడు మరి యెవ్వఁ డగ్ర ♦పూజార్హుఁడిలన్."

అనువేనుని వాక్యములవలన మునులకుఁ బూర్ణమైన క్రోధముగ లిగి, యట్టివాఁడు భూతలంబున నుండరా దని, తలంచిరి. అంతట నమ్మునీంద్రు లాత్మప్రకాశితంబైనక్రోధాగ్నిచే నావే నుని బొలియించిరి.

మునీంద్రులు వేనుని బొలియించిరి కాని రాజ్యం బరాజకం బయ్యె ననియు, నందుచే సధర్మములు హెచ్చిపోవు ననియు వారు చింతించిరి. అంగరాజవంశము విచ్ఛిత్తి నొందింపరా దని భావించి, యమ్మునీంద్రులు మృతుండైన వేనుని బాహువులు మథియింప, నం దొకమిథునము జనించెను.

వేనుని బాహుమథనంబునం గలిగిన పురుషుండు పృథు చక్రవర్తి యనియు, నంగన యర్చి యనియు నామంబులం బ్రసిద్ధులయిరి. పృథుచక్రవర్తి శ్రీమన్నారాయణాంశసంభూతుం డని దేవతలచేతను మునులచేతను దలంపంబడెను. మును లెల్లరును బృథుచక్రవర్తికిం బట్టాభిషేకము గావించిరి. పరమ భాగవతాగ్రేసరుండును సమస్తసద్గుణవిరాజితుండును నగునా పృథుచక్రవర్తి గోరూపిణియగు భూమివలన సకలోషధులం బితికె ధరాతలంబు నిరంకుశముగా ధర్మపద్ధతిని బెక్కేండ్లు పరిపాలించి, శతాశ్వమేధంబు లొనర్చి, పుండరీకాక్షునియనుగ్రహమునకుం బాత్రుండయ్యెను.

9 [భరతోపాఖ్యానము.]

---

పూర్వ మంజనాభం బనువర్షంబుం బరిపాలించిన భరతుం డనురాజు గలండు. ఈయంజనాభమే భారతవర్ష మని యాతని పేర వ్యవహరింపఁబడినది. ఆతండు పెక్కువత్సరములు వసుంధరాచక్రంబుం బరిపాలించి, తుదకు విరక్తుండై రాజ్య మంతయుం గుమారులకు సమముగాం బంచియిచ్చి తపోవనం

బును బ్రవేశించెను. అతఁడు గండకీనదీతీరమున నొకయాశ్రమము నిర్మించుకొని తపస్సుఁజేసికొనుచుండెను.

ఇట్లుండ నొకదినమున నాతఁడు స్నానమునకై నదికేఁగ, నాసమయమున దాహపీడిత యై సంపూర్ణగర్భిణి యగునొకహరిణము జలంబులు ద్రావుచుండెను. అప్పు డొకసింహము భయంకరముగ గర్జింప, నాహరిణము మిగుల భయంబంది లంఘించెను. వెంటనే దానిగర్భము జాఱి యొకహరిణపోతము నేలపై బడెను. హరిణము మరణించెను. భరతుఁడు మృతజనని యైన యాహరిణపోతముం గాంచి, కడు జాలివహించి నిజాశ్రమమునకుఁ గొనిపోయి జాగరూకతతోఁ బెంపఁ దొడఁగెను. క్రమక్రమముగా నాహరిణకిశోరము పెరిఁగి, భరతునకు ముదముఁ గూర్చుచుండెను. భరతుఁ డెక్కడికిఁ బోయిన నదియు నతనివెన్నంటి పోవుచుండును. ఆతఁ డొక్కనిముష మైన దాని నెడఁబాయక గారాబముతోఁ బెంచుచుండెను. దానివినోదలీలలను జూచి యానందించుచుఁ బ్రొద్దుఁబుచ్చుచుండుటచేత భరతుని తపస్సు నానాఁటికి సన్నగిల్లుచుండెను. ఇట్లుండఁ గొంతకాలమున కాతనికి మరణ మాసన్నమయ్యెను. ఆతనిచిత్త మంతయు నాహరిణపోతముపైఁ బెట్టుకొని ప్రాణములు విడిచి, హరిణమై జన్మించెను. అయినను నాతనికి బూర్వజ్ఞానము గలిగి యుండెను.

కొన్నాళ్లకు హరిణశరీరము విడిచి యాభరతుఁడు మరల నంగిరసుఁ డనుభూసురునకు నందనుఁడై జనించెను. అంగిరసున

కిరువురు భార్య లుండిరి. జ్యేష్ఠభార్యయందుఁ దొమ్మండుగురు
పుత్రులును, కనిష్ఠభార్యయం దీభరతుఁడును జన్మించిరి. భర
తుఁడు తండ్రియొద్ద సమస్తశాస్త్రములు నభ్యసించెను. తండ్రి
మరణానంతరము భరతునియం దాతనియన్న లనాదరణభావము
వహించి, విద్యలయం దాతనిచిత్తము ప్రవేశింపనీయక గృహకృ
త్యములయం దాతని నియోగించిరి. అతఁడును సుఖదుఃఖముల
యందు దేహాభిమాని గాక సవతితల్లికొడుకులు చెప్పినపను లెల్లఁ
జేయుచుఁ గేవలము జడునివిధముగఁ జరించుచుండెను. అన్నల
యాజ్ఞ ననుసరించి యాతఁడు రేయుంబవళ్లు పొలమునకుఁ గావ
లియుండెను.

ఒకనాఁటిరాత్రి భరతుఁడు పొలములోనుండఁగా వృష
లరాజభటు లాతనిని రాజాజ్ఞ ననుసరించి కాళికి బలియిచ్చుటకు
బంధించుకొని పోయిరి. ఆభటు లాతని కభ్యంజనాదికృ
త్యములఁ దీర్చి నూతనవస్త్రంబులఁ గట్టఁబెట్టి, కాళికాదేవి
సన్నిధికిం గొనిపోయి పీఠమునందుఁ గూర్చుండఁబెట్టిరి. ఈసం
గతి యంతయు భరతుఁడు గ్రహించి, యించుకయైన భయం
బందక పరమాత్ముం డగుశ్రీమన్నారాయణుని మనంబున
ధ్యానించుచుండెను. అంతలో వృషలరాజు ఖడ్గధరుఁడై వచ్చి,
దేవికిఁ బ్రీతిగ భరతుని కంఠముఁ దెగ వ్రేయఁ గత్తి పై
కెత్తెను. కాని, యానృపాలుఁడే తనంతట దానె శిరము పగిలి
నేలఁ బడి ప్రాణములు విడిచెను. భరతుని బంధించి తెచ్చిన
రాజభటులు గూడ మృతినందిరి. పిమ్మట భరతుఁడు దేవ్యాల

టయుంబునుండి యీవలకువచ్చి, పొలమునకుఁ బోయి యెప్పటివలె నుండెను.

మఱికొన్నాళ్లకు రహూగణుఁ డనుసింధు దేశాధీశ్వరుఁడు కపిలమహామునియొద్ద దత్త్వోపదేశము వడయఁగోరి, శిబిక నెక్కి భరతుఁ డున్నపొలము మార్గమునఁ జనుచుండెను. శిబికావాహకులు చేనియొద్ద జడునివలె నున్నభరతునిఁ జూచి, యాతని దోడ్కొనివచ్చి పల్లకి నెత్తిసిఁ బెట్టి మోయుమనిరి. భరతుఁడు తక్కినవాహకులతో సమముగా నడువఁజాలక యుండెను. శిబికయం దున్నరాజేంద్రుఁడు వాహకుల గమనవేగము తనకుఁ గష్టముగా నున్నదనిపలికెను. భరతునివలన నట్టిది కలుగుచుండె నని వాహకులు చెప్పిరి. అద్వితీయబ్రహ్మతేజమున వెలుంగుచున్న భరతుని మహిమ నెఱుంగఁజాలక, రహూగణుఁ డాతనింజూచి "శిబికజాగ్రత్తగామోయు" మని కఠినవాక్యము లాడెను. అహంకారమమకారములు లేనిభరతుఁడు రహూగణుని మాటలకుఁ గోపమందక యెప్పటివలె శిబిక మోయుచుండెను. రహూగణుఁడు మఱింత యాగ్రహమంది "ఓయీ! జీవన్మృతా! నేను చెప్పినను వినక వక్రమార్గమున నడుచుచున్నావు. నిన్ను దండించెద" నని పలికెను. అప్పుడు భరతుఁడు రాజుం గాంచి నెమ్మదిగా నిట్లు ప్రత్యుత్తర మిచ్చెను. "రాజా! అహంకారమమకారములు జరామరణములును దేహముతోడనే పుట్టును. జీవన్మృతుం డని నన్నాడితివి. సేవకసేవ్యసంబంధములు శరీరమునకే గాని జీవునకుండవు. నృపాలుఁడ నని

నీవు నన్నాజ్ఞాపించుచుంటివి. జడుఁడ నగునాయందు నీశిక్ష యేమిపని సేయును?"

ఈపలుకులు వినఁగనే యాతఁ డొకమహాత్ముఁ డని రాజునకుఁ దోఁచెను. వెంటనే శిబిక దిగి భరతునిపాదములకు మ్రొక్కి యిట్లుపలికెను. "మహాత్మా! అవధూతవలె నున్న నీ వెవ్వఁడవు? నన్నుగృతార్థునిఁ జేయుటకు వచ్చిన కపిలమహామునివి కావుకదా! నీప్రభావం బెఱుంగక దోష మొనర్చితిని. నన్ను క్షమింపుము. బ్రాహ్మణులకు భయమందినట్లు నేను కాలునిదండమునకుఁ గాని, శ్రీహరిచక్రమునకుఁ గాని, రుద్రుని శూలమునకుఁ గాని, యింద్రునివజ్రాయుధమునకుఁ గాని భయమందను. బ్రాహ్మణోత్తమా! నాపూర్వపుణ్యమున నీదర్శనము లభించినది. నన్నుఁ గృతార్థునిఁ జేయుము."

ఇట్లు వేడఁగా భరతుఁ డారాజుపైఁ గృపవహించి, యాతనికిఁ దత్త్వజ్ఞానోపదేశ మొనర్చి పంపెను. భరతుఁడును యోగిచందమునఁ జరించుచుఁ గొన్నాళ్లకు శ్రీహరిసన్నిధి కేగెను.

## 10. [అజామిళోపాఖ్యానము.]

:0:

కన్యాకుబ్జనగరమున అజామిళుం డను భూసురుం డొకఁడుండెను. ఆతఁడు సమస్తశాస్త్రముల నభ్యసించినవాఁడయ్యును బ్రపంచమున నున్న దుర్గుణము లన్నియు నాతని యొద్ద రూపముఁ గైకొని యుండెను. ఆతఁ డొకవృషలిని

భార్యగాఁ జేసికొని కులాచార మంతయు మంటఁగలపి, పిత్రార్జిత మైనధనం బెల్ల దాని కర్పించి, నిజభార్యయొుగ మైనఁ జూడక, యావృషలియే స్వర్గ మని తలంచి, జూదరియై, మధుపానరతుఁ డై యుండెను. ఆదాసియందు మోహబద్ధుఁ డై ప్రపంచమే మఱచి యుండెను. ఆతనియొద్ద నున్నధనము క్రమక్రమముగాఁ దగ్గిపోవఁగా దారులఁ గొట్ట నారంభించెను.

ఆవృషలియం దాతనికిఁ బెక్కండ్రు కొడుకులు పుట్టిరి. అందులోఁ గడగొట్టుకొమరునిపేరు నారాయణుఁడు. నారాయణునిపై నజామిళునకు, బ్రేమ మిక్కుటముగ నుండెను. ఒక్కనిముషమైనను నతఁడు నారాయణుని విడిచి యుండువాఁడు కాఁడు. కొన్నాళ్లకు నజామిళుఁడు వృద్ధుఁడయ్యెను. దృష్టితగ్గెను. దేహము ముడుతలుపడెను. దీర్ఘసంకట మావరించెను. మరణకాలము సమీపించెను. అంత్యకాలమున నాతనికి మహాభయంకర రూపములతో యమకింకరులు గనిపించిరి. ఆతఁడు వారిం జూచిన యంతనే భయంబంది, తనకుఁ గొంచెము దూరములోఁ దోడిబాలురతో నాడుకొనుచున్న చిన్నకొమరుఁ డైననారాయణుని "నారాయణా! నారాయణా!" యని పిలిచెను. నారాయణశబ్ద మజామిళుని నోటినుండి వెలువడఁగనే విష్ణుదూతలు వచ్చి యమదూతలను బాఱఁద్రోలిరి.

"సీ॥ బ్రహ్మహత్యానేక • పాపాటవుల కగ్ని
కీలలు హరినామ • కీర్తనములు

గురుతరకల్మష • క్రూరసర్పములకుఁ
గేకులు హరినామ • కీర్తనములు
తపనీయచౌర్యసం • తమసంబునకు సూర్య
కిరణముల్ హరినామ • కీర్తనములు
మధుపానకిల్బిష • మదనాగసమితికిఁ
గేసరుల్ హరినామ • కీర్తనములు
తే. మహితయోగోగ్ర నిశ్వాస • మాధివిధుల
నలరుబ్రహ్మాదిసురులకు • నందరాని
భూరినిర్వాణసామ్రాజ్య • భోగభాగ్య
ఖేలనంబులు హరినామ • కీర్తనములు."
"ఆ. బిడ్డపేరుపెట్టి • పిలుచుట విశ్రామ
కేలినయిన మిగులఁ • గేలినయినఁ
బద్యగద్యగీత • భావార్థములనైనఁ
గములనయినుఁ దలఁపఁ • గలుషహరము."

విష్ణుకింకరులను గాంచినయంతనే యజామిళునకు భయము పోయెను. ఆతఁడు వారికి నమస్కరించి యేమో పలుకఁదలఁచెను. కాని, వారదృశ్యు లయిరి. విష్ణుకింకరుల సందర్శనము వలన నాతఁడు పశ్చాత్తాపమునంది "అక్కటా! బ్రాహ్మణుఁడనైన నేను సమస్తశాస్త్రములఁ జదివి, స్వకులాచారధర్మములు మంటిలోఁ గలిపి, వృషలియే మోక్షమని తలఁచి పాపవర్తనుఁడనైతిని;" అని చింతించి, విరాగియై గంగాతీరమున

కేగి, భగవంతుఁ డగు శ్రీమన్నారాయణునిఁ గూర్చి తపం బొనర్చి సద్గతి నందెను.

---

## 11. [చిత్రకేతూపాఖ్యానము.]

---

మున్ను, చిత్రకేతుఁ డనుభూపాలుఁడు శూరసేనదేశముం బాలించుచుండెను. ఆతఁడు సద్గుణమూర్తి. ధర్మసంధుఁడు. ఆతనికిఁ బెక్కండ్రు భార్యలు కలరు. కృతద్యుతి యను నామె పట్టమహిషి యై యుండెను. ఏవిధ మైనసౌఖ్యభోగములకుఁ గాని, సంపదకుఁ గాని కొఱంత లేనియాతనికి సంతానము లే దను చింతమాత్రము మిక్కుటముగ నుండెను. ఒక దినంబున నంగిరసుం డనుమునీంద్రుఁ డాతనిమందిరంబున కరుదెంచి పూజితుండై, యాతనివిచారకారణం బరసి, పుత్రకామేష్టిఁ జేయుమని చెప్పి యరిగెను. మునివచనంబులు ననుసరించి చిత్రకేతుఁడు పుత్రకామేష్టిని మహావైభవముగఁ జేసి, వేలకొలఁది భూసురులకు వివిధదానములఁ గావించెను. కాలక్రమమున నాతనిపట్టమహిషి గర్భము ధరించి యొకకుమారునిం గాంచెను. కుమారోదయమునకుఁ జిత్రకేతుఁ డపరిమితానంద మంది, వానికిజాతకర్మంబు నిర్వర్తించెను. ఆకుమారుఁడు దినదినప్రవర్ధమానుఁ డగుచు ముద్దుముచ్చటలచేతఁ దల్లిదండ్రులకు

నిరంతరము సంతసము గూర్చుచుండెను. పుత్రోదయ మైన నాఁటనుండియు రాజేంద్రుఁడు కృతద్యుతియందే బద్ధానురాగుఁడై యుండెను. ఇట్లుండుటచేతను, దాము సంతానరహిత లగుటచేతను దక్కినభార్యలు కృతద్యుతియందసూయావహించి, యొకనాఁడు రాజపుత్రునకు విషముఁబెట్టిరి. విషము ద్రావినకుమారుఁడు మృతుఁడై శయ్యపై నుండెను. నిజతనయునిమృతికిఁ గృతద్యుతియుఁ, జిత్రకేతుఁడును గుండెలు బాదుకొనుచు నేడ్చుచుండిరి.

ఆసమయమున వారికడకు సంగిరసమునీంద్రుఁడు వచ్చి, విలపించుచున్న చిత్రకేతుని వీక్షించి యిట్లు పలికెను. "నృపాలా! నీవెవ్వరినిమిత్తము దుఃఖించుచుంటివి? ఈమృతి సందినవాఁడు నీకే మగును? నీయాలుబిడ్డలు గతజన్మమున నెవ్వరివారో యెఱుంగుదువా? జననమరణములు దేహికి సహజములు. సంపదలు చంచలములు. నీవు గతించినపుత్రునికై విలపించినందువలనఁ బ్రయోజనము లేదు. శ్రీహరి నాశ్రయింపుము." ఇట్లు పలికి, యామునీంద్రుఁడు మృతబాలకకళేబరంబును సమీపించి "జీవుఁడా! నీ వీశరీరంబును విడిచి పోయితి వేల? నీకొఱకు నీతల్లిదండ్రులు దుఃఖించుచున్నారు. మరల నీకళేబరంబునఁ బ్రవేశింపు" మని పలికెను. అందులకా జీవుఁ డిట్లు బదులుచెప్పెను. "మునీంద్రా! కర్మవశమున సుఖమనుమాట నెఱుంగక యనేకజన్మము లందు చున్నాను వీ రీజన్మమునఁ దల్లిదండ్రు లైనారు.

"క॥ సతు లెవ్వరు సుతు లెవ్వరు
పతులెవ్వరు మిత్రశత్రు • బంధుప్రియసం
గతు లెవ్వరు సర్వాత్మక
గతుఁడై గుణసాక్షి యైన • ఘనునొక్కనికిన్."

నాతో వీరి కేమిసంబంధము! నాకు వీ రెక్కడితలిదండ్రులు. నాకై వీరు విచారింపఁ బనిలేదు." అని పలికి యాజీవుఁడు వెడలి పోయెను. చిత్రకేతుఁ డీవాక్యములవలన వైరాగ్య మంది, సంసారమును బరిత్యజించి, యరణ్యమునకుఁ బోయి శ్రీహరింగూర్చి తపముఁజేసెను. శ్రీహరి యనుగ్రహమున నాతఁడొకదివ్యవిమానమునొంది, దానిపై నెక్కి, హరిసేవారతుఁడై త్రిలోకములయందు యథేచ్ఛముగాఁ జరించుచుండెను.

ఒకనాఁ డాతఁడు కైలాసమునకుఁ బరమేశ్వరుని దర్శింపఁ బోయెను. ఆసమయమున దేవతలును, మునులును సేవింప, శివుఁడు సభఁదీర్చి యుండెను. పార్వతి యాతనియంకపీఠమున నాసీనయై యుండెను. అందులకుఁ జిత్రకేతుఁడు శంభునిఁజూచి నవ్వి "ఈతఁడు లోకగురుఁడు. అట్టివో మహానుభావు లగుమునీంద్రు లున్నసభయందుఁ బరమేశ్వరుఁడు సిగ్గు విడిచి భార్యతో నిట్లాసీనుఁడై యుండుట తగునా!" యని పలికెను. ఆమాటలకు శివుఁ డేమియు మాటలాడలేదు. పార్వతికిమాత్రము కోపము వచ్చెను. ఆమె చిత్రకేతునింజూచి

"ఓయీ! మునీంద్రు లెవ్వరును నీవలె ధర్మనిర్ణయము సేయ నేరరు కాబోలు! ఎవ్వనిచరణారవిందములను మహేంద్రాదిబృందారకులు సంతత మాశ్రయింతురో, ఎవ్వనిని గొల్చి భక్తులు శాశ్వతానందపదవిని గాంతురో యట్టిభగవంతుఁడై నయీశంకరుని దూషించుచున్న నీవు శ్రీహరి కెట్లు భక్తుఁడ వైతివో తెలియకున్నది. లోకవంద్యుఁ డగునానాథుని దూషించినందులకు ఫలముగా నీవు రాక్షసుఁడవై జన్మింపుము." అని పలికెను. అంతటఁ జిత్రకేతుఁడు జగజ్జనని యగుపార్వతిపాదములపైఁ బడి "మాతా! నీశాపము నే ననుభవింపక తప్పదు. సుఖదుఃఖములు తనకర్మము ననుసరించి వచ్చుచుండును. నాయపరాధమును మన్నింపు" మని వేఁడెను. తరువాతఁ గొన్నాళ్లకు చిత్రకేతుఁడు వృత్రాసురుఁ డనుదైత్యుఁడై జన్మించి, యింద్రునిచేఁ గూలి, శాపమువాసి ముక్తిఁ బొందెను.

---

## 12. [ప్రహ్లాదచరిత్రము.]

:o:

జయవిజయు లనుశ్రీహరిమందిరపాలకులే మునులశాపకారణమున హిరణ్యకశిపుహిరణ్యాక్షులై జనియించి రనియు నందు హిరణ్యాక్షుఁడు వరాహరూపుఁడగు హరిచే వధింపఁబడె ననియు జదివి యుంటిమికదా! తమ్మునిమృతివిని, హిరణ్యా

కశిపుఁడు మిగుల విచారించి యాతనిస్మృతికిఁ గారణుఁ డైన శ్రీహరిని సాధింపఁ దలఁచి, మంత్రుల రావించి యిట్లు పలికెను. "మంత్రులారా! నాకుఁ దమ్ముఁడును, యుద్ధశాస్త్ర పండితుఁడును, త్రిలోకభయంకరుఁడును, నగుహిరణ్యాక్షుని శ్రీహరి సూకరరూపమునఁ వధించినాఁడఁట! ఆహరి యెట్టు లుండునో, వాని జాడ యెట్టిదో, తెలియకయున్నది. ఆతఁడు మనకుఁ జిక్కక యున్నాఁడు. ఆతఁ డెట్టిరూపము దాల్చినను, నాకు భయమంది పాతాళమున డాఁగినను బట్టి వధించి, యాతనిరక్తమున నాతమ్మునకుఁ దర్పణములు విడిచెదఁ గాక! దానవవీరులారా! మీరు నావాక్యములు బాగుగా వినుఁడు. మీరువెంటనే బయలుదేఱి పోయి, యందందుఁ దిరుగుచు జపములుతపములు చేసికొనువారిని వెదకి ఖండింపుఁడు. విష్ణుఁ డెక్కడనో యుండఁడు. ఆతఁడే యజ్ఞము. ఆతఁడే వేదము. బ్రాహ్మణక్రియల కతఁడే మూలము. పితృదేవతలకును, దేవతలకును, మునులకును, సకలధర్మములకును నాధార మతఁడే. ఇంతయేల! ఏస్థలములందు గోవులును, భూసురులును, వర్ణాశ్రమధర్మములు నుండునో, యచట నాతఁ డుండును. కావున నట్టిస్థలము లన్నియు దగ్ధముచేసి రండు."

అని యిట్లు రాక్షసులకుఁ జెప్పి యాదానవేంద్రుఁడు బ్రహ్మంగూర్చి తపముఁ జేసి గొప్పవరములు వడసివచ్చుటకు మందరాచలమున కరిగెను. హిరణ్యకశిపుఁడు నగరమున లేఁడు

కదా యని దేవేంద్రుఁడు రాక్షసులపై దండెత్తి వచ్చెను. రాక్షసులు ఘోరముగఁ బోరాడిరి గాని తుదకింద్రుఁడే విజయము నందెను. ఇదియే సమయ మని యింద్రుఁడు హిరణ్యకశిపునియంతఃపురముఁ బ్రవేశించి యాతనిభార్య యగులీలావతినిఁ జెఱపట్టి కొనిపోవుచుండెను. గర్భవతి యగులీలావతి తన్ను విడువు మని మహేంద్రుని నెంతయో బతిమాలెను. ఆతఁ డామెమాటలు వినక కొనిపోవుచుండెను. అంతలో దైవయోగమున మార్గమధ్యమున నారదుఁ డెదురై లీలావతిని బలవంతముగాఁ గొనిపోవుచున్న శచీకళత్రునిఁ జూచి "త్రిభువనాధీశ్వరా! నీవు వేల్పులలోనఁ బెద్దవు. పుణ్యమూర్తివి. సకల ధర్మము లెఱింగిన వాఁడవు. న్యాయాన్యాయములఁ బరిశీలించు వాఁడవు. అట్టినీవు లీలావతినిఁ జెఱగొనిపోవుట యుచితము కాదు. ఈమె మహాపతివ్రత గాని కల్మషచిత్త కాదు," అని చెప్పెను. అందులకు మహేంద్రుఁడు "నారదమునీంద్రా! నేను దుర్బుద్ధిఁ బూని యీమెను గొనిపోవుట లేదు. హిరణ్యకశిపుఁడు లోకకంటకుఁ డని నీకుఁ దెలియును గదా! ఇఁక నీమెగర్భమున జనించువాఁ డెంతటివాఁ డై లోకములకుఁ గీడు సేయునో! ఆ కారణమున నే నీమెను గొనిపోవుచుంటిని. ప్రసూతిపర్యంత మీమెను బద్ధఁజేసి, యీమెకు జనించు కుమారుని వజ్రధారం దునిమి, పిదప విడిచెద" నని బదులు చెప్పెను. ఆమాటలు విని నారదుఁ డాతని కిట్లనెను. "ఈలీలావతిగర్భమునఁ బరమభాగవతోత్తముఁ డగుబాలుఁ డున్నాఁడు.

ఆతఁ డెవ్వరి చేతను జావఁడు. ఆతనివలన జగంబులకు మేలొదవును." అని పలికి యామెను విడిపించి "తల్లీ! నీవు చింతింపవలదు. నీవు మహాసాధ్వివి. నీగర్భమున విష్ణుభక్తుఁ డున్నాఁడు. దానవేంద్రుఁడు తపమునుండి వచ్చువఱకు నీవు నాయాశ్రమమున నుందువుగాక" యని పలికి నారదుఁ డామెను దన యాశ్రమమునకుఁ దీసికొనిపోయెను. లీలావతికిఁ బరిచర్యలు సేయు నిమిత్తము నారదుఁడు ఋషికన్యల నియమించెను. ఆమెయు నారదునియందు భక్తిఁబూని శుశ్రూషలు సేయుచుండెను. అంతఁ గొన్నాళ్లకా మెకుఁ బ్రహ్లాదుఁ డను కుమారుఁడు జనించెను.

మందరాద్రికిఁ జనిన హిరణ్యకశిపుఁడు నిశ్చలమైనచిత్తముతో బ్రహ్మనుగూర్చి తపముసేయుచుండెను. ఆతనితపము యొక్క వేఁడిమికి భూమి బ్రద్దలువాఱెను. సప్తజలరాసులును గలంగెను. సకలజీవులకును గుండె లదరెను. దేవత లాతనితపమున కోర్వఁజాలక బ్రహ్మసన్నిధికిఁ బోయి యిట్లు వచించిరి. "దేవా! అభేద్యము లగువరము లెవ్వియో యాశించి దానవేంద్రుఁడు ఘోరమైనతపము సేయుచున్నాఁడు. నీ వెట్లు తపోబలమున లోకముల సృష్టించుచు దేవతలలోఁ బెద్దవైతివో యట్లే యాతఁడు గూడఁ దపోమహిమను వేఱొక్కభువనమును నిర్మించుశక్తిఁ గాంచఁగోరినట్లు తోఁచుచున్నది. యేవేల! ఆతఁడు తనకు నిత్యత్వము నార్జించుకొనఁ దలఁచినాఁడు. కావున నతనితపము వారించి లోకముల రక్షింపుము."

అనినఁ జతుర్ముఖుఁడు భయమందవల దని చెప్పి దేవతలను బంపివేసి, హిరణ్యకశిపునిఁ జూచుటకు మందరగిరికిఁ బోయెను. అప్పుడు దానవేంద్రుఁడు గాఢమైన తపస్సమాధియం దుండెను. ఆతనిశరీర మంతయు వనమక్షికాపిపీలికాదులచే భక్షింపఁబడు చుండెను. మాంసరక్తములు లేక శల్యావశిష్టుఁడై యుండెను. చతుర్ముఖుఁ డాతనిని సమీపించి యతనిపైఁ దనకమండలుజల మును బ్రోక్షించెను. వెంటనే రాక్షసేంద్రుఁడు కన్నులు తెఱచి, భారతీనేతను జూచి తదీయపాదపద్మములకు నమస్క రించి నిలిచియుండెను. బ్రహ్మ తనకరకమలములతో దాన వేంద్రునిశరీరము స్పృశించి "దానవేంద్రా! నీవలె నిట్లు గ్రమైన తపముఁ జేసినవా రెవ్వరును లేరు. నీతపమునకు మెచ్చితిని. ఇఁక నీ వాయాస మందవలదు. నీకు వలసిన వరము లిచ్చెద. వేఁడుము." అనిపలికెను. హిరణ్యకశిపుఁడు బ్రహ్మ ననేకవిధ ములఁ బ్రస్తుతించి యిట్లు పలికెను.

"ఆశ్రయించినవారిని రక్షించుటయందు నీతో సమాను లయినవేల్పులు లేరు. నాకు వరంబు లీయఁదలఁచితి వేని కరుణుంచి నేను గోరెడువరంబుల నిమ్ము.

"శా॥ గాలిం గుంభిని నగ్ని నంబువుల నా ♦ కాశస్థలిన్ దిక్కులన్
రేలన్ ఘస్రములం దమః ప్రబల భూ ♦ రిగ్రాహరక్షోమృగ
వ్యాళాదిత్యనరాదిజంతుకలహ ♦ వ్యాప్తిన్ సమస్తాస్త్రశ
స్త్రాళిన్ మృత్యువు లేనిజీవనము లో ♦ కాధీశ యిప్పింపవే."

ఇదియుంగాక యుద్ధముల యందు నాకు సాటిలేనిపరాక్రమము, దేవతల నతిక్రమించు ప్రభావము నిమ్ము."

దానవేంద్రునిపలుకులు విని బ్రహ్మ "దనుజేంద్రా! ఈవరము లన్నియు దుర్లభము లైనవి. ఇట్టివి యు న్నెవ్వరును గోరలేదు. కాని, నీతపమునకు సంతోషించి యొసఁగితిని. కావున నీవీవరముల జాగ్రత్తగాఁ గాపాడుకొనుచు సుగుణశీలుఁడ వై యుండు" మని పలికి నిజలోకమున కరిగెను.

హిరణ్యకశిపుఁడు సంతోషించుచుఁ దనపురమునకు వచ్చెను. ఆతఁడు లేనప్పు డింద్రుఁడు వచ్చుటయు, లీలావతినిఁ జెఱగొని పోవుటయు, మొదలగువార్తలు దనుజులచే విని శోకక్రోధాక్రాంతుఁడై మండిపడుచు దేవలోకముపై దాడి వెడలుటకుఁ దలంచుచుండెను. ఇంతలో నారదుఁడు ప్రహ్లాదసహిత యగులీలావతిని దోడ్కొనివచ్చి యాతని కప్పగించెను. కుమారోదయమునకు రాక్షసేంద్రుఁడు మిగుల సంతసించి, తన యెడల నారదుఁడు చూపినకరుణకు మిగుల శ్లాఘించెను.

బ్రహ్మచే వరములు గాంచుటచే మిగుల గర్వించి, శ్రీహరి తనతమ్ముని జంపినపగ సాధింపఁదలఁచి హిరణ్యకశిపుఁడు లోకముల హింసింపఁ దొడఁగెను. ఒకసమయమున గంధర్వులఁ బరిమార్చును. మఱియొకసమయమున దేవతలఁ బాఱఁద్రోలును. ఒకనాఁడు గ్రహములఁ గట్టివైచును. ఒకనాఁడు యక్షుల దండించును. ఒకనాఁడు సిద్ధుల నోడించును. ఒకనాఁడు మనుష్యుల బంధించును. వేయేల! దుర్మార్గుఁ డైన

యాదానవునిచేత బంధింపఁబడనివా రెవ్వరును లేరు. ఆతఁడే సర్వభువనములకును నేలిక యని దేవత లందఱును గానుక లిచ్చి సేవింపసాగిరి. "నేఁ డెవ్వనిమీఁదికి దండెత్తి వచ్చునో; ఎవ్వనిం జంపునో! ఎవ్వనిరాజ్య మపహరించునో, యని దేవత లెల్లరును భయభ్రాంతులై చూచుచుందురు. హిరణ్యకశిపుని పరాక్రమమునకు భయమంది కాఁబోలు! భూమి దున్నకయె పండుచుండెను. సముద్రములు రత్నసందోహమును సంతతము వహించుచుండెను. సర్వలోకభయంకరుఁ డగు హిరణ్య కశిపుఁడు పెట్టుబాధల కోర్వఁజాలక దేవత లందఱును రహస్య ముగ శ్రీమన్నారాయణుని సన్నిధికిఁ బోయి నమస్కరించి దైత్యునివలనఁ దమకుఁ గలుగుచున్న బాధల విన్నవించిరి. లక్ష్మీనాథుఁడు వారియెడల కృపాంతరంగుఁ డై "దేవతలారా! మీరు భయమందవలదు. ఆదానవేంద్రుఁడు లోకకంటకుఁడై యున్న సంగతి నే నెఱుంగుదును. కాని, తగినసమయమున కై వేచియుంటిని.

"ఆ. శుద్ధసాధులందు ♦ సురలందు శ్రుతులందు
గోవులందు విప్ర ♦ కోటియందు
ధర్మపదవియందుఁ ♦ దగిలి నాయందు వాఁ
డెప్డుఁ డలుగు నాఁడె ♦ హింస నొందు."

ఇదియుంగాక, తనకుమారుఁ డైనప్రహ్లాదుని యందు వాఁడెప్పుడు విరోధముఁ దలఁచి దండించునో యప్పుడే వాఁడు

నాచే నిహతుం డగును. ఇఁక విచార ముడిగి మీ నెలవుల కరుగుఁడు,” అని పలికి వారిం బంపివేసెను.

[ప్రహ్లాదునివిద్యాభ్యాసము.]

సీ. తనయందు నిఖలభూ ♦ తములందు
నేకభంగి, సమహితత్వంబున ♦ జరుగువాఁడు
పెద్దలఁ బొడఁగన్న ♦ భృత్యునికైవడిఁ,
జేరి నమస్కృతుల్ ♦ సేయువాఁడు
కన్నుదోయికి నన్య ♦ కాంత లడ్డంబైన,
మాతృభావముఁ జేసి ♦ మరలువాఁడు
తల్లిదండ్రులభంగి ♦ ధర్మవత్సలతను,
దీనులఁ గావఁ జిం ♦ తించువాఁడు
తే. సఖులయెడ సోదరస్థితి ♦ జరపువాఁడు
దైవతములంచు గురువులఁ ♦ దలఁచువాఁడు
లీలలందును బొంకులు ♦ లేనివాఁడు
లలితమర్యాదుఁ డైన ప్ర ♦ హ్లాదుఁ డధిప.

పుష్ప ముద్భవించుతోడనే పరిమళముగూడఁ గలుగును. ప్రహ్లాదుఁడు దైత్యబాలకుఁ డైనను, నాకులగుణము లేవియు నాతనియొద్ద లేవు. శుక్లపక్షచంద్రునివిధమున దినదినాభివృద్ధి నందుచు నాకుమారుఁడు తల్లిదండ్రులకు ముదముఁ గూర్చు చుండెను. బాలుఁ డైనను నాతఁడు తన కెవ్వరైనఁ బెద్దలు

గనిపించి రేని నమస్కరించును. నిరుపేదలఁ జూచిన జాలిఁ బొందును. ఆటపాటలయందైన, నవ్వులకైన నసత్య మాడఁడు. బాల్యమునుండి యు నాతనిచిత్తము శ్రీహరివశ మయ్యెను. ఆకారణముచే నొక్కొక్కసమయమున శ్రీహరి తనసమీపమునకు వచ్చినట్లు భావించి సంతోషించుచుండును. ఒకసమయమునఁ దనలోఁ దానె మాటలాడును. ఒక్కొక్క సమయమున సమస్తము మఱచి కేవలము జడునివిధమున సంచరించుచుండును. ఆతనిహరిభక్తి యిట్టిదని వర్ణింపఁ జాలనిదై యుండెను. నీరములు ద్రావునప్పుడైనను, భుజించు నప్పుడైనను, శయనించినప్పుడైనను నాతఁడు శ్రీహరినామ స్మరణము మఱచియుండఁడు.

ప్రహ్లాదుఁ డేవిధమున నుండెనని హిరణ్యకశిపుఁడు విని, విద్యాభ్యాసమునఁ గాని వానిమనస్సు చక్కంబడదని, యక్కుమారుని రావించి,

"క॥ చదువనివాఁ డజ్ఞుం డగు
జదివిన సదసద్వివేక ♦ చతురత గలుగుం
జదువఁగవలయును జనులకుఁ
జదివించెద నార్యులొద్దఁ ♦ జదువుము తండ్రీ."

నీవు గురువులసన్నిధియందు విద్య గఱపుము." అని పలికి శుక్రా చార్యతనూజు లగుచండామార్కుల రావించి "గురుతనయు

లారా! ఈబాలుఁడు విద్యాగంధ మింతయు లేక కేవల మంధునివలె నున్నాఁడు. దైత్యకులాచారము కొంచెమైనను గ్రహింపకయున్నాఁడు. కావున వీనికి సద్విద్యఁ గఱపి నీతి కుశలునిగాఁ జేయుఁ"డని పలికెను. గురుపుత్రులు ప్రహ్లాదునిఁ దోడ్కొని పోయి, సమవయస్కులైన బాలురతోఁ గలిపి విద్య నేర్పఁ బ్రారంభించిరి. కొన్ని దినములలోఁ బ్రహ్లాదుఁడు పెక్కు శాస్త్రములఁ గఱచెను. అంత నొకనాఁడు హిరణ్యకశిపుఁడు, తనకుమారుఁ డేమి చదివెనో చూడఁదలఁచి, యక్కుమారుని రావించి, ముద్దుపెట్టుకొని, "వత్సా! కుమారుల మృదుమధురసంభాషణంబులు జనకుల కర్ణభూషణములును, దుఃఖశోషణములు నై యొప్పుచుండును. గురువులయొద్ద నీ వేమి పఠించితివి. నీ కెయ్యది భద్రం బని తోఁచుచున్నది" యని పలికెను.

అందులకుఁ బ్రహ్లాదుఁడు తండ్రికి నమస్కరించి "జనకా! శరీరధారు లెల్లరును, నిల్లనుకూపమునఁ బడి చావక, యరణ్యమునకుఁ బోయి చిత్తము శ్రీహరిపైఁ జేర్చి యుంచుట మే లనితోఁచుచున్నది" యని బదులు చెప్పెను. హిరణ్యకశిపునకు శ్రీహరి విరోధి యగుటచేఁ బ్రహ్లాదుని పలుకు లాతనికి వింతగఁ దోఁచి "వత్సా! నీపలుకులు నాకు మిగులఁ జోద్యముగ నున్నవి. ఈబుద్ధి నీకే తోఁచెనా! లేక యెవ్వరైన బోధించిరా! ఆశ్రీహరి మన కపరాధముఁ జేసినాఁడు. ఆతనిని స్మరించెదవేల? శౌర్యమును బూని రణరంగమున శత్రువులఁ

జంపవలయును. సిద్ధులను వేధింపవలయును. మునులను బాధింపవలయును. గరుడోరగాదుల సంతోషమందింపవలయును. అంతియే కాని హరి యనియు, గిరి యనియుఁ బలుకుట దైత్యకులాచారము కాదు," అని పలికెను. తండ్రి మాటలు విని ప్రహ్లాదుఁడు గురులతో ని ట్లనెను. "మోహరాగాదుల జయించి శ్రీహరి యందుఁ దనచిత్తముఁ జేర్చి సర్వము నాతఁడే యని తలంచు వానికి వీరు వా రనుభేద ముండదు. ఇట్టిమాయలోఁ బడిన మూఢులు పరమాత్ముని జూడఁజాలరు.

"తే. ఇను మయస్కాంతసన్నిధి • నెట్లు భ్రాంత
మగు, హృషీకేశుసన్నిధి • నావిధముగఁ
గరఁగుచున్నది దైవయో • గముగఁ జేసి
బ్రాహ్మణోత్తమ ! చిత్తంబు • భ్రాంత మగుచు.

నాచిత్తము పూర్తిగా శ్రీహరియందుఁ జిక్కియున్నది.

"సీ. మందారమకరంద • మాధుర్యమునఁ దేలు
మధుపంబు వోవునే • మదనములకు
నిర్మలమందాకి • నీవీచికలఁ దూఁగు
రాయంచసనునె తరం • గిణులకు
లలితరసాలప • ల్లవఖాది యై చొక్కు
కోయిల చేరునే • కుటజములకుఁ
బూర్ణేందుచంద్రికా • స్ఫురితచకోరకం
బరుగునే సాంద్రనీ • హారములకు

తే. నంబుజోదరదివ్యపా ♦ దారవింద
చింతనామృతపానవి ♦ శేషమత్త
చిత్త మేరీతి నితరంబుఁ ♦ జేరనేర్చు
వినుతగుణశీల మాటలు ♦ వేయునేల.

ప్రహ్లాదునిపలుకుల కాగ్రహమంది గురుఁడు "నీవు బాలుఁడవు
మేము చెప్పినశాస్త్రములలో నొక్కటియైన మీతండ్రికిఁ
జెప్పక విరోధిం గూర్చి ప్రశంసించుచు మాకుఁ దలవంపులు
గూర్చితివి," అనిపలికి, యాతనిని మరలఁ జదివించి నీతులు
బోధించి తోడ్కొనివత్తు మని హిరణ్యకశిపునితోఁ జెప్పి, కొని
పోయిరి. కొన్నాళ్లు చనినపిదప గురుపుత్రులు ప్రహ్లాదునిఁ
దండ్రియొద్దకుఁ దీసికొనిపోయిరి. లీలావతిగూడఁ బుత్రునివెంట
నేగెను. ఆమె ప్రహ్లాదునకు "కుమారా ! మీతండ్రికిఁ
గోపమువచ్చుపలుకులఁ బలుకకుము," అని చెప్పెను. శ్రీమ
న్నారాయణనామసంస్మరణమునఁ గలుగుచున్న యానందముచే
శరీరము మఱచుచున్నవాఁడును, హరిభక్తి సంపూర్తిగనభ్యసిం
చినవాఁడును, తల్లిగర్భమునం దున్నప్పుడే చిత్తమును ముకుం
దునియందుఁ జేర్చినవాఁడును నగు ప్రహ్లాదుఁడు గురువులచేఁ
గొనిపోఁబడి తండ్రికి నమస్కరించి నిలుచుండెను. కుమారుని
జూచి తండ్రి ముదం బంది, "వత్సా ! ఉపాధ్యాయులు నీ
కేమిశాస్త్రములు బోధించిరి. నీ వేమి చదివి గ్రహించితివి?"
అని యడిగెను. అందులకుఁ బ్రహ్లాదుం డిట్లు ప్రత్యుత్తరముం
జెప్పెను.

"తండ్రీ ! నేను సమస్తశాస్త్రములుం జదివినాఁడను. శ్రీహరిని సేవించుచు నుండుటయే ముఖ్య మని నేను గ్రహించితిని.

సీ॥ కమలాక్షు నర్చించు ♦ కరములు కరములు
శ్రీనాథువర్ణించు ♦ జిహ్వ జిహ్వ
సురరక్షకునిఁ జూచు ♦ చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు ♦ శిరము శిరము
విష్ణు నాకర్ణించు ♦ వీనులు వీనులు
మధువైరిఁదవిలిన ♦ మనము మనము
భగవంతు వలఁగొను ♦ పదములు పదములు
పురుషోత్తమునిమీఁది ♦ బుద్ధి బుద్ధి

తే. దేవదేవునిఁజింతించు ♦ దినము దినము
చక్రహస్తుని బ్రకటించు ♦ చదువు చదువు
కుంభినీధవుఁ జెప్పెడి ♦ గురుఁడు గురుఁడు
తండ్రి ! హరిఁ జేరుమనియెడి ♦ తండ్రి తండ్రి."

"సీ॥ కంజాక్షునకుఁ గాని ♦ కాయంబు కాయమే
పవనగుంభితచర్మ ♦ భస్త్రి గాక
వైకుంఠుఁ బొగడని ♦ వక్త్రంబు వక్త్రమే
ఢమఢమధ్వనితోడి ♦ ఢక్క గాక
హరిపూజనము లేని ♦ హస్తంబు హస్తమే
తరుశాఖనిర్మిత ♦ దర్వి గాక

కమలేశుఁ జూడని ♦ కన్నులు కన్నులే
తనుకుడ్యజాలరం ♦ ధ్రములు గాక
ఆ. చక్రిచింతన లేని జన్మంబు ♦ జన్మమే
తరళసలిలబుద్బు ♦ దంబు గాక
విష్ణుభక్తి లేని ♦ విబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడి ♦ పశువుగాక."

సీ. సంసారజీమూత ♦ సంఘంబు విచ్చునే
చక్రిదాస్యప్రభం ♦ జనము లేక
తాపత్రయాభీల ♦ దావాగ్ను లాఱునే
విష్ణుసేవామృత ♦ వృష్టి లేక
సర్వంకషాఘౌఘ ♦ జలరాసు లింకునే
హరిమనీషాబడ ♦ బాగ్ని లేక
ఘనవిపద్గాఢాంధ ♦ కారంబు లడఁగునే
పద్మాక్షునుతిరవి ♦ ప్రభలు లేక
తే. నిరుపమానపునరావృత్తి ♦ నిష్కళంక
ముక్తినిధి కానవచ్చునే ♦ ముఖ్యమైన
శార్ఙ్గకోదండచింతనాం ♦ జనము లేక
తామరసగర్భునకు నైన ♦ దానవేంద్ర."

ఈవిధమున నిర్భయచిత్తుఁడై పలికిన కుమారునిపలుకుల కలుక వొడమి హిరణ్యకశిపుండు గురుపుత్రుల విలోకించి, వారే తన తనయున కట్టిబోధలు గావించి రని దూషించెను. అందులకు

గురుపుత్రులు తమవలన నావంతయు దోషము లేదని తెలుప, దానవేంద్రుఁడు తనయుని గాంచి "గురువులు చెప్పని యీవిషయములు నీ కెవ్వరు బోధించి" రని యడిగెను. ప్రహ్లాదుఁడు "తండ్రీ! సంసారవార్ధిని మునిఁగి, మోహానురాగ పాశములచేఁ గట్టువడి, చచ్చుచు, మఱలఁ బుట్టుచు నుండు వానికి హరిభక్తి యొకరు బోధించినను లభింపదు. లక్ష్మీనాథ సేవానౌకచేతఁ గాని భీకరసంసారసముద్రము నెవ్వరును దాఁటఁ జాలరు." అని పలుకఁగనే హిరణ్యకశిపునకుఁ గ్రోధ మధిక మై, తనయంకమున నున్నయాతని గ్రిందకుఁ ద్రోసి మంత్రులను జూచి "పినతండ్రిని జంపినహరి నీతఁడు ప్రశంసించుచు, మనకులాచార మంతయు మన్ననఁ గలుపుచున్నాఁడు. ఈజనకద్రోహిని మీరాయిచ్చవచ్చినయట్లు శిక్షింపుఁడు," అనిపలికెను.

దైత్యేంద్రునియాజ్ఞ ననుసరించి దానవభటులు ప్రహ్లాదుని గొనిపోయి హరిభక్తి విడువు మని పలుకుచు శూలములతోఁ బొడిచిరి. ఆతఁ డిసుమంతయు భయ మందలేదు. తనచిత్త మంతయు హరిపైఁ జేర్చి యుండెను. భటు లాతని నెంతకొట్టుచుండినను బాఱిపోవుట కైనఁ బ్రయత్నింపలేదు. రక్షింపు మని తల్లిదగ్గిఱకైనఁ బోవలేదు. శరీర మొక్కింతయుఁ గందలేదు. ముఖము వాడలేదు. దైత్యభటు లాతని నేనుఁగులచేఁ ద్రొక్కించిరి. సర్పములచేఁ గఱపించిరి. అగ్నిలోఁ ద్రోసిరి. దానవేంద్రుఁ డిదియంతయుఁ జూచి తనచిత్తమున "అక్కటా! ఈతనివిషయమై చేసినమారణోపాయము లన్నియు వ్యర్థము

లైవి. ఈతనిని రక్షించువా రెవ్వరును గనుపింపరు. ఈతఁడు మహామహిమ గలవాఁడు గఁ గన్పట్టుచున్నాఁడు. వీనితో వైరము నాకు మరణమునకుఁ గారణ" మని తలంచుచుండెను. అప్పుడు శుక్రాచార్యునిపుత్రులు వచ్చి "రాజేంద్రా ! నీవు విచారింపవలదు. శుక్రాచార్యులు నేఁడో రేపో వచ్చును. ఆయన యీకుమారుని నీతికుశలునిఁగా జేయును. ఇంతలో మే మీతనికి గృహస్థధర్మములు బోధింతు" మని చెప్పి ప్రహ్లాదునిఁ బిలుచుకొనిపోయిరి.

---

—: శ్రీహరినరసింహరూపమున హిరణ్యకశిపుని వధించుట. :—

:o:

గురుపుత్రులు ప్రహ్లాదునకు గృహస్థధర్మముల బోధింప సాగిరి. కామమోహములకుఁ జిక్కక హరిం గొల్చువారి కట్టివి తగ వని ప్రహ్లాదుఁడు తలఁచెను. ఇదియుం గాక విద్యార్థుల నెల్లరకును నాతఁడు హరిభక్తిం గూర్చి బోధించి వారిని హరిభక్తులుగాఁ జేసెను. విద్యార్థులు తమతమపుస్తకములఁ బాఱవైచి ప్రహ్లాదునితో హరిని గీర్తించుచుండిరి. ఇఁక దమబోధ పనిసేయ దని తలఁచి గురుపుత్రులు ప్రహ్లాదుని దండ్రికడకుఁ దోడ్కొనిపోయి "దానవేంద్రా ! నీకు మారున కిఁక మే మేమియుఁ జెప్పఁజాలము. ఈతఁడు తోడి విద్యార్థులను గూడ హరిభక్తులుగాఁ జేసినాఁడు," అని పలికిరి. ఆమాటలకు హిరణ్యకశిపుండు ప్రళయరుద్రునిలీల మండిపడి

కుమారున కిట్లు పలికెను. "ఓరీ! దేవత లందఱును నాకు భయమందు చుందురు. అట్టిచో నీవు నాయాజ్ఞ దాఁటుట కెట్లు సాహసించితివి? గురుబోధ వినక, తోడిబాలురకుఁగూడ హరిభక్తి నుపదేశించి, మనవంశాచారము నేలఁ గల్పితివి. ఇఁక నిన్ను వధించి దైత్యధర్మము గాపాడెదఁగాక! నేను దిక్కులన్నియు గెలిచితిని. నీకు దిక్కెవ్వఁడు? నీవెవ్వనిబలము నమ్మి నాయాజ్ఞ నుల్లఘించుచుంటివి?" అని పలికినతండ్రివాక్యములకుఁ గొడుకు వినయముతో నిట్లు బదులుచెప్పెను. "బలవంతులకును, బలహీనులకును, బ్రహ్మాదులకును, సమస్తప్రాణులకును నెవ్వఁడు బలమో, యట్టిమహాత్ముఁడే నాకును బలము. దిక్కు గలవారికిని, దిక్కు లేనివారికి నెవ్వఁడు దిక్కోయాతఁడే నాకును దిక్కగును. తండ్రీ! నీవు భువనముల నన్నిటిని జయించితివి గాని, యింద్రియముల జయింపఁజాలవైతివి. నిన్నుఁ గట్టివేసెడు నీయాఱ్వురుశత్రువులను జయించితివేని నీకు లోకములో శత్రువే యుండఁడు. నీవు ధర్మమును బాలింపుము. సంసారముఁ జాలింపుము. హరిపై భక్తి గీలింపుము." అని చావునకుఁ గూడ వెనుదీయక పలుకుచున్నకొడుకుమాటలకు రాక్షసేంద్రుఁ డద్భుతము నాగ్రహము నంది "ఓరీ! నీవు నాకెదురాడుచుంటివి? నాకంటె నీజగమునకుఁ గర్త యెవ్వఁడును లేఁడు. నీ వేమో హరిని గీర్తించుచుంటివి. నాతమ్ముని జంపిన యాతనికై నేను బ్రపంచమంతయు వెదకితిని. ఎందును గానరాఁడు. వాఁ డెక్కడ నేక్రియ నుండును? తెలుపుము.

నిన్నును వానిని గూడ నంత మొందించెద" నని భీకరముగ నుడి
వెను. ప్రహ్లాదుం డి ట్లనెను.

"మ. కలఁ డంభోధిఁ గలండు గాలిఁ గలఁ డా ♦ కాశంబునం [గుంభినిం
గలఁ డగ్నిం దిశలం బగళ్ల నిశలన్ ♦ ఖద్యోతచంద్రాత్మలం
గలఁ డోంకారమునం ద్రిమూర్తులఁ ద్రిలిం ♦ గవ్యక్తులం [దంతటం
గలఁ డీశుండు గలండు తండ్రి వెదకం ♦ గా నేల నీయాయెడన్.

క. ఇందు, గలఁ డందు లేఁ డని
సందేహము వలదు చక్రి ♦ సర్వోపగతుం
డెందెందు వెదకిచూచిన
నందందే కలఁడు దాన ♦ వాగ్రణి వింటే."

ప్రహ్లాదుఁడు తండ్రితోనిట్లు పలుకునవసరమున దీనసంరక్షణ పరాయణుఁ డగునారాయణుఁడు నరసింహరూపమును ధరించి యుండెను. శ్రీహరి ప్రతిచోట నున్నాఁ డని ప్రహ్లాదుఁ డన్నమాటలు విని రోషించి హిరణ్యకశిపుఁ డాతనిఁ గాంచి" "ఓరీ! నీవీసభాస్థలమునం గలస్తంభమున హరిని జూపఁ గలవా!" యని పలికెను. అందులకుఁ బ్రహ్లాదుఁడు "తండ్రీ! జగంబంతట నిండియుండు పరమాత్ముఁ డీస్తంభమునమాత్ర మేలయుండఁడు? నీవు సంశయింపఁ బని లేదు. నీ వాతని నిందు దర్శింపఁగలవు" అని భయరహితుఁడై పలికెను. అంతట

దానవేంద్రుఁడు "నీ వీవరమును భద్రముగాఁ గాపాడు కొమ్మని చెప్పిన మాటలను లక్ష్యముసేయక హస్తమున నున్న ఖడ్గము జళిపించుచు "హరి నిందుఁజూపు" మని సభాస్తంభ మును నఱచేతితోఁ గట్టిగాఁ గొట్టెను. వెంటనే శ్రీహరి హిరణ్యకశిపునకు బ్రహ్మ యిచ్చినవరమునకుఁ బ్రతిఘటనముగా నరసింహరూపమున స్తంభమునుండి యీవలకు వచ్చి, కేవలము నరరూపంబును, మృగరూపంబు గాని నరసింహరూపమున, రాత్రియును బవలును గాని సంధ్యాసమయమున, భూమియు గగనముగాని యూరుభాగమున, నస్త్రశస్త్రములు గాని నఖంబుల, జగత్కంటకుం డైనయాహిరణ్యకశిపు నుదరంబును ఛేదించి, తద్రక్తమును గంధముగాఁ బూసికొని, ప్రేవులు కంఠమాలికలుగా ధరించి, భయంకరమూర్తి యై యొప్పెను. దానవేంద్రునిమృతికి సంతోషించి బ్రహ్మాదిదేవత లచ్చటికి వచ్చిరి. కాని యెవ్వరును నరసింహదేవుని సమీపింపఁ జాల రైరి. ప్రహ్లాదుఁడే యాదేవుని పాదములకు నమస్కరించి బహు విధంబుల స్తుతించెను. శ్రీహరి ప్రహ్లాదునియెడలఁ బ్రసన్నుఁడై వరము లిచ్చి యంతర్థానుఁ డయ్యెను.

## 13. [గజేంద్రమోక్షము.]

:0:

త్రికూటంబను బర్వత ముండెను. ఆపర్వతమునుండి సెలయేటిమొత్తములు ప్రవహించుచుఁ జూపఱకుఁ గనుల పండువ యొనర్చుచుండును. ఆపర్వతమున కనతిదూరమున

నొకమహారణ్యము గలదు. ఆయరణ్యమునుండి యొకనాఁడు కొన్ని యేనుఁగులు జలక్రీడార్థమై బయలుదేఱి మార్గమధ్యమున వివిధక్రీడల వినోదించుచుఁ బోవుచుండెను. ఆగజముల నాథుఁడుమాత్ర మెట్లో మార్గము దప్పి, పిపాసాపీడితుఁడై పోయిపోయి యగాధసలిలపూరం బగునొక్క కాసారంబును గాంచి యందుఁ బ్రవేశించి, కడుపార జలంబుల గ్రోలి, పిదపఁ దొండమున జలమును బూరించి, దేహముపైఁ జల్లుకొనుచు జలక్రీడఁ దేలుచుండెను. అప్పుడు నీటియం దున్న భయంకరగ్రాహ మొకటి యాకరిని బట్టుకొనెను. నీరాటమునకు వనాటమునకును పెక్కునాళ్లు పోరాట మయ్యెను. ఎంత పోరాడినను గజంబు మకరినుండి తప్పించుకొని యావలఁ బడజాలక యుండెను. మకరిబలము హెచ్చుచుండెను. కరిబలము తగ్గుచుండెను. గజము తనకు గ్రాహమువలన మృత్యువు తప్పదని నిశ్చయించి పరమాత్మం డగుహరిని మనంబునందుఁ జేర్చి యిట్లు చింతించెను.

“ నే నేవిధమున నీజలగ్రాహంబును గెలుతును ? ఎవ్వరిని శరణంబు వేఁడుదును ? నామొర నెవ్వ రాలించి రక్షింతురు ?

“ఉ. ఎవ్వనిచే జనించు జగ • మెవ్వనిలోపలనుండు లీనమై
యెవ్వనియందు డిందుఁ బర • మేశ్వరుఁ డెవ్వఁడు మూల
[కారణం

బెవ్వఁ డనాదిమధ్యలయుఁ • డెవ్వఁడు సర్వము దానయైనవాఁ
డెవ్వఁడు వాని నాత్మభవు • నీశ్వరు నే శరణంబు వేఁడెదన్."

సర్వలోకములును, లోకస్థులును నశించి యలోకమైనను ప్రళయసమయమున నేకాకృతి నెవ్వఁడు వెలుంగునో యట్టి మహిమాస్పదుని శరణుఁ బొందెదను. దేవతలును తాపసులును దనమహిమఁ గనుఁగొనఁజాల కుండుటకై యనేకరూపంబులతో నెవ్వఁడు వర్తించునో యట్టిలోకకర్త నాశ్రయింతును. ముక్తసంగు లగువారి కెవ్వఁడు దిక్కో, యామహాత్ముఁడు నాకును దిక్కగుఁగాక! బ్రహ్మాదిదేవతల కాయాయధికారము లిచ్చి, జగం బెవ్వఁడు మనుపునో వానిని భజింతును.

"క. కలఁ డందురు దీనులయెడఁ
గలఁ డందురు పరమయోగి • గణములపాలం
గలఁ డందు రన్నిదిశలను
గలఁడు కలం డనెడివాఁడు • కలఁడో లేఁడో."

అని యీవిధంబునఁ జింతించి, మరలఁ బరమేశ్వరు నుద్దేశించి

"శా. లా వొక్కింతయు లేదు ధైర్యము విలో • లం బయ్యెఁ
[బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చెఁ దనువున్ • డస్సెన్ శ్రమం
[బయ్యెడిన్
నీవే తప్ప నితఃపరం బెఱుఁగ మ • న్నింపందగున్ దీనునిన్
రావే యీశ్వర! కావవే వరద! సం • రక్షించు భద్రాత్మకా."

ఓ దేవదేవా ! పురుషోత్తమా ! జలగ్రహముచేఁ జిక్కిన నా ప్రాణములు పోవుచున్నవి. ఇఁక నేను దీనితోఁ గలహింపఁ జాల. యోగిజనవంద్యా! నన్ను రక్షింపుము. నీవు తప్ప నాకెవ్వరును దిక్కు లేరు.” అని వేఁడికొనెను.

గజేంద్రుని ప్రార్థన వైకుంఠములో మందిరమునందు రమాదేవితో వినోదసంభాషణంబున నున్న శ్రీమన్నారాయణుఁ డాలించెను. వెంటనే ఆపరమాత్ముఁడు గజేంద్ర ప్రాణ సంరక్షణంబునకుఁ దొందర గలవాఁడై, లక్ష్మీదేవికైనఁ దెలుపక, చక్రమునైన ధరింపక, పరివారమునైన రమ్మనక, గరుడునైనఁ బిలువక బయలుదేఱెను. ఆతనివెంట గరుడుఁడును, లక్ష్మియుఁ బోయిరి. లక్ష్మీదేవి తననాథుఁ డెచ్చటికిఁ బోవుచున్నాఁడో తెలియక “అనాథాలాపము లేవైన జెవులఁ బడెనా! వేదంబుల నేరక్కసుఁడైన ముచ్చిలించెనా! అమర లోకముమీఁది కేదానవుఁడైన దండెత్తెనా? భగవంతుఁ డగు హరిం జూపుమని సాధువుల నేదుర్జనుఁడైన బాధించు చుండెనా” యని పరిపరివిధముల నాలోచించుచుఁ బోయెను.

శ్రీహరి యాకాశమార్గమునఁ బోవునప్పుడు దేవతలు కొంద ఱెదురై నమస్కరించినను, కరిసంరక్షణోద్యోగము వహించి తొందరగాఁ బోవుచున్న యాతఁడు వారి ప్రణామంబులు గూడఁ గైకొనలేదు. ఆతఁడు తిన్నగాఁ బోయి కరీంద్రుఁ డున్నసరసిం జేరి చక్రమును దలంచిన యంతనే యదివచ్చి యాతనిహస్తము నలంకరించెను. అంతట నాతఁడు మకరిపై

నాచక్రమును బ్రయోగింప, నయ్యది కాసారంబునుజొచ్చి యామకరిం ద్రుంచెను. పిదపఁ గరుణాసాగరుఁడై నరమా కళత్రుఁడు గజంబును జలంబు వెలుపలఁదిగిచి, తనహస్తములచే స్పృశించెను. పుండరీకాక్షునికరసంస్పర్శవలన గజేంద్రుఁడు తాపము వాసి సంతోషముతో ఘీంకారముం జేసెను.

## 14. [కూర్మావతారము.]

యుద్ధములో దేవతలు దానవుల కోడి తేజోహీనులై తమయునికిపట్టుల విడిచి యందందుఁ దిరుగసాగిరి. వారొక నాఁడు చతుర్ముఖునిసన్నిధికిఁ బోయి తమ్ముద్ధరింపు మని ప్రార్థించిరి. బ్రహ్మ వారిని వెంటఁబెట్టుకొని శ్రీహరిపాలి కేగి యామహాత్మునకు వారిదుస్థితి విన్నవించెను. శ్రీహరి దేవతలయెడలఁ గృపాంతరంగుఁడై యిట్లు పలికెను. "బృందా రకులారా! తనకుఁ గాలము కానప్పుడు సర్పము మూష కమున కొదిఁగి యుండునట్లు దనకు సత్త్వము కలుగువఱకును విరోధి కడంగి యుండవలయును. మీ రిఁక నమృతోత్పాదన ప్రయత్నమునకుఁ బూనుకొనుఁడు. అమృతపానముం జేసినచో మీరు మరణవర్జితదేహు లగుదురు. క్షీరసాగరమున సర్వ తృణలతౌషధములు వైచి, మందరశైలమును మంథానముగ

నోసర్చి, వాసుకిని దరిత్రాడుగఁ గావించి నాసహాయమున మీరు తరువుఁడు. మీరు విజయమును గాంతురు. పాపమతు లగుటచే రాక్షసులు దుఃఖమును బొందుదురు."

శ్రీహరివాక్యములకు సంతోషించి యమరులు తమ నెలవుల కేగిరి. పిదప దేవేంద్రుఁడు, దైత్యచక్రవర్తి యైన బలిం జేరి విరోధము లేనివానివలె నాతనిని సేవింపఁ గడఁగెను. దేవేంద్రుని భక్తి వినయములు చూచి, బలిచక్రవర్తి యాతని కేమియు హానిసేయవల దని తనవారి కెఱింగించెను. ఇట్లనేకదినములు గడచెను. ఒకదినంబున నమరేంద్రుఁడు దానవులెల్లరును వినుచుండ బలిని జూచి "మీరును మేమును నన్నదమ్ములము. మనలో మనకు విరోధమేల ? ఇంతవఱకును మనకు జరిగిన యుద్ధములు చాలును. ఇఁక మాకును దైత్యు లకును నీవు విభుఁడవు. మన మన్యోన్యానురాగమున వర్తించు చుంటిమేని శుభంబులఁ బడయఁగలము," అని వచించి యమృతమథనంబును గూర్చి తెలియఁజేసెను. మహేంద్రుని వాక్యములకు దానవు లందఱును సమ్మతించి యమృత ప్రయత్నము సేయనెంచిరి. తరువాత దేవదానవులు మందర నగరంబును జేరి, దాని నతికష్టముమీదఁ బెల్లగించి, శిరము లపైఁ బెట్టుకొని క్షీరసముద్రమునకుఁ బోవుచుండిరి. పర్వత భార మధిక మగుటచే మార్గమధ్యమున వారిలోఁ బెక్కండ్రు మడిసిరి. దేవతలు చింతించుచుండ నదృశ్యరూపమున నచ్చటనే యున్న శ్రీహరి యాపర్వతమును బంతివలె నెత్తి,

దానిని క్షీరసాగరమునకుఁ జేర్చుమని గరుడున కాజ్ఞాపించెను. గరుడుఁ డట్లొనర్చెను.

పిదప దేవదానవులు వాసుకిని రావించి, ఫలభాగ మిచ్చునట్లు సమ్మతింపఁజేసి మందరాచలంబును సాగరంబునఁ బడవేసి, వాసుకిని దానికిఁ జుట్టి, తఱచుటకుఁ బ్రారంభించిరి. మొదలఁ గుదురు గలుగక పోవుటచే నాకొండను ధరింపఁజాలక దేవదానవు లనేకులు నీటఁబడిరి. గిరి సముద్రమునఁ బడ నుండెను. అప్పుడు శ్రీహరి దేవతల ననుగ్రహింపఁదలఁచి యొకమహాకూర్మమై జలరాశిం జొచ్చి, యానగము నీటఁ బడకుండఁ దన వీఁపుపై నెత్తి నిలిపెను. సురాసురులు సంతోషించి మరలఁ ద్రచ్చుటకుఁ బ్రారంభించిరి. అట్లు తఱచుసమయమున హాలాహలము జనించెను. ఆవిషము శతకోటి మార్తాండతేజమున నొప్పుచు, నెవ్వరికిని జూడ నశక్యమై నలు దెసల నావరించి, మహాభయంకరమై యుండెను. దేవత లచ్చట నిలువఁజాలక రక్షింపు మని శంభునికడకుఁ బోయి వేఁడుకొనిరి. అంతటఁ బరమేశ్వరుఁడు దేవతల రక్షింపఁ దలఁచి క్షీరసాగరముకడకు వచ్చి, భయంకరమైనయాహాలాహలము తనమహిమచేఁ జేత నమర్చి, జంబూఫలము క్రింద నాహరించెను. అమ్మహానుభావుఁ డావిషమును దనకంఠబిలమున నిలిపి బ్రహ్మేంద్రాదుల వినుతిఁబొందెను. దేవదానవులు మరలఁ ద్రచ్చునవసరమున గామధేనువు జనించెను. దానిని దేవమునులు గైకొనిరి. తరువాత నుచ్చైశ్శ్రవ మనుహయము

మును, నైరావత మనుగజమును, కల్పవృక్షమును గలిగెను. చంద్రుఁడుదయించి, బ్రహ్మయాజ్ఞ ననుసరించి నిజస్థానమున కేగెను. లక్ష్మి యుదయించి విష్ణుని జేపట్టెను. తుదకు నిఖిల వైద్యశాస్త్రనిపుణుఁ డగు ధన్వంతరి యమృతకలశహస్తుఁ డై వెడలి వచ్చెను. ఆయమృతకుంభమును జూచి చావులేని మందు మన కబ్బె నని దైత్యు లాధన్వంతరిహస్తములనుండి లాగుకొనిరి. దేవతలు తెల్లపోయి చూచుచుండిరి. దానవులలోఁ గొందఱు దేవతలుగూడ మనతోపా టమృతము ననుభవింప వలెను అని పలుకుచుండిరి. అట్టిసమయమున దేవతలకు శుభంబులఁ గూర్ప శ్రీమన్నారాయణుఁడు మోహినీరూపమున సురాసురుల మధ్యమున నిలిచెను. జగన్మోహనమైన కపట మోహినీస్వరూపమును జూచి దానవులు విభ్రాంతులై సమీపించి "ఓస్త్రీరత్నమా! మే మందఱమును గశ్యపుని సంతతివారము. మేము సభదీర్చి యాసీనులమై యుందుము. ఈయమృతమును నీవు పక్షపాతములేకుండ మా కందఱకును బంచుము," అని పలికిరి.

ఎట్లయిన దానవుల వంచింపఁ దలఁచి మోహినీ రూపము గొన్న శ్రీహరిదానవులను దరహాసగవులచేతను, మృదుమధురవాక్యములచేతను, వాలుఁజూపులచేతను భ్రమింపఁజేయుచు, నిరుతెగలవారిని పంక్తులుగాఁ గూర్చుండఁజేసెను. దైత్యులను, ముసిముసినగవులచేతను, బావా-మఱఁదీ యని వావులు గల్పించి పిలుచుటచేతను, దేహములు మఱపించి

నెమ్మదిగా నమృత మంతియు దేవతలను ద్రాగఁజేసెను. ఆసమయమున రాహు వనుదైత్యుఁడు దేవతలలోఁ జేరి యమృతముఁ ద్రాగుచుండ సూర్యచంద్రులు నారాయణునకు సన్న సేయ నాతఁడు రాహువుశిరమును జక్రముచేఁ ద్రుంచెను. కాని యాతనిశిరము మాత్రము సుధాసిక్తమై యమరత్వ మందెను. బ్రహ్మ రాహుశిరమును గ్రహముగఁ జేసి యంబరంబున నిలిపెను. ఈకారణముచేతనే రాహువు పర్వములయందు సూర్యచంద్రులను బట్టుచుండును. ఈవిధమున శ్రీహరి యమృతమంతియు బృందారకుల కిచ్చి యదృశ్యుఁ డయ్యెను.

దైత్యు లీమోసమును గ్రహించి యమరులతో సమరమునకుఁ గడంగిరి. హరికరుణవలన బృందారకులకు విజయము కలిగెను. యుద్ధమున మృతినందిన దానవులను శుక్రాచార్యుఁడు మృతసంజీవనివిద్యామహిమంబున బ్రదికించి, యసురుల కిది మంచికాలము కాదని నుడివెను. అంతట బలిచక్రవర్తి శుక్రాచార్యునివాక్యముల ననుసరించి దైత్యులఁ దోడ్కొని పశ్చిమగిరిఁ జేరెను,

## 15. [వామనచరిత్రము.]

—:o:—

దేవదానవయుద్ధమున నోడినదానవు లెల్లరును దమ యేలిక యగుబలితోఁ బశ్చిమశిఖరిఁ జేరిరికదా! దైత్యాచార్యుఁ డగుశుక్రుఁడు బలిచక్రవర్తిచే విశ్వజిత్తను పేరుగల

యొకగొప్పయాగమును జేయించెను. ఆయాగ మొనర్చుటచే బలికి సువర్ణరథమును, మార్తాండునిహయంబులఁ బోలు హయంబులును, సింహధ్వజమును, గవచమును నగ్నిహోత్రుఁ డొసంగెను. శుక్రుఁడు శంఖ మిచ్చెను. ఇట్టి వన్నియు లభించుటచేత నాబలి దైత్యేంద్రుఁడు మిగులఁ బరాక్రమ వంతుఁ డై చతుర్దశభువనభయంకరుఁ డై యుండెను.

ఈవిధమున నమితపరాక్రమంబున దర్పించి యున్న యాబలి, దేవేంద్రుని సాధింపనెంచి చతురంగబలములతోఁ బోయి దేవతారాజధానిని ముట్టడించెను. ఆసమయమున మహేంద్రుఁడు దేవగురుఁ డైనబృహస్పతిని రావించి "గురు వర్యా! బలిదానవుఁ డిప్పుడు మనపై దాడివెడలి వచ్చినాఁడు. వీని కిట్టిబల మిప్పు డెట్లు గలిగినది? వీని నెట్లు మనము జయింపఁగల" మని పలికెను. బృహస్పతి యందులకు "శచీనాథా! శుక్రాచార్యుఁడు చేయించిన యాగమువలన వీని కింత బలము సేకుఱినది. ఈతనినెదిరించుటకు శ్రీహరి తప్ప నితరులు శక్తులు గారు. ఈసమయములో మన మమ రావతిని విడిచి పోవుట మంచిది. శుభదినములు వచ్చినప్పుడు మరల రావచ్చు"నని చెప్పెను. బృహస్పతి వాక్యము లాలించి దేవేంద్రుఁ డమరులతో దేవలోకము విడిచి చనెను.

బలి నాకలోకమును వశము చేసికొనియెను. శుక్రుఁ డతనిచే శతాశ్వమేధములు చేయించెను. దానవుఁ డైనను బలిరాజ్యపాలనము ధర్మము ననుసరించి యుండెను. అతఁడు

దేవబ్రాహ్మణభక్తి, ధర్మాసక్తి, గురుజనానురక్తి గలిగి యుండెను. అతని పరిపాలనమున దరిద్రులు లేరు. పాడిపంటలు సమృద్ధిగా నుండెను.

బలివైభవ మంతయుఁ గాంచి యింద్రునితల్లి యగు నదితి, తనకుమారుఁ డగునింద్రుఁడు రాజ్యము గోలుపోయినందు లకు విచారించి, భర్త యగు కశ్యపునిపాలి కరిగి తన పరితాపముఁ దెలిపి రక్షింపు మనివేఁడెను. కశ్యపుఁ డామెం గాంచి "ఇది యంతయు శ్రీహరి మాయ. నీవు శ్రీమన్నారాయణుని సేవింపుము. శుభములఁ బడయఁగలవు." అని చెప్పి శ్రీహరినిఁ బూజించు క్రమముం దెలిపెను. అదితి శ్రీహరిని నిష్ఠతో సేవించెను. ఆమహానుభావుఁ డామెకుఁ బ్రసన్నుఁడై "సాధ్వీమణీ! నేను మాయోపాయమున బలి దర్ప మడఁచి యింద్రునకు రాజ్య మిచ్చెదను. అందులకై నేను నీకు సుతుఁడనయ్యెద" నని పలికి యంతర్ధానుఁ డయ్యెను.

అదితి కశ్యపుని సేవించుచుండెను. కొన్నాళ్ల కామె గర్భము ధరించి కాలక్రమమున నొకశుభదినంబున హరిని బుత్రునిగాఁ గాంచెను. హరితనరూపమును మఱుగుపఱిచి కపటవటుఁడై యుండెను. ఈతఁడే వామనుఁడు. కశ్యపుఁ డాతని కుపనయనము గావించెను. కశ్యపుఁడు వామనున కుపనయనము గావించెను. వామనునకు బృహస్పతి జన్నిదమును, కశ్యపుఁడు ముంజియు, దితి కౌపీనము, భూదేవి కృష్ణాజినము, సోముఁడు దండమును, సరస్వతి యక్షమాలికయు, సప్త

ఋషులు కుశపవిత్రములు ను నర్పించిరి. కుబేరుఁడు భిక్షా పాత్ర మొసఁగెను. అందుఁ బార్వతి "అక్షయ" మని తొలి భిక్షఁ బెట్టెను.

దానము సేయుటయందు బలిచక్రవర్తిని జెప్పి మఱి యొకరిని జెప్పవలయును. అర్థు లేదికోరిన నది యిచ్చును. వామనుఁడు బలివదాన్యతం గూర్చి విని, యతనిం గాంచుటకు బయలుదేఱెను. అప్పుడా బలి నర్మదానదీతీరమున నొకగొప్ప యాగముఁ జేయుచుండెను. వామనుఁడు తిన్నగా నాప్రదేశమున కరిగి యాయాగవాటికం బ్రవేశించెను. ఆప్రదేశ మనేకమునిపుంగవులతోడను, వేదపారాయణు లగుబ్రాహ్మణోత్తముల తోడను, మంత్రవేత్తలతోడను నిండి యుండెను. సభ్యులు వామనుని జూని వేదము లీరూపము నందె నని తలంచిరి. వామనుఁడు నెమ్మదిగా బలిని సమీపించి,

"ఉ. స్వస్తి జగత్త్రయీభువన ♦ శాసనకర్తకు హాసమాత్రవి
ధ్వస్తనిలింప భర్తకు ను ♦ దారపదవ్యవహర్తకుం మునీం
ద్రస్తుతమంగళాధ్వరవి ♦ ధానవిహర్తకు నిర్జరీగళ
న్యస్తసువర్ణసూత్రపరి ♦ హర్తకు దానవలోకభర్తకుం."

అని దీవించి యాతని శిరముపై నక్షతలు చల్లెను. బలి సింహాసనమును దిగి, వామనుని చరణంబులకు నమస్కరించి, యాచరణంబులఁ గడిగి, జలంబును శిరంబుపైఁ జల్లుకొని సుఖాసీనుం జేసి కులగోత్రనామము లడిగి యిట్లు పలికెను. "భూసు

రోత్తమా! నీవు వచ్చుటంజేసి నేను కృతార్థుఁడ నైతిని. మఖముగూడఁ బావనం బయ్యెను. నీ కేమి కావలయును. వస్త్రములా! రూకలా! ఫలములా! గోవులా! కరులా! భూషణములా! భూములా!"

బలివాక్యములకు వామనుఁడు సంతసించి యిట్లు పలికెను. "దానవేంద్రా! నాకు నివాస మనునది యొకటి లేదు. సర్వప్రదేశములయందు నిండి యుందును. నే నెవ్వరివాఁడను గాను. అందఱును నావారే! లోకములో నేను నేర్వని దేదియు లేదు. నీవు మహాదాత వని నిన్నుఁ జూచుటకు వచ్చితిని. బ్రాహ్మణు లందఱివలె నిన్ను నిరంతరము యాచించుటకు వచ్చువాఁడఁ గాను. నే నొంటివాఁడను. కావున నాకు మూఁడడుగులనేల యిచ్చినఁ జాలును."

వామనునివాక్యములకు బలి నవ్వి "ఓయీ వెఱ్ఱి బ్రాహ్మణుఁడా! ఈస్వల్పమునకేనా నన్ను యాచింప వచ్చితివి. యాచన యనఁగా నేమో తెలియనివానివలె నుంటివి. మ ఱేమయినఁ గోరు" మనియెను. మూఁడడుగులనేల తప్ప మ ఱెద్దియు వల దనీ వామనుఁడు బదులు చెప్పెను. వామనుఁడు కోరినదాన మిచ్చుటకు బలి సంసిద్ధుఁ డయ్యెను. అప్పుడు శుక్రాచార్యుఁడు బలికి రహస్యముగా నిట్లు పలికెను. "ఓదానవలోకచక్రవర్తీ! ఈతఁడు నిజమయిన భూసురుఁడు గాఁడు. దేవతలకు మేలుఁ గూర్పఁదలఁచి వచ్చిన శ్రీమన్నారాయణుఁడు. నిన్ను వంచించి నీభాగ్య మింద్రున కీయఁదలఁచి

నాఁడు. మహాకాయుఁడై మూఁడడుగులలో జగం బెల్ల నాక్రమించును. ఒకపాదమున భూమియు, నొకపాదమున నాకాశమును నాక్రమించె నేని నీ వెచ్చటికి వెడలఁగలవు? "వివాహములందును, ప్రాణవిత్తమానభంగము లందును నబద్ధ మాడినఁ బాపము లేదు. కావున నీదానము మానుము." బలిచక్రవర్తి శుక్రునివాక్యములకు సమ్మతింపలేదు. అతఁడు శుక్రునిగాంచి యిట్లనెను. "ఆచార్యా! ఇచ్చెద నని పలికి మరల లే దని పలుకుట కంటెఁ బాపము మఱియొకటి లేదు.

"శా. కారే రాజులు రాజ్యముల్ గలుగ వే ♦ గర్వోన్నతిం [బొందరే
వా రేరీ సిరిమూటఁగట్టికొని పో ♦ వం జాలిరే భూమిపైఁ
బేరైనం గలదే శిబిప్రముఖులుం ♦ బ్రీతిన్ యశఃకాములై
యీరే కోర్కులు వారలన్ మఱచిరే ♦ యిక్కాలమున్ భార్గవా."

క్రతువులఁ గాని వ్రతములఁ గాని చిక్కనిమహాత్ముఁడు నన్ను దాన మడిగినప్పు డీయ నని చెప్పఁగలనా?

"శా. ఆదిన్ శ్రీసతికొప్పుపైఁ దనువుపై ♦ నంసోత్తరీయంబుపైఁ
బాదాబ్జంబులపైఁ గపోలతటిపై ♦ బాలిండ్లపై నూత్నమ
ర్యాదం జెందుకరంబు గ్రిందగుట మీఁ ♦ దై నాకరం బుంట
మేల్గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే ♦ కాయంబు [నాపాయమే."

ఈతఁడు శ్రీహరియే యగుఁగాక! అడిగిన దిచ్చుచున్న ప్పుడు న న్నేలబంధించును? బంధించుఁగాక! ఆతఁడే కరుణించి విడచును! విడువఁడా పోనిమ్ము. అసత్యమునకు మాత్రము నాచిత్తము సమ్మతింపదు."

ఇట్లు చెప్పి యాబలిచక్రవర్తి వామనునకు దాన మీయఁదలఁచి తనభార్యను హేమకలశముతోఁ జలముఁ దెమ్మని చెప్పెను. పిదప నాతఁడు వామనుని జూచి "బ్రాహ్మ ణోత్తమా? నీవాంఛితముఁ దీర్చుచున్నాను. నీపాదము లిటు దెమ్ము. కడిగెద" నని పలికి, యామాయామాణవకునిపాద ములు కడిగి,

"శా. విప్రాయ ప్రకటవ్రతాయ భవతే♦విష్ణుస్వరూపాయ, వే
దప్రామాణ్యవిధే త్రిపాదధరణిం ♦ దాస్యామి యంచుం [క్రియా
శ్రీప్రౌఢిన్ దనుజేశ్వరుండు వడుగుం♦జేసాఁచి పూజించి, బ్ర
హ్మప్రీతం బని ధారవోసె భువనం ♦ బాశ్చర్యముం [బొందఁగన్."

ఇట్లు మూఁడడుగులభూమిని దానముగా గ్రహించి వటుఁడు విశ్వరూపము ధరించి, యొకపాదమున భూతలమును, వేఱొక పాదమున స్వర్లోకమును నాక్రమించి, బలిం గాంచి "దాన వేంద్రా! నేను రెండడుగులే గైకొంటిని. మూఁడవయడుగునకుఁ బ్రదేశము గానిపింపదయ్యెను. నీ విచ్చెద నని చెప్పితివి.

మూఁడవయడుగుఁ జూపు" మని పలికెను. బలి "దేవా! నే నసత్య మాడను. నీమూఁడవపాదము నాశిరమున మోపుము. నీవు శ్రీహరి వని తెలియుదు. నన్నీదానముం గోరుట నాపుణ్యఫల మని తలంచెద" నని భక్తిపూర్వముగఁ జెప్పెను. అంతట హరి యాబలిశిరముపైఁ బాద మిడి, కరుణించి యాతనిని సుతలంబున నుండు మని చెప్పి పంపించెను. వామనుఁ డీవిధమున దేవతాసామ్రాజ్యము మరల నింద్రున కొసంగెను.

---

## 16. [మత్స్యావతారము.]

—:o:—

మున్ను కల్పాంతమున ద్రవిళదేశాధీశుఁ డైనసత్యవ్రతుఁడు కృతమాలికానదీ తీరమున శ్రీమన్నారాయణుం గూర్చి జలపానమ మాత్రము సేయుచుఁ దపం బొనర్చుచుండెను. ఆతఁ డొకదినంబున స్నానం బాచరించి హరికి జలతర్పణము సేయుచుండ నతనిదోసిట నొకచిన్నమీనము పడెను. ఆతఁడు దానిని మరల నదియందు విడువ నయ్యది రాజుతో నిట్లనెను. "భూపాలా! ఈనదియం దుష్టమత్స్యరాజములకు భయంబంది, నీమఱుఁగుఁ జొచ్చితిని. అట్టియెడల నన్నుఁ గరుణఁ జూనక మరలఁ నిందుఁ బడవేయ నీకు ధర్మమా! ఇదియుంగాక పల్లెవాం డ్రరుదెంచి వలల, బన్నునప్పుడు నే నెక్కడికిఁ బోవఁ

గలుగుదును. ఇందుంటినేని నన్నుఁ జాలరులు పట్టుకొనుటయో, లేక పెద్దచేపలు మ్రింగుటయో సంభవించును. కావున నన్ను రక్షింపుము."

ఆమాటలకు సత్యవ్రతుఁడు జాలివహించి దానిని నీరములనుండి తీసి తన కమండలువులోఁ బెట్టుకొని యాశ్రమమునకుఁ బోయెను. ఒకరాత్రిలో నామత్స్యడింభకము పెరిఁగి, కమండలువునం దుండుటకు నెలవు చాలక తన కుండు స్థలము చాలదని రాజునకుఁ జెప్పెను. అంతట రాజేంద్రుఁడు వేఱొక పెద్దకలశంబును దెచ్చి దాని నందుంచెను. ముహూర్తమాత్రములో నామత్స్యమాకలశము గూడఁ బట్టనిదై యొప్పెను. దానిని గలశమునుండి తీసి యొక చిన్నమడుంగున వైచెను. మడుగునకుఁగూడ నయ్యది పెద్దదై తన కందుఁ జరించుటకు వీలు లేదని పలికెను. నృపాలుఁడు మరల నొకపెద్దహ్రదంబున విడిచెను. హ్రదము గూడఁ జాలనట్టి శరీరము కలదయ్యెను. అప్పుడు సముద్రంబునఁ బడవైచెను. ఆమీనము రాజుంగాంచి "ధరణీపాలా! ఇంతవఱకు నన్నుఁ గాపాడి తుదకు సాగరంబునఁ బడవేసితివా! ఇందుండు మకరంబులు నన్నుఁ బ్రతుక నిచ్చునా?" యనెను. "మీనమా! మత్స్యముల కిట్టిశరీరముండునా? నిన్నుఁ జూచిన నాకు మిగుల నాశ్చర్యము గలుగుచున్నది. ఆపన్నులను రక్షించుట కిట్టి మత్స్యాకృతి వహించిన శ్రీమన్నారాయణుఁడవని నేను దలంచెద,"నని యనేకవిధంబుల రాజు స్తుతించెను.

మత్స్యాకృతి నున్న భగవంతుఁడు నిజభక్తుఁడైన సత్యవ్రతున కిట్లు పలికెను. "నేఁటి కేడవదినమునఁ జతుర్ముఖున కొక పగలు నిండును. జగంబు లన్నియు విలయాబ్ధిని మునుంగును. అప్పుడు నాపంపున నొకనావ చేరవచ్చును. దానిపై నోషధీతతులును, బీజరాసులు నిడి సప్తర్షులతో నీవు విహరింపఁగలవు. ఆనావ జలధితరంగములకు లోనుగాకుండ, దానిం బొడువవచ్చు గ్రాహంబుల నొడియుచు, నాకొమ్మునతుదిం బదిలముచేసి కాపాడెదను. దానంజేసి నీకును మునులకును నావంతయు భయం బుండదు. ఇందులకై నేను జలచరరూపంబు గైకొంటిని. నావలన నీవను గ్రహింపఁబడుదువు." అని చెప్పి హరి యదృశ్యుఁ డయ్యెను.

అనంతరము శ్రీమన్నారాయణుని వాక్యములఁ దలఁచి సత్యవ్రతుఁ డాతనిని స్మరించుచు దర్భశయనుఁడై చెప్పినసమయమునకై వేచియుండెను. అంతఁ గల్పాంతము డాయ, గొప్ప వర్షము గురియ నారంభించి జగము లన్నియు నంధకారమున ముంచివైచెను. సమస్తభూతములు ప్రళయజలధిం గూలెను. అంత సమ్మహారాత్రియందు విరించి యంతకమున్ను ప్రాణిచయమును నిర్మించి యలసియుండినవాఁ డగుటచే నేవిధమయిన సృష్టియు మాని, చేయి తలగడఁజేసికొని నిద్రింపఁ దొడంగెను. అట్లు నిద్రించుచున్న పరమేష్ఠిముఖమునుండి శ్రుతు లుద్భవమయ్యెను. ఆవేదములను హయగ్రీవుఁ డనురక్కసుఁడు తస్కరించి జలధిం జొచ్చెను. శ్రుతిచోరుఁ డగునారక్కసునిఁ గూల్ప హరి పాఠీనమై జలధిం జొచ్చి విహరింపఁదొడంగెను.

అంతకుమున్నే ప్రళయజలధి మహీమండలయంబును ముంచుచుండ హరి ప్రేరితమై యొకనావ వచ్చెను. గాంచి, దాని కొఱకు నిరీక్షించుచున్న సత్యవ్రతుఁడు దానిపై మునిసంఘముతో నెక్కి సముద్రమధ్యమున మత్స్యాకృతిని విహరించుచున్న దేవునిఁ బెక్కుభంగుల స్తుతించెను. శ్రీహరి సత్యవ్రతు నను గ్రహించెను. పిదప జలచరాకారుఁడగు నాతఁడు సముద్ర గర్భమును జొచ్చి హయగ్రీవుని వధించి వేదములఁ దెచ్చి, యప్పుడే మేల్కాంచి కన్నులు నలఁపుకొనుచు సృష్టికార్యమునకు యత్నించుచున్న యజున కిచ్చెను.

---

## 17 [అంబరీషోపాఖ్యానము.]

:o:

అంబరీషుం డనురాజేంద్రుఁడు భూతలంబును నిరంకుశముగఁ బరిపాలించుచుండెను. ఆతఁడు సద్గుణగరిష్ఠుఁడు. ధర్మమూర్తి. హరిభక్తుఁడు. శ్రీమన్నారాయణునిఁ గూర్చి సరస్వతీ నదీతీరమునఁ బెక్కుయాగములు గావించి యనేకభూసురులను భూరిదక్షిణలచే సంతృప్తిఁ జేసెను. అమ్మేదినీకాంతుఁడు తనచిత్త మంతయు శ్రీహరిపదాయత్తంబు గావించి, రాజ్యంబు సేయుచుండ, భగవంతుఁ డాతని నిర్మలభక్తికి మెచ్చి ప్రతిభట శిక్షణంబును, స్వజనరక్షణంబును నగుచక్రంబును బ్రసాదించెను.

ఈరాజునకు ద్వాదశీవ్రతము సేయునియమము గలదు. ఒకద్వాదశీదినంబున నారాయణుంబూజించి,యనేక భూసురులకు సంతృప్తిగ భోజనంబిడి, తాను పారణసేయఁ దలంచి యుండఁ, దపోవిలాసుం డగుదుర్వాసుం డాతనిమందిరమున కరుదెంచెను. అంబరీషుఁ డామునిచంద్రునిఁ బూజించి, తనయింట భుజింపు మని కోరెను. దుర్వాసుం డందులకు సమ్మతించి స్నానార్థము నది కేగి యెంతసేపటికిని రాకయుండెను. రాజును బ్రాహ్మణులును నిరీక్షించుచుండిరి. ఆలస్య మైనచో ద్వాదశీవ్రతమునకు భంగ మొదవును, గావున, నావిషయమై శాస్త్రజ్ఞు లయినధరామరపుంగవులతో యోజించి, వారియనుమతంబున జలపారణముఁ జేసెను.

అంతలో దుర్వాసుఁడు వచ్చి, యంబరీషుఁడు జలపారణముం జేసినసంగతి నెఱింగి ప్రళయరుద్రునిలీల మండిపడుచు, "రాజాధమా! నన్ను భుజించుటకు రమ్మని ప్రార్థించి, నేను రాకపూర్వమే భుజించి యిట్టియవమానముఁ గూర్తువా! మును లయెడ నపరాధము గావించునీవు విష్ణుభక్తుఁడవా! నేను గోపించినచో మాన్పువాఁ డెవ్వఁడు?" అనిపలికి తనజటం బెరికి రాజుపై వైచెను. అయ్యది శూలాయుధహస్త మైనమహాకృత్యయై యంబరీషుం డాసెను. విశ్వరూపుం డగుశ్రీహరి యీవిధం బెఱిఁగి యంబరీషుని రక్షించుటకుఁ దనచక్రమును బంపెను. అగ్నిజ్వాలలు గ్రక్కుచుఁ జక్ర మరుదెంచి దుర్వాసునిచేఁ బ్రయోగింపఁబడిన కృత్యను దహించి యంతటితో

నూరకుండక మునిపై కేగెను. దుర్వాసుడు ప్రాణభీతిచే బరు వెత్తదొడగెను. చక్ర మాతడెక్కడికి బోయిన నక్కడికి వెన్నంటుచుండెను.

శా. ఏలోకంబున కైన వెంటబడి తో ♦ నే తెంచు చక్రానల
జ్వాలల్ మానుపువారు లేమిజని దేవ ♦ జ్యేష్ఠు [లోకేశు వా
డాలోకించి, విధాత విశ్వజనన ♦ వ్యాపారపారీణ రే
ఖాలీలేక్షణ చూడవే కరుణ జ ♦ క్రంబు న్నివారింపవే."

అని బ్రహ్మను జేరి రక్షింపుమనియెను. ఆత డందులకు శక్తుడగా నని పలికెను. శివుని జేరి వేడెను. శివుడు గూడ "మునీంద్రా! ని న్నెవ్వరును రక్షింపజాలరు. ఆశ్రీమన్నారాయణునే వేడికొను." మని పలికెను. ఇక మునీంద్రుడు జేమియు జేయజాలక కమురయమున వైకుంఠమునకు బోయి హరిం జేరి పాదములపై బడి యిట్లు పలికెను.

"ఉ. నీమహిమార్ణవంబు తుది ♦ నిక్కముగా నెఱుగంగలేక నీ
ప్రేమకు వచ్చుదాసులకు ♦ గ్రించుతనంబున నెగ్గు [సేసితిన్
నామఱపున్ సహింపు మట ♦ నారకుడైన మనంబు (లో భవ
న్నామము చింతసేసిన న ♦ నంతసుఖస్థితి నొందకుండునే.

దేవా ! నీభక్తున కెగ్గుంజేసిన నాయపరాధము క్షమించి రక్షింపుము." అని ప్రార్థించిన, శ్రీహరి దుర్వాసుం గాంచి "బుద్ధిమంతు లగుసాధులు నాహృదయంబును దొంగిలింతురు నేను నిరంతరము భక్తుల రక్షించుచుందును. వారి కాపద గల్గినఁ జూడఁజాల.

"ఆ. తనువు మనువు విడిచి ♦ తనయులఁ జుట్టాల
నాలి విడిచి సంప ♦ దాలి విడిచి
నన్ను కాని యన్య ♦ మెన్నఁడు నెఱుఁగని
వారి విడువ నెట్లి ♦ వారి నైన."

నా తేజము నిరంతరము సాధులయం దుండి, వారి కెగ్గొనర్చు వారికి భీతిఁ గలిగించుచుందును. నీ విప్పుడు దయమునఁజని యాయంబరీషునే శరణుఁబొందుము. ఆతఁడే నిన్ను రక్షించును." అని చెప్పిన దుర్వాసుఁడు హరియాజ్ఞ ననుసరించి యంబరీషునిపాలికం జని రక్షింపు మని వేఁడెను. అంబరీషుఁడు జాలివహించి, యాతనిని రక్షింపు మని చిత్తంబునఁ బరమాత్ముం డగు శ్రీహరిని వేడి కొనియెను. వెంటనే చక్ర మదృశ్యమయ్యెను. దుర్వాసుఁడు భయము వాసి యంబరీషుని బహువిధంబుల దీవించి చనియెను.

## 18. [శ్రీరామచరిత్రము.]

—:o:—

సాకేతపురాధీశ్వరుఁడై నదశరథునకు శ్రీమన్నారాయణుఁడు శ్రీరామభరతలక్ష్మణశత్రుఘ్ననామంబుల నాలుగు విధంబులుగా జనించెను. ఇందు జ్యేష్ఠుండగు శ్రీరాముఁడు దశరథునకుఁ గౌసల్య యనుపట్టమహిషియందుఁ బుట్టెను. బాల్యమునందే రాముఁడు సవనసంరక్షణార్థము తండ్రి పంప విశ్వామిత్రునివెంట నేగి, తాటకియను నసురకాంతను దును మాడి, మారీచసుబాహులను వధించి కౌశికునియాగముఁ గాచి యాతనివినుతిఁ బొందెను. తరువాత రామచంద్రుఁ డనుజుఁ డగులక్ష్మణుఁడు వెంటరా విశ్వామిత్రుఁడు దోడ్కొని పోవ మిథిలాపురంబున కరిగి, యచ్చట శివునివిల్లును భంగపఱచి భూజాత యగుసీతను బెండ్లియాడి, యయోధ్యకు మరలి వచ్చుచోఁ దన్నెదిర్చిన రణరంగభీముఁ డగుపరశురాముని గర్వమును భంగపఱిచెను. కైకవరంబుల ననుసరించి దశరథుఁ డంపఁగా సీతాలక్ష్మణసహితుఁడై యరణ్యముల కేగి దండ కారణ్యమునఁ బర్ణశాలయం దుండఁగా, వచ్చిన లోకవిద్రావణుఁ డగురావణుని చెలియలైన శూర్పణఖను ముక్కుఁ జెవులుఁ జక్కుఁజేసి, తనపై కెత్తివచ్చిన ఖరదూషణులఁ గూల్చెను. దశకంధరుఁడు రామలక్ష్మణులను వంచింప, మారీచుని మాయాహరిణముగఁ జేసి పంపి, సీత నపహరించి

లంకకుఁ గొనిపోయెను. సీతను గొనిపోవునప్పుడు మార్గమధ్యమున నాతని నెదిరించి జటాయువను పతంగకులనాథుఁడు హతుఁడయ్యెను. రామచంద్రుఁడు సౌమిత్రీసహితుఁడై సీత నన్వేషించుచుఁ బోయి, మార్గమధ్యమున దననిమిత్త మైరావణునిచేఁ గూలిన జటాయువునకుఁ బరలోకక్రియలు నిర్వర్తించి, ఋశ్యమూకగిరిం జేరి, సుగ్రీవుఁ డనుకపిపుంగవునితో సఖ్యముం జేసికొనియెను.

సుగ్రీవుఁడు తనకును నగ్రజుఁ డగువాలికిని గలవిరోధకారణము దెలిపి తన్ను రక్షింపు మని రాముని బ్రార్థించెను. రాముఁ డొక్కకోలను వాలిం గూలనేసి, సుగ్రీవునిఁ గిష్కింధ కధిపతిగ నొనర్చి, సీతను వెదకుటకు హనుమంతునిఁ బంపెను.

హనుమంతుఁడు సముద్రమును దాఁటి లంకఁజొచ్చి, యశోకవనంబున సీతం గాంచి, తిరిగి వచ్చుచో నక్షకుమారాదిదైత్యుల నుక్కడఁగించి, లంకాదహనంబు సలిపి, కిష్కింధఁ జేరి, సీతకుశలము రాఘవున కెఱింగించి ప్రముదితమనస్కునిఁ జేసెను. అనంతరము శ్రీరామచంద్రుఁడు వనచరబలసహితుఁడై వార్ధిదాఁటి, రావణానుజుం డైన విభీషణునకు శరణ మొసంగి, భీకరసమరతలమున రావణునిఁ దాఁకి,

"మ. చపలత్వంబున డాఁగి హేమమృగముౕ • సంప్రీతిఁ [బుత్తెంచుటో
కపటబ్రాహ్మణమూర్తివై యబల నా•కాంతారమధ్యంబునం

దపలాలించుటయో మదీయశితది ♦ వ్యామోఘ
[బాణాగ్నిసం
తపనం బేగతి నోర్చువాఁడవు దురం ♦ తం బెంతయున్
[రావణా.

అనిపలికి, తీవ్రనారాచంబులఁ బఱపి, వానినిఁ బుత్రామాత్య భృత్యాదివర్గంబుతో నేలం గూల్చి, విభీషణునకు లంకారాజ్య మొసఁగెను. అనంతరము, రామచంద్రుఁడు వహ్నిముఖంబున సీతాపాతివ్రత్యమును బరీక్షించి, యామెను గ్రహించి, సుగ్రీవహనుమదాదులతో నయోధ్యకుఁ బోయి పట్ట భద్రుండై ధర్మపరిపాలనంబు సేయుచుండెను.

పిదపఁ గొన్నాళ్లకు జననిందానివారణార్థము సంపూర్ణ గర్భవతి యైనసీతను రాముఁడు వనంబులకుఁ బంపివేసెను. సీత తన కట్టిదుర్దశ సంభవించినందులకుఁ జింతించుచు వాల్మీకా శ్రమమును జేరెను. అక్కడ నామె కుశలవులను కుమారులఁ గాంచెను. వాల్మీకి యాకుమారులకు సమస్తాస్త్రవిద్యలను తాను రచించిన రామాయణమహాకావ్యంబునుఁ బాడుటయు నేర్పెను. వాల్మీకియాజ్ఞ ననుసరించి యాకుశలవులు రాముని యజ్ఞశాలం బ్రవేశించి రామాయణకథాశ్లోకంబులు బాడు చుండ రాముఁడు వారినిఁ దనసందనులుగాఁ గ్రహించెను. వాల్మీకి సీతం దోడ్కొనివచ్చి యామెసాధ్వీత్వమును గూర్చి రామున కెంతయో చెప్పెను. సీత తననిర్మలచారిత్రమును

బ్రకటించుటకు సభ్యులెల్లరును జూచుచుండ భూమియందుఁ బ్రవేశించెను. ఆమె మరల రాలేదు. రాముఁడామెం గూర్చి కను విచారించి, కుమారులఁ జూచుకొని దుఃఖము మ్రింగి, పెక్కుసంవత్సరములు రాజ్యమేలి, యాత్మీయధామంబును బ్రవేశించెను.

---

## 19. [పరశురామునిచరిత్రము.]

---:o:---

పరశురాముఁడు జమదగ్నియనుమునీంద్రునకు రేణుక యందు జన్మించినపుత్రుఁడు. ఈతఁడు సమస్తవిద్యల నభ్యసించెను. ముఖ్యముగా నీతఁ డస్త్రశస్త్రవిద్యలయం దధికకృషి యొనర్చి, పితామహుఁ డగుభృగుమునీంద్రునియాజ్ఞ ననుసరించి శివునిఁగూర్చి యఖండమైనతపస్సుం జేసెను. శివుఁ డాపరశురామునకుఁ బ్రసన్నుఁడై తీర్థయాత్రలు సలిపి రమ్మని నియోగించెను.

పరశురాముఁడు తీర్థయాత్రలు సేయుచున్నసమయమున దానవులు దేవలోకముపై దాడివెడలిరి. అమరులు వారి బాధలకు సహింపఁజాలక పరమేశ్వరుని శరణు పొందిరి. పరమేశ్వరుఁడు పరశురాముని రావించి, యఖండశక్తి గలయొక పరశువు నాతని కొసంగి, దైత్యులఁ దునుమాడి బృందారకుల

రక్షింపు మని చెప్పెను. శివునిపంపునఁ బరశురాముఁడు దైత్యులఁ దునిమి దేవతలకానందముఁ గూర్చి నిజాశ్రమముఁ జేరి పరమేశ్వరునిఁ జిత్తమున నిలిపి సుఖముగాఁ గాలము గడుపుచుండెను. శ్రీకంఠుఁ డాతనిభక్తికి మెచ్చి పెక్కువరముల నిచ్చుటయే గాక అస్త్రవిద్యారహస్యంబులఁ జెప్పి, స్వచ్ఛందమరణము వరముగా నిచ్చెను.

ఒకదినంబున మాహిష్మతీపురాధీశ్వరుఁ డగు కార్తవీర్యార్జునుఁడు వేఁటాడుట కరణ్యమునకువచ్చి, యాప్రాంతము నందే యున్నజమదగ్నిని దర్శింపఁ బోయెను. జమదగ్ని యానృపాలునిరాకకు సంతసించి, తానొసంగు నాతిథ్యమును గ్రహింపు మని కోరెను. కార్తవీర్యార్జునుఁడు జమదగ్నిం గాంచి "మహాత్మా! నీవాక్యములు నా కెంతయు సంతసము గలిగించినవి. నేను సేనాసహితుఁడనై వచ్చియుంటిని. ఇంత మందికి నీ వాతిథ్య మెట్లొసంగఁగలవు?" అని పలికెను. జమదగ్ని నవ్వి "రాజా! నీవు సంశయింపఁ బనిలే"దనియెను. రాజేంద్రుఁడు మునీంద్రునియాతిథ్యమున కంగీకరించి యానాఁ డచ్చట నిలిచెను. అప్పుడు మునీంద్రునియొద్ద నిష్టార్థంబులు గురియు కామధేనువుమహిమంబున కార్తవీర్యార్జునుఁడును, సైన్యములును విడియుటకు, దగిన మందిరములు నిర్మింపఁ బడెను. ఏవిధమున నెవ్వరికిఁ గావలయునో, యట్టివిధమున భోజనపదార్థములు సమకూర్పఁబడెను. ఆనాఁడు రాజు తన సేనలతో నచ్చట సమస్తసౌఖ్యముల ననుభవించెను. మఱి

నాఁడు మునిచే సెలవుఁబొంది తననెలవునకు బయలుదేఱెను. ఆశ్రమమును విడిచి యీవలకు వచ్చి ననుమాటయే గాని, జమదగ్ని యొద్ద నున్న కామధేనువు నెట్లయిన హరింపవలయు నని కోరిక పుట్టెను. అందులకు మంత్రులుగూడఁ బ్రేరేచిరి. వెంటనే కార్తవీర్యుఁడు తనమంత్రులను కామధేనువు నిమ్మని యడుగుటకుఁ బంపెను. జమదగ్ని కామధేనువును వారి కొసంగుటకు సమ్మతింపకపోవుటచే వారాతనినిఁ జావమోది బల వంతముగా దానిని గొనిపోయిరి. కామధేనువు హుంకరించి మంత్రులఁ జీకాకుపఱిచి, గగనంబున కెగసి యదృశ్య యయ్యెను.

ఇది యంతయు జరిగినప్పుడు పరశురాముఁ డాశ్రమం బున లేఁడు. కార్తవీర్యునిమంత్రులు కొట్టినదెబ్బలచే మరణిం చిన జమదగ్నికై రేణుకాదేవి విలపించుచుండెను. అప్పుడు పరశురాముఁడు వచ్చి తల్లివలన సమస్తము నెఱింగి కార్త వీర్యార్జునుని జంపెద నని ప్రతిజ్ఞఁజేసెను. రేణుక-తనకుమా రులఁ జూచి "పతిలేని నాబ్రదు కేల" యని యగ్నింబడఁ బోయెను. కాని జమదగ్ని సజీవుఁ డగు నని యాకాశవాణి పలుక నాలకించి యూరకుండెను. ఇంతలో నచ్చటికి భృగు మునీంద్రుఁ డరుదెంచి, మృతసంజీవనీవిద్యాప్రభావమున జమ దగ్నిని సజీవునిఁగఁ జేసెను.

అనంతరము పరశురాముఁడు కుఠారధరుఁడై మాహి ష్మతీపురంబుఁజొచ్చి కార్తవీర్యుని యుద్ధమునకుఁ బిలిచెను.

ఇరువురకును భయంకరమైనసమరము జరిగెను. అందుఁ బరశురాముఁడు కార్తవీర్యుని వధించెను. కార్తవీర్యునిసుతులు పరశురామునితో సమరమునకుఁ దలపడి, పరశురామునియమోఘాస్త్రానలజ్వాలలకుఁ దాళఁజాలక పాఱిపోయిరి. కొందఱు సైనికులు మడిసిరి. పరశురాముఁడు నిజాశ్రమమునకుఁబోయి కార్తవీర్యార్జునుని వధంగూర్చిజమదగ్ని కెఱింగించెను. జమదగ్ని తనయునిసాహసకార్యమాలించి, యిట్లనెను.

"క. క్షమ గలిగిన సిరి గలుగును
క్షమ గలిగిన వాణి కలుగు • సౌరప్రభయున్
క్షమగలుగఁ దోస కలుగును
క్షమగలిగిన మెచ్చు శౌరి • సదయుఁడు తండ్రీ!"

పిదపఁ బరశురాముఁడు తండ్రియానతి శిరంబున దాల్చి సకల తీర్థముల సేవించి వచ్చెను.

ఇట్లుండ నొక్కనాఁడు రేణుక జలంబులకై నదికిఁ బోయి, యచ్చట నొకగంధర్వుఁడు కాంతలతో జలక్రీడఁ దేలుచుండ నావినోదముం జూచుచు నాశ్రమమునకు వచ్చుటకుఁ దడసెను. ఆమె యాశ్రమంబునకు వచ్చిన యంతనే జమదగ్ని కోపమంది, యామెను వధింపుఁ డని కుమారుల కాజ్ఞ నిచ్చెను. అందులకుఁ బెద్దవారు సమ్మతింప లేదు. జమదగ్నిచిన్నకొడుకయినపరశురాముని గాంచి "రామా! నీయన్నలు నాయాజ్ఞఁ బాలింపకున్నారు. కావున

నీవు వీరిని-నీతల్లిని గూడ వధించి పితృభక్తితత్పరుఁడవు గమ్మ," అని పలికెను. పరశురాముఁడు కొంతసేపు విచారించి, తుదకు ధైర్యముంబూని, పరశువుచేఁ దనయన్నలను దల్లిని వధించి, తండ్రికి నమస్కరించి నిలిచి యుండెను. జమదగ్ని పరశురామునిభక్తికి సంతసించి "నీకుఁ గావలసినవరము గోరుకొ" మ్మనియెను. మృతులైనతోఁబుట్టులును, దల్లియు సజీవు లగు నట్లు వర మనుగ్రహింపు మని కుమారుఁడు తండ్రినిగోరెను. జమదగ్ని తపఃప్రభావమున రేణుకయుఁ, దనయులును నిద్ర నుండిలేచినవారివలె లేచి కూర్చుండిరి, పరశురాముఁ డానంద మందెను.

మఱియొకసమయమునఁ గార్తవీర్యార్జునుని పుత్రులు పరశురాముఁడు తమతండ్రిని జంపినపగ సాధింపఁదలఁచి, పరశు రాముఁడాశ్రమంబున లేనిసమయమునవచ్చి, జమదగ్నిశిర మును ఖండించి చనిరి. పరశురాముఁడు వచ్చి సర్వము విని "అమ్మా! నీవు విచారింపవలదు. నీవును నాయన్నలును నాతండ్రికళేబరమును జాగరూకతతోఁ జూచు చుండుఁడు. నాతండ్రిని జంపినయాహైహయులను జంపి వచ్చుటయేగాక, నాతండ్రిని వారు జంపునప్పుడు నీవు నన్నుద్దేశించి యెన్నిమా ఱులు పిలిచితివో, యన్నిమాఱులు క్షత్రియకులకాంతార మును ఛేదించి, వారిరక్తమునఁ బితృతర్పణములఁ దీర్చెద" నని పలికి, మహిష్మతీపురమున కేగి, హైహయులనెల్లర వధించెను. అనంతరము భూతలం బెల్లఁ గ్రుమ్మరి, యాతఁడు

క్షత్రియులను నిఱువదియొక్కమాఱు వధించి, కురుక్షేత్ర సమీపమున శమంతపంచకంబును నారక్తముచే నించి, పితృతర్పణం బొనర్చెను.

జమదగ్ని పత్నీసహితుఁడై దివ్యరూపమున స్వర్గమునకుఁ బోయెను. తరువాతఁ బరశురాముఁడు యాగం బొనర్చి, ధరాతలం బెల్లఁ గశ్యపుఁ డను మౌనికి దాన మిచ్చి, యాతని యాదేశంబునఁ దపోవృత్తి నుండుటకు మహేంద్రగిరికిఁ బోయెను.

త్రేతాయుగంబున రాముఁడై జన్మించిన శ్రీమన్నారాయణుఁడు పరశురామునిశక్తి హరించెను. ద్వాపరంబునఁ బరశురాము నాశ్రయించి భీష్మకర్ణులు శరవిద్య నందిరి.

## 20. [యయాతి.]

వృషపర్వుఁ డనుదానవేంద్రునకు శుక్రాచార్యుఁడు గురుఁడై యుండెను. శుక్రునియొద్ద మృతసంజీవని యను మహావిద్య యుండుటచే నాతఁ డావిద్యాప్రభావంబున రణంబులోఁ జచ్చిన దనుజవీరులను బ్రదికించుచుండును. ఈవిద్య దేవతలలోఁగూడ నెవ్వరికిని దెలియదు. అందుచేత నీవిద్య నెట్లయిన గ్రహించి రమ్మని దేవతలు బృహస్పతిపుత్రుఁ డగు కచుని నియోగించిరి. కచుఁడు శుక్రునియొద్దకుఁ బోయి

తత్పాదములకు నమస్కరించి "మహాత్మా! నేను బృహస్పతి సూనుఁడను. నీకు శిష్యుఁడనై విద్యల నేర్వ వచ్చితిని. అనుగ్రహింపు" మని పలికెను. శుక్రుఁడు కచుని భక్తివినయములకు మిగుల సంతోషించి శిష్యునిగా స్వీకరించెను. తనసుగుణములచేఁ గచుఁడు శుక్రునిపరిపూర్ణకృపకుఁ బాత్రుఁ డగుటయే గాక యాతని పుత్రిక యగు దేవయాని యనుదానికిఁ గూడఁ బాత్రుఁడై యుండెను.

ఇట్లుండఁ గచుఁడు శుక్రునివలన మృతసంజీవనీవిద్య గ్రహించుటకు వచ్చినాఁడని గ్రహించి, యాతఁడు ధేనువులఁ దోలుకొని యరణ్యమునకుఁ బోయినప్పుడు దానవులాతనిని జంపి, యొకచెట్టునకు వ్రేలాడఁగట్టిరి. సంధ్యాసమయమగుటచేత గోవులు గృహమునకు వచ్చెను. కచుఁడు మాత్రము రాలేదు. దేవయాని యతఁడు రానందులకు విచారమంది, తద్వృత్తాంత మరయు మని శుక్రుని వేఁడికొనియెను. శుక్రుఁడు తనదివ్యదృష్టిని గచునివృత్తాంత మెఱింగి, యరణ్యమునకుఁ బోయి మృతుఁడైనయాతనిని సజీవునిఁ జేసి గృహమునకుఁ దోడ్కొనివచ్చెను. మఱియొకసమయమున రాక్షసులు కచునిఁ జంపి కాల్చి, యాబూడిదను సురలోఁ గలిపి శుక్రునిచేఁ ద్రావించిరి. సంధ్యాసమయమునకుఁ గచుఁడు గృహంబునకు రాకుండుటచే దుఃఖించుకూఁతును శుక్రుఁడు చూచి "అతఁడు నావలన మృతసంజీవనీవిద్య గ్రహించునని దైత్యులు చంపియుందురేమో! అతనికై నీవు దుఃఖింపఁ

బనిలేదు.” అనిపలికెను. అందుల కామె కచుఁడు వచ్చినఁ గాని భుజింపను. నీరము ద్రావ నని చెప్పి మఱింతదుఃఖించుచుండెను. శుక్రుఁడు పుత్రికయెడల జాలివహించి, దైత్యులాకచుని బూడిదను సురలోఁ గలిపి తనచేఁ ద్రావించి రని యోగదృష్టివలన నెఱింగి, తనయుదరమున నున్నకచుని మృతసంజీవనీవిద్యాప్రభావమున బ్రదికించెను. అప్పుడు శుక్రుని యుదరంబున నున్నకచుఁడు “దేవా! నీయుదరంబునుండి వెలువడుమార్గము గానరాకున్నది” యనియెను. అప్పుడు శుక్రుఁడు “కుమారా! నా యుదరము ఛేదించుకొని నీవీవలకు రాఁజాలవు. అట్లొనర్చితి వేని నేను బ్రాణములఁ బాయుదును. కావున నీకు మృతసంజీవనీవిద్య నిచ్చుచున్నాను. నీవీవలకువచ్చి, మృతుఁడ నగునన్ను బ్రదికింపు” మని చెప్పి యావిద్య నుపదేశించెను. కచుఁడు శుక్రునియుదరము చీఁల్చుకొని యీవలకు వచ్చి యాతనిని బ్రదికించెను. ఈవిధమునఁ గచుఁడు శుక్రునివలన మృతసంజీవని గ్రహించి, కొన్నిదినము లచ్చటనుండి యొకనాఁడు తనలోకమున కేగుటకు గురునియాజ్ఞఁబొంది, దేవయాని కాసంగతిఁ దెలిపెను. దేవయాని యాతనితోఁ దన్ను గ్రహింపు మనిపలికెను. ఆమాట విన్నంతనే యతఁడు “నీవు కడుఁ బాపపుఁ బలుకుఁ బలికితివి. గురుతనూజ వగుటం జేసి నీవు నాకు సహోదరి” వని నుడివి యామెయభీష్టము నిరాకరించెను. అందులకు దేవయాని యాగ్రహమంది సంజీవనీవిద్య యాతనికిఁ బనిసేయకుండు నని శాపంబిచ్చెను. కచుఁడు

"నేను ధర్మము దప్పిచరించువాఁడఁ గాను. అట్టి నన్ను నీ వకారణముగ శపించితివి. నే నిందులకు విచారింపను. సంజీవని నాకుఁ బనిసేయకపోయినను నాచే నుపదేశమందినవారికిఁ బనిసేయుఁగాక! నీవు సన్నధర్మకార్యమునందుఁ బ్రవేశపెట్టఁ దలఁచితివి కావున నిన్ను బ్రాహ్మణుఁడు పరిణయముచేసి కొనఁడు!" అని పలికి యమరలోకమునకుఁ బోయెను.

తరువాత నొకనాఁడు వృషపర్వుని పుత్రిక యైన శర్మిష్ఠ చేటీజనంబుతో దేవయాని వెంటరా సరోవరంబునకు జలక్రీడార్థమై యరిగెను. ఆసమయమునఁ బెద్దగాలి వీచి వారెల్లరు గట్టునఁ బెట్టినవస్త్రము లన్నియుఁ గలిసిపోయెను. తొందరలో దేవయానివస్త్రము శర్మిష్ఠ కట్టెను. శర్మిష్ఠపుట్టము దేవయాని కట్టనొల్లక "నాజనకుఁడు మీకు గురుఁడు. నేను నీకుగురుపుత్రి నగుటచేఁ బూజింపఁ బడఁదగినదానను. నీమైల పుట్టము నేను గట్టుదునా!" యని పలికెను. అందులకు శర్మిష్ఠ యలిగి, దేవయాని నొక నూతం ద్రోయించి యింటికిఁ బోయెను.

కొంతసేపటి కచ్చటికి యయాతి నృపాలుఁడు వచ్చి యామెవృత్తాంత మెఱింగి తనదక్షిణహస్తముచే నామెను నూతినుండి వెలువడఁ జేసి తనపురంబునకుఁ బోయెను. అప్పుడే దేవయాని నరయుచు నచ్చటి కొకపరిచారిక వచ్చెను. దేవయాని తనకు శర్మిష్ఠచేసిన పరాభవము పరిచారిక కెఱింగించి, తండ్రి కెఱింగింపు" మనియెను. పరిచారిక వెంటనే యరిగి

దేవయానివృత్తాంత మంతయు శుక్రున కెఱింగించెను. శుక్రుఁడు దేవయానియొద్దకు వచ్చి "శర్మిష్ఠ దైత్యేంద్రుని కూఁతురు. ఆమెతో నీకేమి? గృహంబునకు రమ్మి" అని పలికెను. అందులకు దేవయాని "నేను బురంబులో నడుగుఁ బెట్టను. వివేకశూన్యులయొద్ద మన ముండనేల? మఱియొక చోటికిఁ బోవుదము. మహాప్రభావసంపన్నుఁడ వగునిన్నుఁ బూజింపనివా రెవ్వరు?" అనినుడివెను. వృషపర్వుఁ డీవృత్తాంతము చారులవలన నెఱింగి తొందరగా శుక్రునిం జేరి యాతని ననేకవిధముల స్తుతించి, "నీపుత్త్రిక యగుదేవయాని కేది యిష్టమో యది కూర్తు" నని పలికెను. శర్మిష్ఠను జెలికత్తెలతోఁ గూడఁ దనకు దాసిగాఁ జేయుమని దేవయాని చెప్పెను. వృషపర్వుఁడు బదులుచెప్పక శర్మిష్ఠను దేవయానికి దాసిగాఁ జేసెను. పితృవాక్యము ననుసరించి శర్మిష్ఠ దేవయానిని సేవించుచుండెను.

"మ. చల మింకేలని తన్నుఁ దండ్రి వనుపన్ ♦ శర్మిష్ఠసన్నిష్ఠతో
జలజాతాస్యలు సద్వయస్యలు సహ♦స్రంబు న్నిజ స్రంబుద
స్థలమన్ దాసి సుదాసియయ్యెఁ బగవా ♦ యన్ భూరి [క్రోపానలా
కలితగ్లానికి దేవయానికి మహా ♦ గర్వోద్యమస్థానికిన్."

ఒకనాఁడు దేవయాని శర్మిష్ఠతో వనంబున విహరించుచుండఁగా నయ్యెడకు యయాతి వచ్చి, దేవయాని నెఱింగినవాఁ

డయ్యెను నెఱుంగన ట్లామె వృత్తాంత మడిగెను. అందులకు దేవయాని యిట్లనెను. "రాజేంద్రా! నీవు నన్నెఱింగి యుండియు నిట్లడుగుచుంటివి. నాఁడు నీకుడిహస్తముచే నన్నుఁ గూపము వెల్వడఁజేసినసంగతి మఱచితివా? నాఁడే నీవు నాపాణిగ్రహించినాడవు. ఇఁక సంశయ మేల? నన్నుఁ గ్రహించి సుఖంబులనందుము. వృషపర్వునికూఁతు రగునీశర్మిష్ఠ నన్నుఁ గొలిచివచ్చును." దేవయానిమాట లాతని కచ్చెరువుం బుట్టించెను. ఆతఁడామెతో "నీవు బ్రాహ్మణకన్యవు. నేను క్షత్రియుఁడ. రాజు నగునేను వర్ణాశ్రమ ధర్మమున కెట్లు విరుద్ధముగ బ్రవర్తింతును?" అని పలుక, నామె మరల "లోకపూజ్యుఁ డగుమాతండ్రి చెప్పిన సమ్మతింతువా?" యనియెను. రాజేంద్రుఁ డందుల కంగీకరించెను. దేవయాని తండ్రిం జేరి తనయభీష్టముఁ దెలిపెను. శుక్రుఁడు "ధర్మవిరోధము లేకుండుఁ గాక" యని వరం బిచ్చి, యామెను యయాతికి వివాహముచేసి, యారాజునకు శర్మిష్ఠను జూపి యిట్లనెను. "నృపాలా! ఒకశయనవిషయమునఁ దప్పఁ దక్కినవిషయములలో నీవెను నాపుత్రికతో సమానముగఁ జూడవలయును." అనిచెప్పించెను.

యయాతికి దేవయానియందుఁ గొన్నాళ్లకు యదు తుర్వసు లను కొడుకులు జనించిరి. తనకు సంతానము లే దని శర్మిష్ఠ విచారించి, యొకనాఁడు యయాతి వనంబున కొంటరిగా వచ్చినప్పు డాతనినిఁ దనకుఁ భర్తగఁ గమ్మని కోరెను.

శుక్రుఁడు తనకుఁ జెప్పినవాక్యములకు భయమందెను గాని, శర్మిష్ఠ బలవంతముచేఁ దుద కాతఁ డంగీకరించెను. శర్మిష్ఠ యాతనివలన ముప్పురుపుత్రుల గనియెను. ఇంతవఱకు యయాతి శర్మిష్ఠలదాంపత్యము దేవయాని యెఱుంగదు. ఒక నాఁడు శర్మిష్ఠపుత్రులు యయాతి యొద్దకువచ్చి యాడుకొను చుండఁగా నచ్చటకు దేవయాని వచ్చెను. ఆకుమారులరూప ములు యయాతిం బోలియుండుటచే దేవయాని వారిని మీతల్లిదండ్రు లెవ్వ” రని యడిగెను. వారు శర్మిష్ఠయయా తులు తమతల్లిదండ్రు లని బదులుచెప్పిరి. దేవయాని యప్పటి కేమియుఁ బలుకక మందిరమునకుఁ బోయి, యయాతికిఁ దెలు పకుండఁ దండ్రికడకుఁ బోయి, యాసంగతిఁ జెప్పెను. శుక్రా చార్యుఁడు యయాతిని రావించి “శర్మిష్ఠవిషయములో నేను జెప్పినమాట మఱచి వర్తించితివి గాన వృద్ధుఁడ వగుదువు గాక” యని శపించెను. యయాతి శుక్రునిచరణములపైఁ బడి రక్షింపు మని వేఁడెను. అతఁడు కరుణవహించి “నీముసలి తనము నీకొడుకులలో నొకని కిచ్చి వానియౌవనము నీవు తీసికొని సుఖించి, మరల నీము దిమిని నీవు గ్రహింతువుగాక” యని పలికెను.

శాపముప్రకారము యయాతి వృద్ధుఁ డయ్యెను. అప్పు డాతఁడు పుత్రులనెల్లర రావించి, “కుమారులారా! నావృద్ధత్వ మును మీలో నెవ్వరైనఁ దీసికొని మీయౌవనము నాకొసఁ గుఁడు. నాకు రాజ్యసుఖంబులయం దిచ్ఛ తీరలేదు.” అని నుడివెను. అందులకు వారు,

"శా. కాంతాహేయము బంధునింద్యము దురా ♦ కందూతి
(మిశ్రంబు హ్రా
చ్ఛింతామూలము పీనసాన్వితము ప్ర♦ స్వేదప్రణాకంపన
శ్రాంతిస్ఫోటకయుక్త మీముదిమి వాం ♦ ఛం దాల్చి
(నానాసుఖో
పాంతం బైనవయోనిధాన మిది య ♦ య్యా తేర
(యీవచ్చునే."

యనిపలికి నిరాకరించిరి. కాని, శర్మిష్ఠయందు జనించినకడ గొట్టుకొమరుఁ డైనపూరుఁడంతయు సంతోషమున సమ్మతించెను. యయాతి తనవృద్ధత్వము పూరునకిచ్చి వానియావనము దీసికొని రాజ్యసుఖముల ననుభవించి తృప్తుఁడై, మరల వానియావనము వాని కొసంగెను. పితృభక్తిఁ జూపించిన యాపూరునకే రాజ్య మిచ్చి యయాతి తపోవనంబుఁ బ్రవేశించెను.

———:o:———

## 21. [భరతుఁడు.]

దుష్యంతుఁ డనునృపాలుఁడు పూర్వరాజన్యుల కీర్తివల్లి కలఁ బ్రాఁకించుచు, ధర్మపద్ధతిని హస్తినాపురసామ్రాజ్యమును బాలించుచుండెను. అతఁ డొక్కదినంబున మృగయావ్యాపారం

బున నరణ్యంబునఁ బెక్కుమృగముల నుక్కడఁగించుచు నతిదూరం బరిగెను. వెంటనరిగిన వేఁటకాండ్రు కడు నలసి యందందు విశ్రమించిరి. దుష్యంతుఁ డొకమృగంబును దఱుముకొనుచుఁ గడుదూరం బరిగెను. ఆ ప్రదేశమున నాతనికి సమస్తతరులతా పుష్పశోభితం బై నందనవనంబును బురుడింపఁజాలు నొక దివ్యవనంబు పొడకట్టెను. అవ్వనరామణీయత కాతఁ డచ్చెరువొందుచు నందుఁ బ్రవేశించి, సమిత్కుశఫలార్థమై యరుదెంచిన మునిబాలురచే నయ్యది కణ్వమహామునితపోవనం బని యెఱింగి, తనవెంట వచ్చినవారి నచ్చట నుండనియమించి, తాను గణ్వునిదర్శించుట కేగెను. దుష్యంతుఁడు కణ్వాశ్రమంబును బ్రవేశించి యందు భువనమోహినిచందంబున రాజిల్లుచున్న శకుంతలం గాంచి, యామెరూపలావణ్యంబుల కచ్చెరువందుచు నిలుచుండెను. శకుంతల యాతనింజూచి, దుష్యంతుఁడని యెఱింగి యర్ఘ్యపాద్యాదివిధులఁ బూజించెను. నృపాలుఁడామెను వీక్షించి "వేఁటకై యరణ్యంబున కరుదెంచి కణ్వమహామునిదర్శనముఁ జేసికొని పోవవచ్చితిని. అమ్మునివల్లభుండెచ్చటి కరిగె" నని యడిగిన, నక్కన్యక "వారిప్పుడే వనంబునకుఁ బండ్లుదేరఁ బోయిరి. సత్వరముగ రాఁగలరు. అంతవఱకు నిట విశ్రమింపు" డని బదులు చెప్పెను. శకుంతలను జూచినంతనే నరపాలునిచిత్తము చలించెను. ఒకసారి మునికన్నియపైకిఁ దనచిత్త మరిగినందులకు విచారించెను. ఒకసారి, యామెమునికన్యయే యైనచోఁ దనచిత్తము చలింపదని

తలంచెను. తుద కామెయవివాహిత యగురాచకన్నియ యని కృతనిశ్చయుఁడై యామెను విలోకించి "నారీమణీ! నీసౌంద ర్యాదివిశేషంబులు వర్ణనాతీతమై యున్నవి. నీయన్వయాభి దానంబు లెట్టివి? నీ వీయాశ్రమంబున నుండుట కేమికారణము" అని యడుగ నాశకుంతల రాజుం జూచి "నృపాలా! సకలధర్మ స్వరూపుఁడై నకణ్వునికూతురను. శకుంతల యనునామంబునఁ దనరుదాన" నని ప్రత్యుత్తరమిచ్చెను. దుష్యంతుఁ డందులకు సంశయాస్పదచిత్తుఁడై మరల నామెను విలోకించి "సుందరీ మణీ! బ్రహ్మచర్యవ్రతస్థుఁడైనకణ్వునకు నీవు తనూజ వెట్లయితి" వని యడిగెను. అందులకు శకుంతల యాతనికిఁ దనజన్మప్రకారము, కణ్వుఁడు కొందఱుమునులతోఁ జెప్పిన విధఁబు నిట్లు వచించెను.

"తొలుత రాజర్షియై, యనంతరము తపశ్శక్తిచేత బ్రహ్మర్షిభావంబు వడసినవిశ్వామిత్రుఁడు సేయుచున్న ఘోర తపంబునకు సంద్రుఁడు భయంబంది మేనక యను దేవవేశ్యను బిలిచి, "నీవు కపటరయంబున నరిగి విశ్వామిత్రుని తపంబునకు విఘ్నము గలిగించి మమ్ముఁ గాపాడవలయు" నని పలికెను. అందులకు మేనక "అమరేశ్వరా! ఆగాధేయునికోపాగ్నికిఁ జతుర్దశభువనములును భయమందుచుండును. ఆతఁ డొక్కింత యలిగి చూచెనేని లోకము లన్నియు భస్మమగును. అట్టి యెడల నబల నగునే నాతని యెదుటకుఁ బోయి నిలువఁ గలనా? అయినను నీయాజ్ఞ ననుసరించి యమ్మునివరుని పాలికిఁ

బోయి నానేర్పుతెఱంగున నాతనితపము విఘ్నము గావింప యత్నించెదను. ఇట్లు పలికి యామేనక, హిమవత్పర్వతసమీప వనంబునఁ దపము సేయుచున్న యామునివరునకడ కరిగి, నమస్కరించి, పుష్పాపచయంబు సేయునెపంబున నందు విహరించుచుండెను. మేనకను వీక్షించినయంతనే విశ్వామిత్రుని హృదయము చెదరిపోయెను. తపముఁ జాలించి తదేకదృష్టితో నామెను జూడఁదొడంగెను. అంతట నాతఁడు నిష్ఠనెల్ల నీరుపాలుగావించి, యమ్మందయానకు లోపడెను. మేనక యాముని యొద్దఁ బెద్దకాలం బుండి, యీమెం గాంచి, యొక్కయేటి పులినతలంబునఁ బెట్టి, యమరలోకంబున కరిగెను. విశ్వామిత్రుఁడును మేనకవలనఁ దనతపంబునకంతరాయము గలిగెనని పశ్చాత్తాపమునంది మరలఁ దపంబునఁ బ్రవేశించెను. మునిప్రభావంబునఁ జేసి, యచ్చటనున్న శకుంతపక్షులు శిశువును గ్రూరమృగంబులు స్పృశింపకుండఁ బర్ణంబులు గప్పి రక్షించుచుండెను. అంతనే నొకదినంబున సమిత్కుశఫలార్థినై యచ్చట కరిగి శకుంతరక్షితం బగుశిశువుం గాంచి, నాయాశ్రమంబునకుఁ దెచ్చి శకుంతల యనునామం బిడి పెంచితిని. ఈవిధంబున నీమె నాకు గారాబుఁబట్టి యైనది.”

శకుంతలజన్మప్రకారము విని దుష్యంతుఁ డామె నెట్లు యిన వివాహమాడఁదలఁచి, యిట్లు పలికెను. “తరుణీమణీ! నిన్నుఁ బెండ్లియాడ నా కిచ్ఛజనించినది. చతురుదధివేలావలయిత మహీతలంబునకుఁ జక్రవర్తి నైననా కిల్లాలుగా

నుండఁదగిన నీవీయకార్యమున నుండఁదగదు. బ్రాహ్మము, దైవము—ఆర్షము—ప్రాజాపత్యము—రాక్షసము— అసురము— గాంధర్వము—పైశాచము—ననియెనిమిదివిధములు శాస్త్రముల యందుఁ జెప్పఁబడియున్నవి. అందు క్షత్రియులకు గాంధర్వ రాక్షసములు ప్రశస్తంబులై యొప్పును. కావున నన్ను గాంధర్వవిధినిఁ బరిణయంబగుము."

దుష్యంతునిపలుకులు విని, యాశకుంతల "కణ్వుఁ డరుదెంచి యిందులకు సమ్మతించినచో నన్నుఁ బెండ్లాడు" మనియెను. ఎట్టకేలకు దుష్యంతుఁ డామెకు జనించునందనుని రాజుగాఁ జేసెద నని వరంబిచ్చి, గాంధర్వవిధిని గైకొని "తరుణీ! ఇంక నేను బురంబున కరిగి నన్నుఁ దోడ్కొనివచ్చు టకుఁ బురోహితామాత్యబృందమును గణ్వునిసాలి కంపెదను," అని పలికి యరిగెను. స్వల్పకాలం డరిగినపిమ్మట శకుంతల తాను జేసినకార్యమును గణ్వుఁ డెఱింగి యేమికోపించునో యని విచారించుచుండెను. ఫలంబుల కరిగినకణ్వుఁ డాశ్రమమునకు వచ్చి, భయమందుచు నెదుట నిలిచియున్న శకుంతలంగాంచి "కుమారీ! నీ వొక్కింతయు భయం బందవలదు. సమస్తము నాకు గోచరమైనది. నీకుఁ దగినవరుని గాంచితివి. గాంధర్వ వివాహము శాస్త్రసమ్మతమైనదే. నీవిప్పుడు గర్భవతివైతివి," అని పలికి యామెచిత్తం బనవరతము ధర్మమునందే వర్తిల్లు నట్లును, నామె కుదయించు కుమారుఁడు వంశకర్తయు, దీర్ఘా యురారోగ్యబలపరాక్రమసమన్వితుఁడు నై యుండునట్లుగను వరం బొసంగెను.

శకుంతలకుఁ గాలక్రమమున నొకకుమారుఁడు జనించెను. కణ్వుఁ డక్కుమారునకు జాతకర్మాదిక్రియల నెఱవేర్చి భరతుఁ డని పేరు పెట్టెను. భరతుఁడు దినదినప్రవర్ధమానుఁ డగుచు, కణ్వాశ్రమప్రాంతమున నున్న క్రూరమృగంబులఁ బట్టితెచ్చి, యాశ్రమంబున భూజంబులకుఁ గట్టుచు, బాల్యక్రీడలచే శకుంతలకును, గణ్వునకును ముదము గలుగఁజేయుచుండెను. అచ్చటమునీంద్రు లెల్లరును నాకుమారుని సాహసగుణంబుల కద్భుతమంది సర్వదమనుఁ డనిపేరు పెట్టిరి. ఇట్లు కొంతకాలము జరిగినపిదప నొకనాఁడు కణ్వుఁడు శకుంతలను పుత్త్రసహితముగా మునిశిష్యులను దోడిచ్చి దుష్యంతుని పాలికిఁ బంపెను. దుష్యంతుఁడు శకుంతలను జూచి యేమియుఁ బలుకలేదు. అప్పు డామె రాజేంద్రునిఁ జూచి "నృపాలచంద్రా! వేఁటనెపంబునఁ గణ్వాశ్రమంబునకు వచ్చి యచ్చట నా కొసంగినవరంబుఁ దలంపుము. ద్యుమణిసమానతేజుఁ డయినయీపుత్త్రుఁడు నీపుత్త్రుఁడు. వీనిని యువరాజుగాఁ జేయుము." అని పలికెను. అందులకు దుష్యంతుఁడు "అబలా! నీవెవ్వతెవో నే నెఱుంగను. ఇట్టియనుచితవాక్యము లాడకుము. ఎక్కడినుండి వచ్చితివో యక్కడి కేగుము," అని నుడివెను. దుష్యంతుని నోటినుండి వెలువడిన యానుడులకు శకుంతల నిశ్చేష్టిత యయ్యెను. కన్నులవెంట జలములు బయలుదేఱెను. కొంతసేపటి కామె సంతాప మంతయు నడంచుకొని, యప్పుడమిఱేని కిట్లు పలికెను.

"ప్రాణేశ్వరా! సమస్తము నెఱిఁగియుండియు, నెఱుఁగనని వచించినమాత్రమునఁ దప్పిపోవునా! వేదములు, పంచభూతములు, ధర్మువు, రాత్రింబవళ్లు, సూర్యచంద్రులు, యముండును జూచుచుండఁగాఁ దాను జేసినకార్యము నరుఁడు దాఁచినను దాఁగునా! నీవు కణ్వాశ్రమమునకు వచ్చినాఁడిచ్చినవరము జ్ఞప్తికిఁ దెచ్చుకొని నన్ను గ్రహింపుము. గుణవతియగుసతిని నీచదృష్టిని జూచువాని కిహపరము లుండవని ధర్మశాస్త్రములందుఁ జెప్పఁబడియున్నది. నీవు సత్యమునందే బుద్ధి నిలుపుము. మహాతపోనిష్ఠాగరిష్ఠుఁడైనవిశ్వామిత్రునకుఁ దనయనైన నే నసత్యముఁ బలుకుదునా?" అని శకుంతల యిట్లుపలుకుచున్న సమయమున,

"మ. అదె నీవల్లభ వాఁడుపీసుతుఁడు భా ♦ ర్యాపుత్రులం [బాత్రులన్
వదలంగాఁ దలనాఁటికణ్వవనికా ♦ వైవాహికారంభముల్
మదినూహింపు శకుంతలావచనముల్ ♦ మాన్యంబు లౌ [భూవరేం
ద్ర దయంజేకొను మంచు మ్రోసెను వియ ♦ ద్వాణీవధూ [గీతముల్."

ఆకాశవాణివాక్యములు విని దుష్యంతుఁడు శకుంతలను గ్రహించి, భరతునియౌవరాజ్యమున కభిషిక్తునిఁ జేసెను.

దుష్యంతుఁడు పెక్కేండ్లు రాజ్యపరిపాలనం బొనర్చి పరలోకంబున కేగెను. భరతుఁడు చక్రవర్తియై వసుంధరా

తలముం బాలించుచు యమునాతటంబున ననేకాశ్వమేధ యాగంబు లొనర్చెను.

---

## 22. [రంతిదేవుఁడు.]

:o:

రంతిదేవుఁ డనునృపాలుఁడు పెక్కేండ్లు ధరణీతలంబుఁ బాలించి, తుదకు రాజ్యభోగంబులయందు విరక్తుఁడై, తన యర్థ మంతయు దీనులకుఁ బంచి, యరణ్యమునకుఁ బోయెను. ఆతఁ డరణ్యమునఁ జరించుచుండఁగా నెక్కుడను వరుసగా నలువదియెనిమిదిదినములు ఆహారముగాని నీరముగాని లభింప లేదు. తుద కాతనికి నలువదియెనిమిదవదినంబున ననేకభక్ష్యంబులతోఁ గూడినయన్నంబును, బానీయములును లభించెను. ఆతఁ డాయన్నంబును భుజించుటకు సంసిద్ధుఁడై యున్నసమయంబున నాతనికడ కతిథులై యొకభూసురుఁడును, నొక శూద్రుఁడును, నొకరితరువాతనొకరు వచ్చిరి. నిరంతరధర్మవ్రత పరాయణుఁ డగునాతఁ డొక్కింతయు సంశయింపక సంతోషమును బొందుచుఁ దనయన్నములోఁ గొంత వారికిఁ బెట్టి పంపించెను. ఇఁక మిగిలినభాగమును దాను దినఁదలఁచుచుండఁగా నొకశునక మాతనికడకు వచ్చెను. అంతట నాతఁడు తాను దినఁదలఁచుకొన్న యన్నము నాకుక్కకుఁ బెట్టివేసెను. ఇఁక నాతనియొద్ద నన్న మేమియును లేదు. త్రాగుటకు

జలంబులు మాత్రమున్నవి. వానినైనను ద్రావి కడుపు నింపు కొందమనుకొనుచుండ, నంతలో నొక చండాలుఁడు వచ్చి

"క. హీనుఁడఁ జండాలుండను
మానవకులనాథ దప్పి ♦ మానదు సవలం
బోనేర నీకుఁ జిక్కిన
పానీయము నాకుఁబోసి ♦ బ్రతికింపఁగదే."

అని పలికెను. రంతిదేవుఁ డాచండాలుని వాక్యము లాలించి మిగుల జాలిఁ గొని,

"ఉ. అన్నము లేదు కొన్ని మధు ♦ రాంబువు లున్నవి ద్రావు [మన్న రా
వన్న శరీరధారులకు ♦ నాపదవచ్చిన వారియాపదల్
గ్రన్నన మాన్చి వారికి సు♦ఖంబులు సేయుట కన్న నొండు మే
లున్నదె నాకు దిక్కు పురు♦షోత్తముఁ డొక్కఁడు చుమ్ము [ఫుల్క సా."

అని పలికి, తనయొద్ద నున్న జలంబుల నాచండాలునకుఁ బోసెను. రంతిదేవుని ధర్మగుణమునకు హరిహరబ్రహ్మలు సంతోషించి నిజరూపములతో నాతనికిఁ బ్రసన్నులై "రంతిదేవా! నీభక్తికిని ధర్మసంధతకును మేము మెచ్చితిమి. నీచిత్తమును బరీక్షించుటకు మేమే యట్టిరూపములతో వచ్చి నిన్నన్నపానీయము లర్థించితిమి," అని పలికిరి.

రంతిదేవుఁడు వారికి నమస్కరించి తనచిత్తమున శ్రీమన్నారాయణభక్తి యచంచలంబుగ నుండునట్లు వరము గ్రహించెను.

## 23. [శ్రీకృష్ణజననము.]

మధురాపురాధీశ్వరుఁ డగు నుగ్రసేనునకుఁ గంసుఁ డను కుమారుఁడు గలఁడు. ఆకంసుఁడు మిగులఁ గ్రూరచిత్తుఁడై తండ్రి సింహాసనమును గైకొని లోకభయంకరుఁడై రాజ్యముఁ బరిపాలించుచుండెను. ఆతనిపరిపాలనమున జనులు సౌఖ్యమను మాట నెన్నఁడు నెఱుఁగరు. ఈతఁడు తనచెల్లె లగు దేవకిని-యదువిభుం డైన వసుదేవున కొసంగి మహావైభవముతో వివాహముఁ గావించెను. వివాహానంతరమున వసుదేవుఁడు దేవకిని రథముపైఁ బెట్టుకొని తననెలవునకు బయలుదేఱెను. దేవకీవసుదేవులు ముదంబందఁ గంసుఁ డారథమును గడపుచుండెను. అట్టిసమయమున నాకసమునుండి యశరీరవాణి కంసు నుద్దేశించి "కంసా! సంతోషముతో రథ మిప్పుడు గడపుచుంటివి గాని, ముందు వచ్చుహాని నెఱుంగలేకుంటివి. ఈదేవకి యష్టమగర్భము నిన్ను హరించు" నని పలికెను.

అశరీరవాణిపలుకులకుఁ గంసుఁ డులికిపడి, రథంబునుండి నేలకు లంఘించి, యొఱనుండి ఖడ్గముఁ దీసి, దేవకిశిరోజంబులఁ

బట్టుకొని, తోఁబుట్టువని తలంపక చంపఁ దలంచెను. కంసుని క్రోధాటోపమును గాంచి దేవకి శరీరము కంపమెత్తుచుండెను. అప్పుడు వాని నెట్లయిన శాంతచిత్తునిఁ జేయుటకు వసుదేవుఁ డిట్లు పలికెను. "భోజేశ్వరా! ఈమె నీకుఁ జెల్లెలు. అట్టిదానిని- మిన్ను మ్రోఁతలు నిజంబని చంపసాహసించితివా! చాలుఁజాలు. కోప ముడుగుము.

"మ. చెలియల్ గన్నియ ముద్దరాలబల నీ♦ సేమంబ చింతించు, నిర్మలు దీనిఁ బయలాడుమాటలకునై ♦ మర్యాదఁ బోఁదట్టి స త్కులజాతుండవు పుణ్యమూర్తి వకటా♦ కోపంబు పాపంబు నెచ్చెలి నోహో తెగ వ్రేయఁ బాడియగునే ♦ చింతింపు [భోజేశ్వరా."

ఎవ్వరికైనను మృత్యు వెప్పటికైనఁ దప్పదు. మానవుఁడు పురాకృతకర్మంబుల ననుసరించి మేలుగీడులను బొందు చుండును. పరులను హింసించినందువలనఁ దనకు సంప్రాప్తింప నున్న కీడు తప్పదు. ఈమె నీకు వావికిఁ జెల్లెలైనను గూఁతురు వంటిది. ఉత్తమురాలు. నీయడిదముఁ జూచి మిగుల బెగడు చున్నది. ఈమెయెడలఁ గరుణవహించి రక్షింపుము." అని పలికి బతిమాలినను-కంసుఁడు కోపము విడువక పోవుటచే వసుదేవుఁ డుఁ శంతరంగమున "ఈమెకు జనించుపుత్రుల నెప్పటి కప్పుడు తెచ్చియిచ్చుచుందునని చెప్పి యీపన్నురాలైన యికాంతను రక్షించుట తగినది. కొడుకులు పుట్టి నప్పుడు

భగవంతుఁడు మఱియొకయుపాయముఁ జూపకయుండునా ! ఇదియుంగాక, ఇక్కాంత మునిమిదవచూలుగదా నీనిం దును మాడు నని యశరీరవాణిపలికెంది. ఆపలు కసత్య మేల యగును?" అని తలంచి నెమ్మదిగాఁ గంసునితో దేవకికి జనించిన సుతులను దెచ్చి యర్పించుచుందు" నని పలికి, యతనిని సమ్మతింపఁజేసి, భార్యంగొని నిజనివాసమునకుఁ జనెను.

కాలక్రమమున దేవకికి జనించుచున్న కుమారులను సత్యవాక్యబద్ధుఁడగువసుదేవుఁడు కంసునకుఁ దెచ్చి యప్ప గించుచుండెను. కంసుఁడు వసుదేవుని సత్యమునకు సంతసించి, యాకొమరులవలనఁ దనకు హానిలే దని పలుకుచు మరల నిచ్చి వేయుచుండెను. ఇట్లుండ నారదుం డొకనాఁడు, కంసునికడకు వచ్చి మందయం దున్న నందాదులును వసుదేవాదియాదవులును సురలు గాని నరులు గారనియుఁ, గాలనేమి యనురక్కసుఁడే కంసుఁడై జన్మించె ననియు, దుష్టులసంహారింప శ్రీహరి దేవకిగర్భంబున జన్మించు ననియుఁ జెప్పి యరిగెను. అంతటఁ గంసుఁడు మిగులఁ గలఁతఁజెంది, యింతవఱకు దేవకి గన్న యార్వురపుత్రులను జంపి, దేవకీవసుదేవులను గారాగారంబున బంధించెను. దేవకి యేడవగర్భము ధరించెను. శ్రీహరియాజ్ఞ ననుసరించి యోగమాయ దేవకిగర్భమును దిగిచి, నందగోకు లమం దున్నవసుదేవుని పెద్దభార్య యగురోహిణిగర్భమునఁ బ్రవేశ పెట్టెను. రోహిణికి బలరాముఁ డనుకొడుకు పుట్టెను. దేవకి యష్టమగర్భమున సర్వాత్ముం డగుశ్రీహరి జనించెను.

ఆకుమారుని యద్వితీయతేజంబుఁ జూచి దేవకీదేవి యాతని నుద్దేశించి

"శా. మింటన్ మ్రోసిన మ్రోఁత దాలిమిని లో ♦ మేండ్రింప [ముగ నీవు నా
యింటం బుట్టెద వంచుఁ గంసుఁడు దోడిక ♦ హింసించె [నీయన్నలం
గంటం గూరుకుఁ దేఁడు నీయుదయ మీ ♦ కారాజనుల్ [సెప్పఁగా
బంటింపం డెదురేఁగుదెంచు వడి నీ♦కై నేఁడు సన్నద్ధుఁడై."

యని పలికి, యద్దేవదేవు ననేకవిధంబులఁ బ్రస్తుతించెను. దేవకీదేవి కుమారుని గన్నసమయముననే గోకులంబున నందుని భార్య యగుయశోద యాఁడుశిశువుం గాంచెను. భగవంతుని యాజ్ఞ ననుసరించి, యాయర్ధనిశియందు వసుదేవుఁడు దేవకి గన్న కుమారుని దీసికొని పోయి, యశోద ప్రక్కఁ బరుండఁ బెట్టి, యాయశోదగన్న యాఁడుబిడ్డను దెచ్చి దేవకియొద్దఁ జేర్చెను. ఇట్లు చేయుట యశోద యెఱుంగదు. ఆమె భగవన్మాయచే నొడలు తెలియక యుండెను.

"దేవకి యొద్ద నున్నశిశు వేడ్చినయంతనే కావలివారు కంసునికడకుఁ బోయి దేవకి నీళ్లాడె నని చెప్పిరి. అంతఁ గంసుఁడు ఖడ్గధరుఁడై కమనీయంబున వచ్చి, పురుటిల్లు సొచ్చి, యాపాపం జంపఁబోవ, దేవకి యడ్డమువచ్చి

"ఉ. అన్న శమింపు మన్న తగ ♦ దల్లుఁడు గాఁ డిది మేనకోడ లౌ
మన్నన సేయుమన్న విను ♦ మానినిఁ జంపుట రాచపాడి గా
దన్న సుకీర్తివై మనఁగ ♦ దన్న మహాత్ములు పోవుత్రోవఁ బో
వన్న భవత్సహోదరిఁగ ♦ దన్న నినున్ శరణంబు వేఁడెదన్."

ఇంతవఱకు నార్గురుకొడుకులఁ జంపితివి. పుత్రుఁడైనఁ గదా నీకు శత్రుఁ డగునని వింటివి. పుత్రీదాన మొసఁ జేయు." మని బదిమాలెను. కంసుఁ డామెవాక్యంబుల వినక, సాహసించి, యాపాపను బైకెగురవైచి ఖడ్గముం బట్టెను. ఆశిశువు నేలం బడక దివ్యశక్తిస్వరూపము దాల్చి, యాకసంబున నిలిచి, కంసున కిట్లు పలికెను.

"ఉ. తెంపరివై పొరింబొరిని ♦ దేవకిబిడ్డలఁ జిన్నికుఱ్ఱలం
జంపితి వంతనైన నుప ♦ శాంతి వహింపక ఱాలమీఁద నొ
ప్పించితి విప్పుడో యిదియు ♦ బీరమె నాసరసన్ జనించినిన్
జంపెడివీరుఁ డొక్కెడను ♦ సత్కృతి నొందెడువాఁడు
[దుర్మతీ."

అనిపలికి యదృశ్య మయ్యెను.

అక్కడ గోకులంబున యశోదకు నందనుఁడు గలిగె నని యందఱు నానందించిరి. నందుండు కుమారోదయమునకు మహోత్సాహంబంది, భూసురుల కనేకగోవుల దానము లిచ్చెను. గర్గమునీంద్రుఁ డాబాలునకుఁ గృష్ణుఁ డను పేరు వెట్టెను.

## 24. [కంసవధ.]

—:o:—

గోకులంబున బలరామకృష్ణులు దినదినాభివృద్ధి నందుచు నందయశోదలకును రోహిణికిని, దక్కిన గోపగోపిజనంబులకును నపరిమితానందమును గూర్చుచుండిరి. శ్రీకృష్ణుని బాల్యక్రీడ లన్నియు వారి కత్యద్భుతముగనే యుండెను. కృష్ణుఁడు బాల్యమునందే తన్నుఁ జంపవచ్చి కంసానుచరు లగురక్కసులఁ బెక్కండ్ర నుక్కడఁగించెను. కంసుఁడు నారదునివలన బృందావనంబున నున్నబలరాముఁడు రోహిణికొడు కనియు, కృష్ణుఁడు దేవకీసుతుఁ డనియు విని, వసుదేవుఁడు తన్ను మోసపుచ్చె నని కోపాయత్తచిత్తుఁడై యాతనిని జంపఁబోయెను. కాని నారదునిచే వారింపఁబడి, దేవకీవసుదేవులను లోహపాశబద్ధులఁ జేసెను. ఆతఁ డేవిధముగా నైన బలరామకృష్ణులను వధింప నిశ్చయించి, యందులకై వారు తనకడకు వచ్చుటకు ధనుర్యాగమహోత్సవ మను నెపముఁ గల్పించి, యదుశ్రేష్ఠుఁ డగునక్రూరుని రావించి వానితో నిట్లు పలికెను. “అక్రూరా! నందగోకులంబున బలరామకృష్ణులు మద్వినాశక్రీడారతులై చరించుచున్నా రట. నాకు భీతిల్లి దేవతలు శ్రీహరిని వేఁడఁగా నాతఁడు దేవకికిఁ గృష్ణుఁడై జనించినవాఁడని వింటిని. కావున నీవు బృందావనంబునకుఁ బోయి యాబలరామకృష్ణులను ధనుర్యాగమహోత్సవముఁ జూచుట కిటకుఁ

దోడ్కొనిరమ్ము. అట్లు దోడ్కొనివత్తువేని వారి నిచ్చట నెట్లయిన మట్టు వెట్టుదును. వైరిజనులను వృద్ధిఁబొందనీయ రాదు."

అక్రూరుం డందులకు సమ్మతించి రథం బెక్కి బయలు దేఱెను. ఆతని కీరూపముగా నైన శ్రీకృష్ణదివ్యమంగళ విగ్రహసందర్శనము లభించు నని సంతోషించుచుఁ జిత్తంబున నిట్లు దలంచెను.

ఉ. ఎట్టితపంబు సేయఁబడెఁ ♦ నెట్టిచరిత్రము లబ్ధమయ్యెనో
యెట్టిధనంబు లర్థులకు ♦ నీఁబడెనో తొలిబామునందు నా
యట్టివివేకహీనునకు ♦ నాదిమునీంద్రులు యోగదృష్టులం
బట్టఁగ లేనియీశ్వరుని ♦ బ్రహ్మమయున్ హరిఁ జూడఁ [గల్గెడిన్

ఉ. సూరులు తొల్లి యేవిభుని ♦ శోభితపాదనఖప్రభావళిం
జేరి భవాంధకారములఁ ♦ జిక్కఁగ దాఁటుదు రట్టిదేవరన్
వైరముతోడ నైనఁ బిలు♦ వన్ననుఁబంచి శుభంబుసేసె ని
ష్కారణ మైనప్రేమ నిదె♦ కంసునిబోలుసఖుండు గల్గునే."

"మ. ఇతఁ డా కంసునిచేతఁ బంపుపడినన్ ♦ హింసింపనే తెంచినా
డతిదుష్టుం డని చూచునో సకలభూ♦ తాంతర్బహిర్మధ్యసం
గతుఁ డౌటం దలపోసి నన్ను సుజనుం♦గాఁ జూచునో యెట్టి
యున్నతిఁ గావించునో యేక్రియం బలుకునో♦ నాభాగ్య
[మెట్లున్నదో."

ఇట్లు తలంచుచు సంధ్యాసమయంబునకు బృందావనంబుఁ బ్రవేశించి, నందునిగృహంబుఁ జొచ్చి బలరామకృష్ణులఁ జూచి తత్పాదంబులకు నమస్కరించెను. కృష్ణుఁడు తనచక్రాంకితహస్తములతో నక్రూరుని గౌఁగిలించుకొని బహువిధంబుల గౌరవించి కుశలప్రశ్నానంతరమున నిట్లు పలికెను. "అక్రూరా! నీ విక్కడ కరుదెంచు నని విని, మాతలిదండ్రులు నీతో నేమైనఁ జెప్పలేదుకదా! నాజననంబుచే వారు మిగులఁ గష్టముల ననుభవించుచుండిరి. నీ వేమికారణంబున నియ్యెడ కరుదెంచితివి?" అని యడిగిన విని యక్రూరుఁడు తన్నుఁ గంసుఁడు పుత్తెంచినకారణము కృష్ణున కెఱింగించెను. కంసునిమస్తంత్రమునకు బలరామకృష్ణులు నవ్విరి. కృష్ణుఁడు నందాదిగోపకులఁ గాంచి "కంసుని ధనుర్యాగమహోత్సవము జూడఁ బోవలయును గావునఁ బెరుఁగు నెయ్యి మొదలగునవి కానుకగా నిచ్చుటకు సిద్ధపఱచి ప్రయాణసంసిద్ధు లగుఁడు" అని పలికెను. ఆమఱునాఁడు సూర్యోదయమున నందాదిగోపకులు వెనువెంటరా బలరామకృష్ణు లక్రూరచోదితం బైనరథం బెక్కి మధురకు బయలుదేఱిరి. బలరామకృష్ణు లిట్లు వచ్చుచు మార్గమధ్యమునఁ గాళిందీనదిం జూచి, దప్పిఁ దీర్చుకొనుటకు రథము దిగి నీరుత్రావి మరల రథమెక్కిరి. అక్రూరుఁడు గూడ నీరంబులను గ్రోలుటకు నదియందుఁ జొచ్చెను. జలపానము సేయుచుండఁగా నాతనికి నీటియందు బలరామకృష్ణులు గానిపించిరి. అందుల కచ్చెరువందుచు రథమువంకఁ జూచెను.

ఆమహానుభావులు రథమునందే యుండిరి. అక్రూరుఁడు రథం బెక్కి భగవంతుఁడైన కృష్ణు ననేకవిధముల స్తుతించెను.

సంధ్యాసమయమునకు వారు మధురాపురముం జేరిరి. అక్రూరుఁడు బలరామకృష్ణులను దనయింటికి విచ్చేయుఁడని ప్రార్థించెను. అందుకుఁ గృష్ణుఁడు "కంసుని జంపినపిమ్మట వచ్చెద" మని ప్రత్యుత్తరము చెప్పి యక్రూరుని బంపివేసి, యనుచరులతోఁ బురసౌందర్యముం జూడ బయలుదేరెను. ఆసమయమున నొకరజకుఁడు కంసునివస్త్రంబులను గోటలోనికిఁ దీసికొని పోవుచుండెను. కృష్ణుఁడు వానిని దనయనుచరులకు ధరించుకొనుట కిమ్మని యడుగ వాఁ డనేకదుర్భాష లాడి, యాతనిచే నేలఁ గూలెను. సుదాముం డనుమాలాకరుఁడు బలరామకృష్ణులను బెక్కువిధంబులఁ బూజించి, తాంబూలకుసుమగంధంబు లొసంగి ధన్యుఁడయ్యె. కుబ్జ యనుకంసదాసి కృష్ణుని గంధమిచ్చి పూజించి కృతార్థురాలయ్యెను. తరువాతఁ గృష్ణుఁడు బలరామసహితుఁడై ధనుశ్శాలం బ్రవేశించి, యచ్చట గుప్తముగా నుంచిన మహాధనువు నొకదానిం జూచి,

శా. బంధుల్ మేలన వామహస్తమునఁ జా ♦ పం బెత్తి మౌర్వీలతా
సంధానం బొనరించి కొంచెపుఁ దెగన్ ♦ శబ్దించుచున్ ధీరతా
సింధుం డాహరి దాని ఖండితముగాఁ ♦ జేసెన్ జనుల్ [చూడఁగా
గంధేభంబు రసాలదండము నొగిన్ ♦ ఖండించుచం [దంబునన్.

ఆశబ్దము విని కావలివారలరుదెంచి క్రుద్ధులై కృష్ణుని గవయ నాతఁడు వారిని మడియించెను. పిదప బలరామకృష్ణులు నందాదు లయినగోపకులతోఁ దమవిడిదలకుఁ జని యారేయి సుఖముగాఁ గడిపిరి.

కృష్ణుని పరాక్రమచర్య లన్నియు వినినకంసున కారాత్రి నిదురయే పట్టలేదు. కన్నుతెఱచినను మూసినను నాతనికిఁ గృష్ణుఁడే కనిపించుచుండెను. ఎట్లో యాతఁడు రాత్రి గడపెను. ఆనాఁడే ధనుర్యాగమహోత్సవము. మల్లరంగ మనేకచిత్రగతుల నలంకరింపఁబడెను. ఆమహోత్సవమున్ జూచుటకు వచ్చినవారికిఁ దగినయాసనంబు లేర్పాటు చేయఁబడెను. మల్లరంగమునకు సమీపముగాఁ గంసుఁడున్నత పీఠంబున నాసీనుఁడై యుండెను. నందాదు లయినగోపకులు కంసుని దర్శించి కానుక లర్పించి, వరుసగా నాసనంబుల నధిష్ఠించియుండిరి.

అంత బలరామకృష్ణులు రంగద్వారమునకు వచ్చిరి. అంతకుముందే యాజ్ఞాపింపఁబడియున్న కుంజరపాలకుఁడు కువలయాపీడ మనుమదగజమును బలరామకృష్ణులపైకిఁ బోనిచ్చెను. అట్లు సేయవల దని చెప్పినను వినకపోవుటచేఁ గృష్ణుఁ డాకుంజరంబును, దత్పాలకునిగూడ వధించి మల్లరంగమును బ్రవేశించెను. కంసప్రేరేపణంబునఁ జాణూరముష్టికు లను మల్లులు బలరామకృష్ణులను దమతో మల్లయుద్ధమునకుఁ బిలిచిరి. భయంకర మైనమల్లయుద్ధమునఁ గృష్ణుఁడు చాణూ

రుని, బలభద్రుఁడు ముష్టికుని వధించిరి. సభయందు గొప్పకల కలము ప్రారంభ మయ్యెను. కంసునిచిత్తము కలఁత నందెను. ఆతఁడు మంత్రులను జూచి "వల్లవబాలురైన బలరామకృష్ణులను నగరివాకిటికి వెడలఁజేయుఁడు. నందుని బంధింపుఁడు. వసుదేవునిఁ జంపుఁడు" అని పలికెను. అప్పుడు కృష్ణుఁడు పర్వతాగ్రమునుండి సారంగమును వధించుటకు లంఘించు మృగేంద్రునివడువునఁ, గంసునిపైకి లంఘించి, కేశబంధంబును బట్టుకొని, పీఠమునుండి క్రిందకీడ్చి వధించెను.

ఈవిధంబునఁ గృష్ణుఁడు కంసునిసంహరించి, బలరామ సహితుఁడై కారాగృహంబున నున్న తల్లిదండ్రు లగుదేవకీ వసుదేవులం జేరి, వారిని బంధముక్తులఁ జేసి, నమస్కరించి,

"శా. కారాశాలల మానిమిత్తమున మీరుం ♦ గంసుండు [గారింపఁగా
వారింపంగ సమర్థతల్ గలిగియున్ ♦ వారింపఁగారాక ని
ష్ఠారుణ్యాత్ముల మైనక్రూరుల మహా♦ కౌటిల్యసంచారులన్
సారాతీతుకులార మమ్ముఁ గొఱఁతల్ ♦ సైరించి రక్షింపరే."

అనిపలికెను. దేవకీవసుదేవులు కుమారులఁ గౌఁగిలించుకొని యానందబాష్పములు విడిచిరి. తరువాతఁ గృష్ణుఁడు మధురానగరరాజ్యమునకుఁ గంసుని తండ్రియుఁ దనమాతామహుఁడును నగు నుగ్రసేనుని నభిషిక్తునిఁజేసి, నందు విలోకించి, "తండ్రీ! ఇంతవఱకును మేము మాతల్లిదండ్రులను జూడలేదు.

యశోదాదేవియు నీవును మాతల్లిదండ్రు లనిభావించితిమి. నీయనుగ్రహమువలన మే మింతవార మైతిమి. నిన్ను విడనాడి యుండుటకు మాచిత్తము సమ్మతింపదు. కాని, యిక్కడ నున్నబాంధవులకు సౌఖ్యము గూర్చి గోకులంబున కరు దెంతుము," అని పలికె, యాతనికిని, దక్కినగోపకులకును వస్త్రభూషణాదుల నొసంగెను. కృష్ణునివిడిచి వెళ్లవలసివచ్చి నందాలకు బాష్పజలపూరితనయనుండగుచు నందుఁడు తన వారితో వ్రేపల్లెకుఁ జనియెను.

## 25. [కృష్ణజరాసంధులయుద్ధము.]

:o:

కంసునిభార్య లరిగి తమతండ్రియు, మగధనాథుఁడు నగుజరాసంధునితోఁ గృష్ణుఁడు తమనాథుని వధించె నని చెప్పిరి. జరాసంధుఁడు సామాన్యుఁడు గాఁడు. మహాబలపరాక్రమ సంపన్నుఁడు. భూమండలంబున నున్నరాజు లెల్లరును నాతనికి భయ మందుచుందురు. కృష్ణుఁడు, తనయల్లునిఁ జంపె నని వినినయంతనే యాజరాసంధుఁడుఁ బ్రళయకాలరుద్రునిలీల మండిపడుచుఁ బుత్రికలం గాంచి"

"శా. ఏమీ కంసునిఁ గృష్ణుఁడే రణములో • హింసించెనో (చెల్ల నా

సామర్థ్యంబుఁ దలంపఁ డించుకయు మ•చ్చండప్రతాపానలో

ద్రామార్చుల్ వడి నేఁడు గాల్చు యదుసం ♦ తానాట (ప్రీవాటికన్
భూమిం గ్రుంగిన మింటదాఁగిన మహాం ♦ భోరాశిలోఁ (జొచ్చినన్."

"క. యాదవవిరహిత యగుఁ బో
మేదిని నాచేత నేఁడు ♦ మీఁదుమిగిలి సం
పాదితబలులై హరిరు
ద్రాములు నింద్రాదు లెవ్వ ♦ రడ్డం బైనన్."

అని పలికి, సైన్యంబులఁ గూర్చుకొని వచ్చి కృష్ణబాహుదండ పరిరక్షితం బైన మధురానగరంబును ముట్టడించి చుట్టును విడిసి యుండెను.

ఇట్లు మహాసైన్యముతో వచ్చియున్న జరాసంధునిఁ గూర్చి శ్రీహరి తనమనంబున "మాగధుఁడు సేనలతో వచ్చి పురంబును ముట్టడించినాఁడు. వీనియెడల సామదానములు పనికి రావు. దండవిధినే ప్రయోగించి భూభారము నుడుపఁజెల్లును. భూభారము నుడుపుటకే గదా నే నవతరించితిని. ఇఁక నకార్యంబునకుఁ బ్రారంభింతు" నని తలంచుచుండెను. అట్టిసమయమున, వివిధబాణబాణాసనచక్రాద్యాయుధోపేతము లయిన రెండురథములు నభంబునుండి దైవయోగమున నతనికడకు వచ్చెను. కృష్ణుఁడు వానిం జూచి ముదంబంది బలరామున కెఱింగించి యతనితోఁగూడ సమరసన్నాహంబునఁ బురంబు వెడలివచ్చి

శాత్రవులు తల్లడిల్లఁ బాంచజన్యము నొత్తెను. అప్పుడు జరాసంధుఁడు కృష్ణునిఁ గాంచి పరిహసించుచు నిట్లు పలికెను. "గోపాలా! ఇచ్చట నీవు గాయుటకు నాలమందలు లేవు. చరణహతిం గూల్చుటకుఁ బ్రాతబండ్లు లేవు. ప్రియవాక్యము లాడుట కాభీరులు లేరు. మురియుచు సంచరించుట కియ్యది బృందావనము గాదు. ఈజరాసంధునితోఁ బోరుట, తరుణిని జంపుటయు, బకని గెడపుటయు, వృషములఁ గూల్చుటయు, సర్పమును ద్రొక్కుటయు, గిరి హస్తమున నెత్తుటయు, వనితలంచితివి కాఁబోలు! మదీయదుర్వారతీవ్రబాణాగ్ని కోర్వఁగలవే!" అని నగధరుం డిట్లనియెను. "మాగధా! శూరులు మగటిమిఁ జూపుదురు గాని నీవలెఁ బొగడు కొనరు. బిరుసు లాడుట బంటుతనంబు గాదు. మాటలేల! కల్పాంతమహోగ్రపావకుని నైనను హరింతును.

"క. గోపాలుఁడ నని పలికితి
భూపాలక దీని నేమి ♦ పోరాడంగా
గోపాలమహీపాల
వ్యాపారాంతరము దెలియ ♦ వచ్చుం బిదపన్."

ఇట్లు పలికి యాగోవిందుఁడు బలరామసహితుఁడై జరాసంధుని బలంబులఁ దాకి, తీవ్రాస్త్రంబులు గప్పదొడంగెను. బలరాముఁడు వైరిసేనామధ్యమునఁ జండమార్తాండుని లీల విహరించుచు హలముచే శాత్రవులను మర్దించుచుండెను. బల

రామకృష్ణుల పరాక్రమమును సహింపలేక జరాసంధుని బలంబులు విఱిగి వెన్నిచ్చెను. అట్టిసమయమున బలోద్దాముం డగు బలరాముఁడు రథంబు నగ్గఁజేసి, భుజవీర్యసింధుం డగుజరాసంధుని బట్టుకొని, సోల్లుంఠము లాడుచు, ముష్టిచే మొత్తుచుండ కృష్ణుఁడు వచ్చి, యాతనిని వారించి, పగఱకుఁ జిక్కి తిని గదా యని విచారించుచున్న జరాసంధుని విలోకించి,

"శా. దుఃఖింపం బనిలేదు పొమ్ము బలసం ♦ దోహంబులం (దెమ్ము, చే
తఃఖేదం బెడలంగ రమ్ము,రిపులం ♦ దండింపు కాదేని భూ
స్వఃఖేలజ్జన మెల్ల మెచ్చ నృప నీ ♦ శౌర్యోన్నతుల్ (చూపి మే
దఃఖండంబులు భూతముల్ దినఁ దను ♦ త్యాగంబు (సేయందగున్."

అని పలికి విడిచిపుచ్చెను. జరాసంధుఁడు సిగ్గుపడుచు, బలాయితు లైనవీరుల వెంటఁబెట్టుకొని మగధఁ జేరెను.

---

## 26. [ముచికుందుఁడు.]

———:o:———

జరాసంధుఁడు బలరామకృష్ణులవలన నట్లుపరాభవింపఁబడి, నిజపురంబునకు మరలిపోయె ననుమాటయే గాని,

యాతఁడు కృష్ణునిపై నెట్లయినఁ బగఁ దీర్చుకొనఁ దలంచుచునే యుండెను. ఆతఁడు పదునేడుసారులు మధురాపురముపై దాడి వెడలి యాదవులతో యుద్ధములు చేసి, నిర్మూలితబలుం డయ్యెను. మరల సప్తాదశయుద్ధమునకుఁ బ్రయత్నము సేయుచుండెను.

అట్టిసమయమునఁ గలహవిద్యావిశారదుం డగునారదుఁడు కాలయవనునికడకుఁ బోయి "యవనా! నీవు భూమండలంబునఁ గలసమస్తభూపతులను జయించితి గాని యాదవులను గెల్వవైతివి. ఈసంగతిని మఱచితివా! లేక వారికి వెఱచితివా! యాదవకులమణి యగుకృష్ణుఁడు జరాసంధాదులను భయంకర సంగ్రామతలంబునందు గెలిచె నన్నసంగతి నీవు వినలేదా!" యని పలికెను. ఆమాటలు విని కాలయవనుఁడు "నారదా! నీవు చెప్పిన కృష్ణుం డెట్టివాఁడు? ఎచ్చట నుండును? వాని బలం బెట్టిది? నాశౌర్యంబును భరించి సంగరక్షోణిని నిలువఁ గలఁడే" యని యడిగెను. అందులకు నారదుఁడు కృష్ణునిబలపరాక్రమాదిలక్షణంబులను సవిస్తరముగా నాతనికి వినిపించెను. అంతట యవనుఁడు సైన్యంబులతో వెడలి మధురాపురముమీఁద విడిసెను. కాలయవనునిదాడిఁ జూచి కృష్ణుఁడు తనమనంబులో "యవనుఁడు పురంబెల్ల నావరించినాఁడు. నేఁడో రేపటనో మాగధుఁడు గూడ సైన్యములతో నిటకు వచ్చునని వినియుంటిని. వీరిరువురును గలిసి రేని పోరుట మిగులఁ గష్టముగ నుండును," అని యాలోచించి, విశ్వకర్మ

నిర్మితం బగు ద్వారకానగరంబునకు నిజయోగప్రభావంబున మధురాపురంబున నున్న జనంబులను ధనధాన్యంబులను జేర్చి, నిరాయుధుఁడై యొక్కఁడును గాలయవనున కభిముఖముగాఁ బోయెను. కాలయవనుఁ డాతనిని కృష్ణునిగా నెఱింగి, కమలసంభవాదుల కైనను బట్టువడని యామహాత్ముని బట్టుటకు వెంటనంటెను. ముకుందుఁడు వానికి భీతిల్లుచున్నట్లు నటించుచుండెను. అతఁడు తన్నుఁ జూచి నిజముగా భయమందుచుండె నని తలంచి యవనుఁ డిట్లు పలికెను. "కృష్ణా! ఇట్లు పాఱిపోయెదవేల ? కదనంబునఁ గంసాదుల జయించిన వీరాగ్రేసరుఁడ వని విని రణాతిథ్యము గోరి వచ్చితిని. అట్టిచో నీవు వెన్నిచ్చిపోయినచో రాజులు నవ్వరా! నేను శరప్రయోగమైనను జేయుటలేదు. నీవేల పరుగిడెదవు? ఇట్టివాఁడవు నీవు వాతాశితోడను, కేశితోడను, మల్లులతోడను, కంసునితోడను, జరాసుతునితోడను నెట్లుపోరాడితివి?" అట్లుపలుకుచు, ముందు పరుగెత్తుచున్న వాసుదేవునిం బట్టుటకు వెంటనంటెను. కృష్ణుఁడు యవనుని గడుదూరము దీసికొనిపోయి, యొకశైలగుహం బ్రవేశించెను. కృష్ణుఁ డికఁ దనకుఁ జిక్కె నని తలంచి యవనుఁడు గూడ నాగిరిగహ్వరంబును బ్రవేశించెను. ఆగుహాయందొక మహాపురుషుఁడు గుఱ్ఱువెట్టుచు నిద్రించుచుండెను. తన్నింత వఱకుఁ దెచ్చి మాఱువేషమునఁ గృష్ణుఁడే యట్లు నిద్రించుచుండినట్లు నటించుచుండె నని తలంచి యవనుఁడు వానిం గాంచి,

"ఉ. ఆలము సేయలేక పురు • షాఘమ దుర్లభకంటకద్రుమా
భీలమహాశిలాసహిత • భీకరకుంజరఖడ్గసింహశా
ర్దూలతరక్షుసంకలిత • దుర్గపథంబునఁ బాఱుతెంచి యీ
శైలగహాన్ సనిద్రుక్రియఁ • జాఁగి నటించినఁ బోవనిత్తునే."

నీ వెవ్వనికిని జిక్కవని నారదుఁడు చెప్పినాఁడు. ఇప్పుడు నాకుఁ జిక్కితివి? ఇఁక నెక్కడికిఁ బోవఁగలవు?" అనిపలికి, తన పాద మెత్తి యానిద్రించుచున్న పురుషునిఁ దన్నెను. వెంటనే యప్పురుషుఁడు లేచి, కన్నులు తెరచి, కోపదృష్టిం బ్రసరించిన యంతనే యవనుఁడు తత్కోపానలంబున భస్మమయ్యెను.

ఈపురుషుఁడు ముచికుందుఁ డనురాజు. ఇక్ష్వాకుకుల సంభవుఁడు. మాంధాతకుమారుఁడు. రాక్షసభీతులైన దేవతల నాతఁడు చిరకాలము రక్షించుటచే వా రాతని నొకవరము గోరుకొనుమనిరి. అందుల కాతఁడు నిద్రంగోరెను. ఆకారణమున దేవదత్తనిద్రావశుండై శైలగుహాయందు శయనించియుండెను. కాలయవనుఁడు సమసినపిదప వాసుదేవుఁ డాతనిముందు నిల్చెను. ముచికుందుఁ డా మహాత్మునియద్వితీయతేజంబుఁ గాంచి యాశ్చర్యమునంది,

"మ. శశివో యింద్రుఁడవో విభావసుఁడవో • చండప్రభా (రాశివో
శశిచూడామణివో పితామహుఁడవో • చక్రాంక (హస్తుండవో

దిశలున్ భూమియు మిన్ను నిండె నిదె నీ ♦ తేజంబుఁ
(జూడం గదు
ర్వాశమై యెవ్వఁడ వేలవచ్చి తిచటన్ ♦ వర్తించె
(దేకాకివై."

మహానుభావా ! నేను ముచికుందుఁడను. దేవదత్తనిద్రావశుం డనై యుండ, నెవ్వఁడో యొకమానవుఁడు నన్నుఁ దన్ని భస్మమైనాఁడు. పిదప శ్రీమన్నారాయణస్వరూపుండ వగునిన్నుఁ జూచితిని. నీ వెవ్వరవో నేనెఱుంగ నర్హుఁడనేని గృపాంతరంగుఁడవై వినిపింపు," మని పలికెను.

అందులకుఁ గృష్ణుం డిట్లు పలికెను. "ముచికుందా ! నాగుణజన్మకర్మనామము లెవ్వరును నెన్నఁజాలరు. ఇంతయేల నేనే చెప్పఁజాలను. దుష్టుల శిక్షించి, ధర్మసంస్థాపనముఁ జేయుటకు బ్రహ్మచేఁ బ్రార్థితుఁడనై, యాదవకులంబున వసుదేవుని సూనుఁడనై యవతరించి కంసాదులఁ గూల్చితిని. ఇప్పుడు నీకోపానలంబున భస్మమైనవాఁడు కాలయవనుఁడు. ని న్నను గ్రహించుటకే యీశైలగుహకు వచ్చితి. నీకుఁ గావలసిన వరము గోరుము."

అనిన ముచికుందుఁడు శ్రీకృష్ణుని పాదములకు నమస్కరించి, యనేకవిధంబుల స్తుతించి యిట్లు పలికెను.

సీ. సంసారి వైయున్న ♦ జనునకు నీశ్వర
నీకృప యెప్పుడు ♦ నెరతాఁ గల్గు

నెప్పుడు బంధంబు ♦ లన్నియుఁ దెగిపోవు
బందమోక్షంబైనఁ ♦ బ్రాప్త మగును
సత్సంగమంబు స ♦ త్సంగమంబున నీదు
భక్తి సిద్ధించు నీ ♦ భక్తివలన
నన్ముక్తి యగు నాకు ♦ సత్సంగమముకంటె
మును రాజ్యబంధని ♦ ర్మూలనంబు
తే. గలిగినది దేవ నీయను ♦ గ్రహము గాదె
కృష్ణ నీసేవ గాని త ♦ క్కినవి వలదు
ముక్తిసంధాయి వగునిన్ను ♦ ముట్టఁ గొలిచి
యాత్మబంధంబుఁ గోరునే ♦ యార్యుఁ డెందు."

అనినఁ గృష్ణుం డాతనికి ముందు జన్మంబున దివ్య పదంబు నొందఁ గలవని చెప్పి యరిగెను. ముచికుందుఁడు శైలగృహ వెడలి వచ్చి, బదరికాశ్రమంబునకుఁ దపమునకై పోయెను.

కృష్ణుఁడు మధురకు వచ్చి బలరామసహితుఁడై యవనుని సైన్యము నెల్ల మడియించెను.

## 27. [రుక్మిణీకల్యాణము.]

విదర్భదేశమునఁ గుండిననగరంబునకు భీష్మకుం డనువాఁ డేలికయై యుండెను. ఆతనికేవురుకుమారులును నొక్క

పుత్త్రికయుఁ గలదు. ఆపుత్త్రికామణియే రుక్మిణి. సహజ సౌందర్యవతి యగునక్కన్యకాతిలకము, తమగేహమునకు వచ్చుచుండు నతిథిజనులవలనఁ గృష్ణునిరూపబలగుణాదులను విని యాతఁడే తనకుఁ దగినవరుం డని తలంచియుండెను. కృష్ణుఁడు గూడ రుక్మిణిసౌందర్యగుణములు విని యామె నిల్లాలుగఁ జేకొనఁదలఁచి యుండెను.

భీష్మకుఁడు రుక్మిణినిఁ గృష్ణున కిచ్చి వివాహము సేయఁదలఁచి యుండఁగా, నాతనిజ్యేష్ఠపుత్త్రుఁ డగురుక్మి యందుల కడ్డుపెట్టి, చేదిపురాధీశ్వరుం డగుశిశుపాలున కిచ్చెద నని లగ్ననిశ్చయ మొనర్చి, యావృత్తాంతము శిశుపాలున కెఱింగించెను. ఇందులకు రుక్మిణి మిగుల విచారించి, తనకు నమ్మకము గలయగ్నిద్యోతనుఁ డనుభూసురుని రావించి యిట్లు పలికెను. "బ్రాహ్మణోత్తమా! కృష్ణునిఁ గైకొనఁ దలఁచి యున్న నన్ను మాయన్న శిశుపాలున కీయఁదలఁచి నాఁడు. నే నెంత బదిమాలినను బ్రయోజనము లేదు. ఆతఁడు నాతండ్రి చెప్పినను వినక యున్నాఁడు. కావున నీవు నాయందుఁ గరుణవహించి ద్వారకాపురంబున కరిగి శ్రీహరిం గాంచి యీవృత్తాంత మెఱింగించి, యాతఁ డిక్కడకు వచ్చు నట్లు చేయవలయును." ఇట్లు చెప్పి కృష్ణునితో నాబ్రాహ్మణుఁడు చెప్పవలసినవాక్యములు గూడఁ జెప్పెను.

అగ్నిద్యోతనుఁడు ద్వారకానగరంబున కేగి, కృష్ణుని గాంచి పెండ్లికొడుకవు గమ్మని దీవింప, నమ్మాధవుఁడు వీరం

బునుండి దిగి, భూసురోత్తమునకు భక్తిమీఱ నమస్కరించి, పీఠంబున నాసీనుం జేసి,

"ఉ. ఎవ్వని దేశమం దునికి • యెవ్వనిచేఁ గుశలంబుఁగల్గు మీ
కెవ్వని రాజ్యమందుఁ బ్రజ • లెల్ల సుఖింతురు వాఁడు
[మత్ప్రియుం
డివ్వనరాశిదుర్గముఁ • కెట్లరుదెంచితివయ్య నీవు లే
నవ్వులుగావు నీతలఁపు • నంగల మే లొనరింతు ధీమణీ."

అని పలికెను. అందులకు సబ్బాహ్మణుండాగకుఁడు కృష్ణున కిట్లు పలికెను. "మాధవా ! పదునాల్గుభువనంబులును గుక్షియం దున్ననీకు నారాకకుఁ గారణము తెలియకయుండునా! నాచే వినఁదలఁచి యిట్లడిగితివి. విదర్భదేశాధీశ్వరుఁడైన భీష్మకుని తనూజ యగు రుక్మిణి నిన్ను వివాహ మాడఁగోరి నాచే సందేశముం బంపెను. మంగళకరంబైన యామెసందేశమును సావధానచిత్తుఁడవై యాలింపుము.

"మహానుభావా ! బాల్య మాదిగ నాహృదయము నీయందుఁ జిక్కియున్నది. అట్టిచో నన్ను శిశుపాలున కీయ మాయన్న యగురుక్మి నిశ్చయించినాఁడు. భవత్ప్రతాప మెఱుంగక చైద్యుఁడు నన్నుఁ గొనిపోవనున్నాఁడు.

"ఉ. అంకిలి సెప్పలేదు చతు • రంగబలంబులతోడ నెల్లి యో
పంకజనాభ నీవు శిశు • పాలజరాసుతులన్ జయించి నా

వంకకు వచ్చి రాక్షస ♦ వివాహమునన్ భవదీయశౌర్య మే
యుంకువ సేసి కృష్ణపురు ♦ షోత్తమ చేకొని పొమ్ము
(వచ్చెదన్."

నన్నెట్లు గొనిపోవుదునా యని నీవు సంశయింపఁ బనిలేదు. పెండ్లికి ముందుగా నగరమునకు వెలుపలనున్న దుర్గాదేవిని బూజించుటకు నన్ను మావారు తీసికొని పోవుదురు. ఆసమయమున నీ వచ్చుట వేచియుండి నన్నుఁ గొనిపోవచ్చును. నేను నీయనుగ్రహమునకుఁ బాత్రురాలను గాకుంటినేని నిన్ను స్మరించుచుఁ బ్రాణములు విడిచెదను."

అను నీరుక్మిణిసందేశమును భూసురుం డిట్లు వినిపించి మరలఁ గృష్ణున కిట్లు పలికెను. "కృష్ణా! సందేశంబును వింటివి కదా! ఇఁక నీవు యోజించుచు జాగు సేయవలదు. రేపే వివాహలగ్నము.

"ఉ. ఆమెలనాఁగ నీకుఁ దగు ♦ సంగనకుం దగు దీవు మాయుపా
ధ్యాయులయాన పెండ్లియగుఁ ♦ దప్పదు జాడ్యములేల నీవు నీ
శౌర్యమువారిఁ గూడుకొని ♦ శౌర్యరుహాననఁ దెత్తుఁగాని వి
చ్ఛేయుము శత్రుల న్నుఱుము ♦ సేయుము సేయుము శోభ
[నంబిలన్."

ఈమాటలు విని కృష్ణుఁడు "బ్రాహ్మణోత్తమా! రుక్మిణికి నాపైఁ జిత్త మున్నసంగతియు, రుక్మి యామెను శిశుపాలునకీయఁదలఁచినసంగతియు నెఱుంగుదును. ఇఁక సంశయింప నేల! నేను కుండినసగరంబున కరుదెంచి యక్కన్యం దెచ్చెద.

రిపు లెవ్వ రడ్డంబైనను వ్రచ్చెద" నని పలికి, రథంబు సిద్ధము సేయు మని సారథి యగు దారుకున కాజ్ఞ నిచ్చెను. అంత దారుకుఁడు సైన్యసుగ్రీవమేఘపుష్పవలాహకంబులను హయంబులఁ బూన్చి రథ మాయత్తముచేసి తెచ్చెను. అంతట వాసుదేవుఁ డగ్నిద్యోతనసహితంబుగా దాని నెక్కి యొకరాత్రిలోఁ గుండినపురంబున కేగెను.

కుండిననగరంబునఁ గుమారునకు వశుఁడైనభీష్మకుఁడు రుక్మిణిని శిశుపాలున కిచ్చుటకుఁ బెండ్లి ప్రయత్నము లన్నియుఁ జేసెను. నగరం బెల్ల మహావైభవమున నలంకరింపఁబడెను. కన్యకను గొందు నని సంతోషముతో శిశుపాలుఁడు చతురంగబలసమన్వితుఁడై వచ్చెను. ఆతనికిఁ దోడు జరాసంధదంతవక్త్రసాల్వపౌండ్రకాదులును వచ్చిరి. భీష్మకుఁడు వీరందఱిని సముచితప్రదేశంబులయందు విడియించెను. రుక్మిణిని దెచ్చుటకుఁ గృష్ణుఁ డొక్కఁడే యేగినాఁడనియు, నట్టిసందర్భమునఁ గలహము సంభవించినచో నాతనికిఁ దోడుగావలయు ననియు బలరాముఁడు యాదవసైన్యముతో వచ్చెను.

లగ్నము సమీపించుచుండుటచేఁ గృష్ణుఁడు వచ్చునో లేదో యనియు, భూసురుం డాతనికడకుఁ బోయెనో లేదో యనియు రుక్మిణి పరిపరివిధములఁ జింతించుచుండెను. అట్టి సమయమున నగ్నిద్యోతనుఁ డామెంజేరి కృష్ణుఁడువచ్చెనని తెలిపెను. ఆమాట విని రుక్మిణి యందినయానందమునకు మేర లేదు. ఆమె భూసురునకు నమస్కరించి యి ట్లనెను.

"మ. జలజాతేక్షణు: డోడితెచ్చితివి నా♦సందేశముం జెప్పినన్
నిలువంబెట్టితి నీకృపం బ్రతికితిన్ ♦ నీయంతపుణ్యాత్మకుల్
గలరే దీనికి నీకుఁ బ్రత్యుపకృతిం ♦ గావింపనే నేరఁ గం
జలిగావించెద భూసురాన్వయమణీ♦సద్బంధుచింతామణీ."

తరువాత లగ్నమునకు ముందుగాఁ రుక్మిణిని నగజాతకు మ్రొక్కించుటకుఁ దీసికొనిపోయిరి. రాజులందఱును గూడ దుర్గాలయంబునకేగిరి. చేటీపరివృత యగురుక్మిణి, యాలయంబును బ్రవేశించి గౌరీదేవికి మ్రొక్కి బహువిధంబులఁ బూజించి యీవలకు వచ్చి, తనదృష్టి హరిపైఁ బఱపి నిలిచియుండెను. ఆమెసౌందర్యమును గాంచి రాజులందఱును విభ్రాంతాత్ములై యుండిరి. అట్టిసమయంబునఁ గృష్ణుఁడు నిఖిలభూపాలురును జూచుచుండ, రుక్మిణిం దెచ్చి, రథంబుపై నిడికొని, భూనభోంతరాళమునిండ శంఖముం బూరించి ద్వారకాపురమార్గముంబట్టి చనెను.

ఇది యంతయుఁ జూచి శిశుపాలజరాసంధాదిరాజులు రోషించి, గోపాలదేవుని రథమును వెన్నంటిరి. వీరిరాకం గాంచి భయకంపితచిత్తయైనరుక్మిణిం గాంచి కృష్ణుఁ డిట్లు పలికెను.

"క. చొచ్చెద రిదె యదువీరులు
వ్రచ్చెద రరిసేన నెల్ల ♦ వైరులు పెలుచన్
నొచ్చెదరును విచ్చెదరును
జచ్చెదరును నేఁడు చూడు ♦ జలజాతాక్షీ."

హరిరథంబును సడ్డగించుటకు వచ్చినరాజన్యలోకమును బల
రాముఁడు దాకి సంపూర్తిగఁ బరాభవించెను. రుక్మిణిని
గృష్ణుఁడు దోడ్కొనిపోయె నని విచారించుచున్న శిశుపాలుం
గాంచి జరాసంధాదులు,

"ఆ. బ్రతుకవచ్చు నొడలఁ ♦ బ్రాణంబు లుండిన
బ్రతుకు గలిగెనేని ♦ భార్య గలదు
బ్రతికితేని భార్య ♦ పట్టు దయ్యెడు మేలు
వగవవలదు చైద్య ♦ వలదు వలదు."

అని పలికి యూఱడించిరి. శిశుపాలుఁడు సిగ్గుఁబొందుచుఁ దనపు
రమునకుఁ బోయెను. అనంతరము రుక్మిణియగ్రజుఁ డగు
రుక్మి—కడురయంబునఁ బోయి హరిరథగమనంబు నాఁపి, యాత
నిని విలోకించి "ఓయీ! కృష్ణా! నీ వెందు జన్మించితివి?
ఎక్కడఁ బెరిఁగితివి? మాకన్యం గొనిపోవుటకు నీవు మాసరి
వాఁడవా! నీవు రాజవు గావు. నీహృదయము సకలవిధము
లగుమాయలకును బుట్టినయిల్లు. కొంచెముకాలమున నిలువుము.
తీవ్రశరములపరంపరలచే నీగర్వ మడఁగించెద" నని పలికి, యస్త్ర
ప్రయోగముఁ జేసెను. నగధరుఁ డాయస్త్రంబుల నెల్ల ఖం
డించి, రుక్మినిం బట్టుకొని, యొఱనుండి ఖడ్గము దీసి తచ్ఛిరము
ఖండింపఁబోవ రుక్మిణి యమ్మహాత్ముని చేయిఁబట్టుకొని, "దేవా!
నీమహామహిమ నెఱుంగఁజాలక యీతఁ డపరాధము గావిం
చినాఁడు. ఈతనిని క్షమింపుము. నీ వీతనిఁ గూల్చితివేని,

కృష్ణుఁ డల్లుఁ డయ్యెనుగదా యని సంతసించు మాతల్లిదండ్రులకుఁ బుత్రశోకము గల్గును.” అని వేఁడుకొనెను. ఆమె మాటలు విని కృష్ణుఁ డాతనిం జంపక నగుచు బావా రమ్మని పిలిచి బంధించి, గడ్డమును మీసమును దలయును రేవులువాఱఁ గొఱిగి విరూపిం గావించి విడిచిపెట్టెను. అనంతరము కృష్ణుఁడు రుక్మిణీసహితుఁడై, బలరామాదులు వెంటరా ద్వారకానగరంబునఁ బ్రవేశించెను. ఈవిధమున శ్రీకృష్ణుఁడు రుక్మిణిం దెచ్చి మహావైభవమున వివాహమాడెను.

---

## 23. [శమంతకమణి.]

—:o:—

ద్వారకానగరంబున సత్రాజిత్తను వాఁడు సూర్యునారాధింప, నద్దేవుఁ డాతనిభక్తికి మెచ్చి, శమంతక మనుమణి నొకదాని నొసంగెను. అమ్మణి దినముల కెనిమిది బారువుల హేమము నొసంగుచుండును. ఏదో సందర్భమున నొకదినంబునఁ గృష్ణుఁడు సత్రాజితుని గృహంబున కేగి యామణిని దన కిమ్మని పరిహాసముగా నడిగెను. సత్రాజితుఁ డందులకు నిరాకరించెను.

మఱి కొన్నాళ్ల కొకనాఁడు సత్రాజితుని తమ్ముఁడగు ప్రసేనుఁ డాశమంతకమణినిఁ గంఠమున ధరించుకొని మృగ

యీవ్యాజమున నరణ్యమున కేగెను. ఆయరణ్యమున నొకసింహ మాప్రసేనునిం జంపి, యామణిఁ గొనిపోవుచుండఁగా జాంబవంతుఁ డామృగేంద్రుని వధించి, యామణిఁగైకొని పోయి తన కూఁతునకుఁ గేళికందుకముగాఁ జేసెను. సంధ్యాసమయంబునకుఁ బ్రసేనుఁ డింటికి రాకపోవుటచే సత్రాజితుఁ డాతనికై వెదకించెను. ఆతనిజాడ యెక్కడను గానిపింపకపోవుటచే మిగుల దుఃఖించి "అరణ్యమునకు నాతమ్ముఁ డరుగఁగాఁ, గృష్ణుఁడు మణినిమిత్తము వానిని జంపినాఁ" డని సత్రాజిత్తు కృష్ణునిపై నిందవేసెను. కృష్ణుఁ డిది విని యకారణముగఁ దనపైఁ బడినయీనిందఁ బాపుకొనఁ దలఁచి, ప్రసేనుజాడఁ దీయుచు నరణ్యమునకుఁ బోయెను. అచ్చట నాతనికిఁ, బ్రసేనుని సింహము చంపినవిధమును, సింహమును వధించి భల్లుకము గుహలోనికిఁ జొచ్చినవిధమును గానిపించెను. అంతట నాతఁడు తనతో వచ్చినవారిని గుహాముఖంబున నుండ నియమించి, తాను లోపలికిఁ బోయెను. ఆగుహ, నిబిడాంధకారబంధుర మై, మిగుల భయంకరముగ నుండెను. అం దొకయుయ్యాలకుఁ గట్టఁబడియున్న శమంతక మాతనికిఁ గనఁబడెను. ఆతఁడు దానిని గైకొనఁదలఁచి యుయ్యాలను సమీపించుచుండ, నం దున్న బాలిక భీతిచే నేడ్చెను. ఆయేడుపు విని జాంబవంతుఁడు వచ్చి, కృష్ణుని సామాన్యపురుషునిగా భావించి, యాతనితో యుద్ధమునకుఁ గడంగెను. ఇరువురకును నిరువదియెనిమిదిదినములు భయంకర మైనయుద్ధము జరిగెను. తుదకుఁ జాంబవంతుఁ డాతనిని బరమాత్మునిగా నెఱింగి,

"సీ. బాణాగ్ని నెవ్వఁడు ♦ పఱపి పయోరాశి
నింకించి బంధించి ♦ యేపుమాపెఁ
బరఁగ నెవ్వఁడు ప్రతా ♦ పప్రభారాశిచే
దానవగర్వాంధ ♦ తమస మడఁచెఁ
గంజాతములు ద్రెంచు ♦ కరిభంగి నెవ్వఁడు
దశకంఠుకంఠబృం ♦ దములు ద్రుంచె
నాచంద్రసూర్యమై ♦ యమరులంకారాజ్య
మునకు నెవ్వఁడు విభీ ♦ షణుని నిలిపె

తే. నన్ను నేలినలోకాది ♦ నాథుఁ డెవ్వఁ
డంచితోదారకరుణార ♦ సాబ్ధి యెవ్వఁ
డాతఁడవు నీవకావె మ ♦ హాత్మ నేఁడు
మాఱుపడి యొగ్గుసేసితి ♦ మఱవ వలయు."

అని పలికి, యామాధవునిపాదంబులపైఁ బడి యనేకవిధంబులఁ బ్రస్తుతించెను. శ్రీహరి తనకరంబులచే జాంబవంతుని శరీరము నిమిరి "భల్లూకేంద్రా! ఈమణి నాచేఁ బడెనని దుష్టాత్ములు వేసిననిందఁ బాపుకొనుటకై యిట్లు వచ్చితి" నని పలికెను. భల్లూకేంద్రుఁడు శమంతకమణితోఁ శ్రీహరికిఁ దనపుత్రికామణి యగుజాంబవతినిగూడ నొసంగి కృతార్థుఁ డయ్యెను.

ఇట్లు శ్రీకృష్ణుఁడు మణిని దీసికొని జాంబవతితో ద్వారకకు వచ్చి, సత్రాజిత్తును బిలిపించి, జరిగినవృత్తాంత మెఱింగించి, యామణి నాతని కొసంగెను. సత్రాజిత్తు లజ్జనంది

మణిఁ గైకొని నిజగృహంబున కేగి, హరిపై నకారణముగ నింద వేసితినిగదా యని చింతించి, యాతనిని బ్రసన్నునిగాఁ జేసికొననెంచి, తనతనూజయగు సత్యభామనొసంగి వివాహము గావించెను.

ఈవివాహ మైనకొన్నాళ్లకుఁ బాండవులు లాక్షాగారంబున దగ్ధులైరని విని, సర్వ మెఱింగినవాఁ డయ్యును, గృష్ణుఁడు బలభద్రసహితముగా ధృతరాష్ట్రాదుల నూఱడించుటకు హస్తినాపురంబున కరిగెను. ఆసమయమున శతధన్వుఁ డనువాఁడు సత్రాజిత్తు సత్యభామను దన కీయలే దనుకోపంబున, నాతఁడు నిద్రవోవుచుండఁగాఁ జంపివేసి, శ్యమంతకమణిని గొంపోయెను. మృతుండైనతండ్రికై సత్యభామ మిగుల శోకించి, యాతనికళేబరమును దైలద్రోణియందుఁ బెట్టించి, హస్తినాపురమున కరిగి యావృత్తాంతముఁ గృష్ణున కెఱింగించెను. కృష్ణుఁడు బలరామసత్యభామాసహితుఁడై వెంటనే ద్వారకకు వచ్చెను. శతధన్వుఁడు కృష్ణుఁడు తన్నుఁ జంపు నని భయంబంది, కృతవర్మయనువానిపాలికిఁ బోయి తనకు సహాయుఁడవు గమ్మని వేఁడెను. అందులకుఁ గృతవర్మ శతధన్వునిఁ గాంచి "బలరామకృష్ణులు మహాత్ములు. వారి కెగ్గుసల్పుట కెవ్వఁడు సాహసించును? వారిబలపరాక్రమములు మనమెఱింగినవే," యని ప్రత్యుత్తరము చెప్పెను. అంతట నాతఁ డక్రూరుఁ డనువానికడ కేగి తత్సహాయము నపేక్షించెను. అక్రూరుఁ డిట్లు బదులుచెప్పెను. "సృష్టిస్థితిల

యంబులకు గర్త యైనవాఁడును, బ్రహ్మాదుల కైనను దెలియఁబడనివాఁడును నగు శ్రీమన్నారాయణుఁ డైనయాకృష్ణునకు నేను నిరంతరము మ్రొక్కుదును, అంతియే గాని యాతనితో ద్వేషమునకు వెఱతును."

ఇఁక శతధన్వున కేమియు మార్గముఁ దోఁచక శమంతకమణి నక్రూరునియొద్ద నుంచి, ద్వారకాపురము విడిచి శతయోజనదూరము చనియెను. కృష్ణుఁ డాతని వెన్నంటిపోయి తచ్ఛిరంబును జక్రముచేఁ ద్రుంచెను. కాని యాతనియొద్ద మణిమాత్రము లేదయ్యెను. కృష్ణుఁడు ద్వారకకు వచ్చి శతధన్వుని మరణమును, నాతనియొద్ద మణి లేకపోవుటయు సత్యభామకుఁ జెప్పెను. శతధన్వుని మరణము విని యక్రూరుఁడు వెఱచి ద్వారకానగరము విడిచి బహుయోజనదూర మరిగెను. వృద్ధులవాక్యము ననుసరించి, దూతలం బంపి, కృష్ణుఁ డక్రూరుని రావించి మృదువాక్యములతో నిట్లనెను. "అక్రూరా! శతధన్వుఁడు నీయొద్ద మణి దాఁచినసంగతి నే నెఱుంగుదును. సత్రాజిత్తునకుఁ బుత్రులు లేక పోవుటచే నాతనికిఁ బుత్రికలాతనిధనమును విభజించుకొందురు. ఆమణిని నీవే గ్రహింపుము. మాబలభద్రుఁడు దీనివిషయమై నన్ను నమ్మకయున్నవాఁడు." అప్పు డక్రూరుఁడు తనవస్త్రమునకుఁ గట్టబడియున్న మణిని హరికి సమర్పించెను.

## 29. [శిశుపాలవధ.]

:o:

ద్వారకాపురంబున నొకనాఁడు శ్రీకృష్ణుఁడు సభా మధ్యంబునఁ గొలువున్న సమయమున నొకభూసురుం డరుదెంచి, యమ్మహాత్మునకు నమస్కరించి "దామోదరా! మగధనాథుం డగుజరాసంధుఁడు బలపరాక్రమముల గర్వించి, తనకు మ్రొక్కనిధారుణీశ్వరుల నెల్లరఁ బట్టి గిరివ్రజంబున బందిగంబునఁ బెట్టినాఁడు. బంధితులైనయానృపాలురు నన్ను నీకడకుఁ బుత్తేర వచ్చితి" నని వలికి, యానరపాలుర సందేశ మిట్లు వచించెను.

"నందకుమారా! గోపాలదేవా! ఆర్తజనులమైన మమ్ము రక్షింపుము. నీకు మ్రొక్కుచుంటిమి. నీచరణయుగమే మాకు శరణము. అనంతా! బలియుర దండించుటకును, దుర్బలుల శిక్షించుటకును యుగయుగంబున నీ వవతరించుచుందువు. నీకుఁ దెలియనియర్థ మీజగతియందు లేదు. పద్మభవాదులైనను నీపంపు సేయక నిలువఁజాలరు. రణరంగమున నిన్నెదిరింపఁజాలక జరాసంధుఁడు పదునెనిమిదిమాఱులు వెన్నీయలేదా! ఆతఁడు నీచేఁ బడిన బన్నములు దలంపక మమ్ముఁ జెఱపట్టి మిగుల బాధించుచున్నాఁడు. కావున మాయందుఁ గృపాంతరంగుఁడవై, యాదుష్టునిఁ గూల్చి మమ్ముఁ జెఱఁబాపి, యాలుబిడ్డలతోఁ గూర్పుము."

భూసురుం డిట్లు రాజులసందేశంబును జెప్పుచున్న సమయమున వివేకవిశారదుం డగునారదుండు వచ్చి, కృష్ణునిచేఁ బూజింపఁబడి, యిట్లువచించెను. "కృష్ణా! పాండుసుతుం డగు ధర్మరాజు రాజసూయమహాధ్వరము సేయఁదలఁచి యున్నాఁడు. ఆతఁడు సుగతివడయుటకు, నాత్మబంధుఁడవును, భక్తవత్సలుఁడవును, పరమపురుషుఁడవును, యజ్ఞరక్షకుఁడవును, యజ్ఞభోక్తవు నగునీసేవయే చాలును. కాని లోకవిడంబనార్థ మాతఁ డాయాగమును జేయసంకల్పించినాఁడు. కావునఁ దత్క్రతుసంరక్షణార్థము నీవచ్చటికివిచ్చేయుము. మఖసందర్శనోత్సాహంబున నరుదెంచు సమస్తమునీంద్రులును, నృపాలురును నీమహామహిమఁ గాంచి కృతార్థు లగుదురు."

కృష్ణునకుఁ గడుఁగూర్చు మిత్రుఁ డగు నుద్ధవుఁడు గూడ నందుల కాతనిఁ బ్రేరేచెను. అంతటఁ గృష్ణుఁడు నారదుని వీడ్కొలిపి, నృపాలురదూత యైనధరామరున కభయప్రదాన మిచ్చి పంపించెను. అనంతరము కృష్ణుఁడు నిజాంగనాసుతబంధుమిత్రసహితుఁడై యింద్రప్రస్థపురంబునకుఁ జనెను. అనుజసహితుం డగుధర్మరాజు గోపాలునిరాకను మిగులఁ బ్రమోదం బంది యాతనిఁ బెక్కువిధంబులఁ బూజించెను. శ్రీహరి యుధిష్ఠిరుని సముచితపరిచర్యల కలరి, యచ్చటఁ గొన్నినెల లుండెను. ఇట్లుండ నొకనాఁడు ధర్మనందనుఁడు నందనందనునిఁ గాంచి "మహాత్మా! రాజసూయమహాధ్వరం బొనర్పఁ గోరిక జనించినది. అయ్యది నిర్వహింప, నాకాత్మ

బంధుఁడ వగుసీ కుంటి వనియే దాని నౌనర్పఁ దలంచితిని. ఎవ్వరు నిరంతరము నీపదాంబుజసేవఁ గావింతురో, ఎవ్వరు నిన్ను నుతింతురో, వారు నిత్యమంగళసౌఖ్యంబులఁ గాంతురు," అని పలికెను. అందులకు యశోదాసుతుం డిట్లనెను. "యుధిష్ఠిరా! నీతలం పెంతయు మంచిదై యున్నది. దీనివలన శాత్రవక్షయమును, బాంధవ ప్రియమును, కీర్తియుఁ, బుణ్యమును గలుగును. దివ్యాస్త్రవేదు లయిన నీసహోదరులు మిమ్ము రణంబునఁ దాకు వైరినృపాలురను బీచమడంపఁగలరు. వివిధనృపాలురను గెలిచి చక్రవర్తివై రాజిల్లుదువు గాక! మఖరాజమునకుఁ గావలసిన సంభారంబుల సమకూర్చి నీయనుజులను దిగ్విజయార్థము పంపుము."

కృష్ణునివాక్యములకు ధర్మరాజు సంతసించి యొక సుదినంబున నలువురుతమ్ములను నలుదిక్కులకును దిగ్విజయార్థము పంపెను. అట్లు పంపఁబడిన భీమార్జుననకులసహదేవులు నానారాజుల గెలిచి, వారివలనఁ గప్పంబులఁ గొని మఖార్థ మెంతయో ధనము దెచ్చి ధర్మజునకు సమర్పించిరి. మగధనాథుం డగుజరాసంధుఁడు మాత్ర మరివెట్టలే దని యర్జునుఁడు ధర్మసూతికి కెఱింగించెను. ఆమాటవిని ధర్మరాజేమియు బదులుచెప్పఁజాలక యూరకుండగాఁ గృష్ణుఁ డాతనిఁ గాంచి "యమనందనా! జరాసంధుని జయించుట కొక యుపాయ మున్నది. అతఁడు విప్రులయం దధికభక్తి గలిగి, వారు వేఁడినదానిని వృథసేయక యిచ్చుచుండును. కావున

నేనును భీమార్జునులును బ్రాహ్మణవేషములతో వానికడకుఁ బోయి రణభిక్ష నడిగిన, నాతఁ డొసంగును. అప్పుడు మల్ల యుద్ధమున వానిని మనభీమునిచేఁ బిల్కుమార్పించెద” నని పలికెను. ధర్మజుఁ డందులకు సమ్మతించెను.

అనంతరము కృష్ణభీమార్జునులు బ్రాహ్మణాకృతులతో మాగధుని రాజధానియైన గిరివ్రజంబునుఁ జేరి, జరాసంఘుని మందిరంబును బ్రవేశించిరి. అతిథిపూజాతత్పరుం డగు జరాసంధుఁడు వారి కెదురుగ వచ్చి దండప్రణామంబు లాచరించి పూజించెను. కృష్ణుఁ డాతనిం గాంచి యిట్లనియెను. “ధరణీశ్వరా ! అతిథిపూజాపరుఁడ వగుని కీర్తిలతిలుదశదిశలం బ్రాఁకియున్నవి. సంతతము నతిథులఁ బూజించి, యుచితసత్కారములు చేయుసజ్జనులు శాశ్వతకీర్తిఁ బొందుదురు. దేహం బస్థిరం బని తలంచి, కీర్తినందని పురుషుఁడు జీవన్మృతుఁ డని చెప్పవలయును. వదాన్యుల కీయరాని పదార్థ మొక్కటియు లేదు. బృందారకులు గోరఁగా దధీచి మహాముని తనవెన్నెముకల నిచ్చెను. అడిగినయంతనే వృథసేయక, కిరాతున కాఁకలిదీర్చుకొనుటకుఁ గపోతము తనశరీర మిచ్చెను. శ్యేనక వాయసరూపములవచ్చిన యింద్రాగ్నులకు శిబిచక్రవర్తితన మేనికండలఁ గోసి యిచ్చెను.”

కృష్ణుని మేఘగంభీరభాషణంబులకుముదంబంది యమ్మాగధుఁడు తనయంతరంగమున “వీరు బ్రాహ్మణాకృతి నున్నరాజులుగాఁ గనిపించుచున్నారు. అయిన నేమి? వీరు కోరినదాని

నొసంగుదు. ఈదేహము లస్థిరములు. సంపదలు చంచలములు. భూమిపై నిలిచియుండునది కీర్తియొక్కటియే" యని తలంచి, కపటబ్రాహ్మణులఁ గాంచి,

"క. భూరిగుణులార మీమది
కోరిక యెఱిఁగింపుఁ డేమి ♦ కోరిన నైనన్
ధీరత నొసఁగుటయే కా
దారయ నాశిరము ద్రుంచి ♦ యైనను నిత్తున్."

అని పలికెను. అప్పుడు కృష్ణుఁడు— తానుగృష్ణుఁడ ననియుఁ, దక్కిన యిరువురును భీమార్జునులనియుఁ దెలిపి, రణభిక్షగోరుచు ముప్వురిలో నెవ్వనితో నైనను బోరు మనియెను. అందులకు జరాసంధుఁడు నవ్వి, కృష్ణునిఁ గొన్ని పరిహాసవాక్యము లాడి, తనతోఁ బోరుటకు భీముఁడే తగినవాఁ డని చెప్పి,మల్లయుద్ధమునకు సంసిద్ధుఁ డయ్యెను. కృష్ణానుమతుఁడై భీముఁ డాతనిఁ దాఁకెను. ఇరువురును నొకరికొకరు తీసిపోకుండ నతిభయంకరముగఁ బోరిరి. తుదకు భీముఁడు జరాసంధుని నేలఁబడవైచి, శరీరము రెండగునట్లు జీల్చి వేసెను. కృష్ణార్జునులు భీముని పరాక్రమమునకు మోదమంది పొగడిరి. కరుణామూర్తియగు వాసుదేవుఁడు జరాసంధునిమారుఁ డగుసహదేవునకుఁ బట్టముగట్టి, జరాసంధునిచే బంధితులైయున్న రాజులకు బంధవిముక్తి గలిగించెను. రాజులందఱును గృష్ణునకు నమస్కరించి, యనేకవిధంబుల సన్నుతించి, తమతమదేశంబులకుఁ బోయిరి.

కృష్ణుఁడును జరాసంధ తనయుఁడు సేయుపూజలఁ గైకొని భీమార్జునులతో నింద్రప్రస్థపురంబుఁ జేరి, జరిగినవృత్తాంత౦బంతయు నంతకనందనున కెఱింగించెను.

తరువాత ధర్మనందనుఁడు వాసుదేవునిచే ననుజ్ఞాతుఁడై యజ్ఞదీక్షఁ బూనెను. క్రతుమహోత్సవమును దిలకించుటకు ధర్మజునిచే నాహ్వానింపఁబడి నానాదేశనృపాలురును,మునులును వచ్చిరి. ఆయ్యాగంబునందు సకలధరాధీశులుఁ దెచ్చుకానుక లందుకొనుటకు దుర్యోధనుఁడును, నర్థులు గోరినవస్తుజాల మిచ్చుటకుఁ గర్ణుఁడును, సరసరసాన్నాదిపదార్థములు పాకముల సేయించుటకు భీముఁడును, కృష్ణునివిమవక పరిచర్య సేయుటకు నర్జునుఁడును, సవనార్థము గావలసినద్రవ్య మిచ్చుచుండుటకు నకులుఁడును, గురువృద్ధభూసురులను బూజించుటకు సహదేవుఁడును, అందఱిని నాహారవిషయంబునఁ దృప్తులఁ జేయుటకు ద్రౌపదియు నియోగింపఁబడిరి. యాగము మహావైభవముగాఁ జరుగుచుండెను. యాగసమాప్తిదినమున యుధిష్ఠిరుఁడు యాజకసదస్యగురుభూసురకోటినిఁ బూజింపఁదలంచి యగ్రపూజ కర్హు లెవ్వరని సదస్యు లనడిగెను. అప్పుడు సభయం దెవ్వరికిఁ దోఁచినవిధంబున వారు చెప్పుచుండిరి సహదేవుఁడు వారివాక్యముల వారించి ధర్మజున కిట్లు పలికెను "అగ్రజా ! భగవంతుఁడైనవాసుదేవుని సంతుష్టుం జేసి తేని, పదునాల్గుభువనములు ను సంతుష్టిఁ బొందును. జనవృద్ధిలయంబుల కీతఁడు కారణుం డని యెఱుంగుము

క్రతుఫలదుం డైనయీమహాత్ముండే శిష్టపూజ కర్హుండు. కావున నీ వీదేవాదిదేవునిం బూజించి ధన్యుండ వగుము."

సహదేవునివాక్యముల కందఱును సంతోషించిరి. ధర్మజుండు విమలసలిలంబుచే నందనందనునిచరణారవిందములం బ్రక్షాళనముం జేసి, తజ్జలంబులు శిరముపైం జల్లుకొని, యమూల్యరత్నకనకాంబరముల నర్పించి పూజించెను. సభయం దున్న శిశుపాలుం డదిసహింపం జాలక సభ్యులం గాంచి యిట్లు పలికెను. "సహదేవుని వాక్యము లాలించి ధర్మజుండు వాసుదేవునిం బూజించి తనయవివేకమును వెల్లడించినాండు. రారాజులు, తత్త్వవేత్తలు, మునులు నుండంగా గులగోత్రరహితుం డగునీయాదవుండు పూజార్హుండగునా! ఈతండు జారుండు. చోరుండు. వావివరుసలులేనివాండు." అని యనేకవిధంబులం దూషించుచుం గయ్యంబునకు సంసిద్ధుం డగుచున్నశిశుపాలుని గాంచి, తన్మస్తకము నాక్షణముననే చక్రంబుచేం దునిమెను. ఆసమయమున సభ్యులెల్లరును సత్యాశ్చర్యమంద శిశుపాలుని శరీరమునం దున్నయద్వితీయతేజము వాసుదేవుని శరీరమునం బ్రవేశించెను. విఘ్నమావంతయు లేకుండ రాజసూయము పరిసమాప్త మయ్యెను.

సంపూర్ణము.

---

శ్రీసత్యానందప్రెస్, ఇన్నీసుపేట, రాజమండ్రి.